ప్రకటనల కోసం
సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం 21.02.2025 | సంపుటి : 11 సంచిక : 221 | పేజీలు : 12 వెల: రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370

సామాన్యుని స్వరం
జనంసాక్షి tv
JANAMSAKSHI
JANAMSAKSHI TV

తెలంగాణ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

## ప్రజాప్రతినిధుల కోర్టుకు సీఎం రేవంత్

**ఎన్నికల ప్రచార సమయంలో నమోదైన కేసుల నిమిత్తం హాజరైన ముఖ్యమంత్రి**



**హైదరాబాద్(జనంసాక్షి):** నాంపల్లిలోని ప్రజాప్రతినిధుల కోర్టుకు సీఎం రేవంత్‌రెడ్డి హాజరయ్యారు. ఎన్నికల ప్రచార సమయంలో రేవంత్‌రెడ్డిపై నల్గొండ టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో, బేగంబజార్ పీఎస్‌లో, మెదక్ జిల్లా కౌడిపల్లి పీఎస్ పరిధిలో మొత్తం మూడు కేసులు నమోదయ్యాయి. ఈ కేసుల విచారణ నిమిత్తం ఆయన కోర్టుకు హాజరయ్యారు. రేవంత్‌రెడ్డి ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు.. భారాస ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా కేసులు నమోదు చేసిందని టీపీసీసీ లీగల్‌సెల్ వైస్ ఛైర్మన్ తిరుపతి వర్మ తెలిపారు. తదుపరి విచారణను ప్రజాప్రతినిధుల కోర్టు మార్చి 23కి వాయిదా వేసింది.

## 7 రోజుల్లోగా ఆయుధాల్ని సరెండర్ చేయండి

**మణిపూర్ ప్రజలకు గవర్నర్ విజ్ఞప్తి**



**ఇంఫాల్(జనంసాక్షి):** రాష్ట్రపతి పాలన అమలులో ఉన్న మణిపూర్ ప్రజలకు గవర్నర్ అజయ్ కుమార్ భల్లా కీలక విజ్ఞప్తి చేశారు. తమ వద్ద ఉన్న అక్రమ ఆయుధాలు, పేలుడు పదార్థాలను ఏడు రోజుల్లోగా అప్పగించాలని రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు విజ్ఞప్తి చేశారు. లేదంటే కఠిన చర్యలు తప్పవనిహెచ్చరించారు.

మిగతా 2లో..

# తెలంగాణలో జలదోపిడీ జరిగింది

## బీఆర్ఎస్ అండతోనే ఏపీ యధేచ్ఛగా తరలించుకుపోయింది

- కృష్ణా జలాల్లో 200 టిఎంసిలు చాలన్న ఘనులు బీఆర్ఎస్ నేతలు
- శ్రీశైలం,సాగర్‌లను ఏపీకి అప్పగించి చోద్యం చూశారు
- తద్వారా నీటిపారుదల రంగాన్ని సర్వనాశనం చేశారు
- 'కాళేశ్వరానికి రూ.లక్షా 85 వేలకోట్లు ఖర్చు చేసి ఎకరాకు నీళ్లివ్వలేదు
- సగం పూర్తయిన ప్రాజెక్టులను కేసీఆర్ పట్టించుకోలేదు
- జగన్‌తో స్నేహంగా ఉంటూ.. ఏపీ జలదోపిడీకి భారాస సహకరించారు
- విభజన చట్టం అమలు కోసం ఆయన ఎలాంటి ప్రయత్నం చేయలేదు
- కమీషన్ల కక్కుర్తితో అధిక వడ్డీకి వేల కోట్లు అప్పలు తెచ్చారు
- బీఆర్ఎస్ ప్రభుత్వ నిర్వాకంపై మండిపడ్డ ఉత్తమ్ కుమార్ రెడ్డి



**హైదరాబాద్(జనంసాక్షి):** ఏపీ ప్రభుత్వం చేస్తున్న జలదోపిడీకి భారాస ప్రభుత్వం సహకరించిందని తెలంగాణ నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కృష్ణా జలాల్లో తెలంగాణకు కేవలం 200 టీఎంసీలు సరిపోతాయని చెప్పిన ఘనత భారాసదని విమర్శించారు. నీటి పారుదల రంగాన్ని పూర్తిగా నాశనం చేసిన ఘనత బీఆర్ఎస్ దేనని కమిషన్ల కక్కుర్తితో అధిక వడ్డీకి వేల కోట్లు అప్పులు తెచ్చారని ఆరోపించారు. అప్పుల నుంచి బయటపడేందుకు తాము ప్రయత్నిస్తుంటే..బీఆర్ఎస్ నేతలు అడ్డగోలుగా మాట్లాడుతున్నారని విమర్శించారు.

మిగతా 2లో..

## 21న కేఆర్ఎంబీ సమావేశం

**మంత్రి ఉత్తమ్ ఫిర్యాదు మేరకు భేటి కానున్న బోర్డు**



**హైదరాబాద్(జనంసాక్షి):** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కృష్ణా జలాలను అక్రమంగా తరలిస్తోందని తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి కృష్ణానదీ యాజమాన్య బోర్డుకి ఫిర్యాదు చేశారు. ఈనేపథ్యంలో కేఆర్ఎంబీ ఛైర్మన్ అతుల్ జైన్ అధ్యక్షతన శుక్రవారం మధ్యాహ్నం బోర్డు సమావేశం కానుంది. శ్రీశైలం,

మిగతా 2లో..

## ఇప్పటికైనా ఏపీ జలదోపిడీని అడ్డుకోండి

**కృష్ణా జలాలపై కేంద్రంపై ఒత్తిడి తీసుకురండి**

**బీఆర్ఎస్ పాలాలకు నీళ్లు పారిస్తే.. కాంగ్రెస్ నీళ్లు నములుతోంది**

**మాజీ మంత్రి హరీశ్‌రావు**



**హైదరాబాద్(జనంసాక్షి):** కాంగ్రెస్ ప్రభుత్వం మొద్దు నిద్ర వీడి, ఆంధ్రప్రదేశ్ చేస్తున్న జల దోపిడీని అడ్డుకోవాలి అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు సూచించారు. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. రేవంత్ సర్కారుకి చేతకాకపోతే మేము వస్తాం.. ఢిల్లీకి పోదాం. ధర్నా చేద్దాం.. పదండి అని హరీశ్‌రావు పేర్కొన్నారు. తెలంగాణ భవన్ లో హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర సాగు, తాగు నీటి ప్రయో జనాలకు తీవ్ర నష్టం జరుగుతుంటే రాష్ట్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోంది. సోయి లేని ప్రభుత్వం అధికారంలోకి వస్తే రాష్ట్రానికి ఎంత నష్టం జరుగుతుందో అర్థం అవుతోంది. నీళ్ల మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నీళ్లు నములుతున్నారు. బీఆర్ఎస్ తెలంగాణ భూములకు నీరు పారిస్తే కాం గ్రెస్ నీళ్లు నములుతోంది. సాగర్ కుడి కాల్వ నుంచి రోజూ పది వేల క్యూసెక్కులు మూడు నెలలుగా పోతున్నా పట్టించుకోవడం లేదు. తాత్కాలిక వాటా అయినా 512 టీఎంసీలకు మించి 657 టీఎంసీలు తీసుకుపోయింది. 25 రోజుల్లోనే 65

మిగతా 2లో..

## లోక్‌పాల్ ఉత్తర్వులపై సుప్రీం స్టే



**న్యూఢిల్లీ(జనంసాక్షి):** హైకోర్టు న్యాయమూర్తులను విచారించే అధికారం తమకు ఉందంటూ లోక్‌పాల్ ఇచ్చిన ఉత్తర్వులపై గురువారం సుప్రీంకోర్టు స్టే విధించింది. ఈ ఉత్తర్వులు న్యాయవ్యవస్థను భంగపరిచేవిధంగా ఉన్నాయని పేర్కొంది. కేంద్రానికి, లోక్‌పాల్ కార్యాలయానికి, ఫిర్యాదుదారునికి నోటీసులిచ్చింది.రాష్ట్రంలోని

మిగతా 2లో..

## సామాజిక కార్యకర్త రాజలింగమూర్తి హత్య కేసులో సీబీసిఐడి విచారణ

**తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం**

హత్య రాజకీయాలను ప్రోత్సహిస్తున్న బీఆర్ఎస్

హత్య కేసుపై ఫాస్ట్రాక్ కోర్టులో విచారిస్తాం

దీని వెనుక బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీశ్‌రావుల హస్తం ఉంది: : మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



**హైదరాబాద్(జనంసాక్షి):** జయశంకర్ భూపాలపల్లిలో సామాజిక కార్యకర్త రాజలింగమూర్తి హత్య తీవ్ర కలకలం రేపుతోంది. లింగమూర్తి హత్య ఘటనను తెలంగాణ ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. ఈ హత్యపై సీబీసీఐడీ ఎంక్వైరీ వేయాలని నిర్ణయించింది. మేడిగడ్డ అవినీతిపై పోరాడుతున్నందుకే లింగమూర్తిని హత్య చేసారని కాంగ్రెస్ ఆరోపిస్తోంది. మరోవైపు మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, ఆయన అనుచరులే రాజలింగమూర్తిని చంపారని మృతుడి భార్య, కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు. మాజీ ఎమ్మెల్యే తన అనుచరుల ద్వారా నడిరోడ్డు మీద తన భర్తను హత్య చేయించారన్న రాజలింగమూర్తి భార్య సరళ ఆరోపించారు. అన్ని ఆపేస్తే పది లక్షల రూపాయలు ఇస్తామని గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారని తెలిపారు. మేడిగడ్డ కేసు గెలుస్తామని అక్కస్సుతో తన భర్తను దారుణంగా హత్య

మిగతా 2లో..

## కేసీఆర్ చెప్పినంత మాత్రాన కాంగ్రెస్ గ్రాఫ్ పడిపోతుందా?

**ఆయన ఇంకా పగటి కలలుకంటున్నాడు : పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్**

- పట్టభద్రుల ఎన్నికల్లో అభ్యర్థిని నిలబెట్టేసత్తాలేని బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి వస్తుందని చెప్పడం హాస్యాస్పదంగా ఉంది
- ఆయన ఫామ్‌హౌజ్‌లోనే శాశ్వతంగా విశ్రాంతి తీసుకుంటే ఆరోగ్యానికి మంచిదని హితవు




**నిజామాబాద్(జనంసాక్షి):** కేసీఆర్ చెప్పినంత మాత్రాన మా కాంగ్రెస్ పార్టీ గ్రాఫ్ పడిపోయినట్లా అని అని పీసీసీ చీఫ్ బీ. మహేష్ కుమార్ గౌడ్ ప్రశ్నించారు. బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ చేసిన వ్యాఖ్యలపై మహేష్ కుమార్ గౌడ్ తీవ్రంగా స్పందించారు. నిజామాబాద్‌లో మీడియాతో మాట్లాడుతూ, కేసీఆర్‌కు పగటి కలలు కనడం అలవాటుగా మారిపోయిందని, ఆయన శాశ్వతంగా విశ్రాంతి తీసుకుంటే ఆరోగ్యానికి మంచిదని సూచించారు. పట్టభద్రుల ఎన్నికల్లో అభ్యర్థిని నిలబెట్టే సత్తాలేని బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి వస్తుందని చెప్పడం హాస్యాస్పదంగా ఉందని విమర్శించారు. 'ఫామ్ హౌజ్‌లో విశ్రాంతి తీసుకునే కేసీఆర్‌కు ,అభివృద్ధిని పరుగులెత్తించే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పోలికేంటని' అంటూ మండిపడ్డారు. ప్రజలు తమ వెంటే ఉన్నప్పుడు, కాంగ్రెస్ బలంగా కొనసాగుతున్న సమయంలో, గ్రాఫ్ తగ్గిపోతుందన్న అభిప్రాయం అసత్యమని ఖండించారు. ఫామ్ హౌజ్‌లో కూర్చొని పెన్ను, పేపర్ తీసుకుని గ్రాఫ్ గీస్తే, కాంగ్రెస్ పార్టీకి మద్దతు తగ్గిపోతుందా? అంటూ కేసీఆర్‌ను ఎద్దేవా చేశారు. ఏడాదిలో 56,000 ఉద్యోగాలను కల్పించిన విషయాన్ని గుర్తు చేశారు. రైతులకు రుణమాఫీ సహా పలు కీలక హామీలను అమలు చేసినట్లు వివరించారు. ఇలాంటి పరిస్థితుల్లో, కాంగ్రెస్ గ్రాఫ్ తగ్గిపోతుందనే వాదన నమ్మశక్యం కాదని స్పష్టం చేశారు. కేసీఆర్ గ్రాఫ్ పూర్తిగా కిందపడిపోయి, ఫామ్ హౌజ్‌కే పరిమితం అయిపోయిందని వ్యాఖ్యానించారు. 'నీ అల్లుడు, బిడ్డ హరీష్ రావు, కవితలు ఇతర పార్టీల వైపు చూస్తున్నారు. ఇదే మీ పార్టీ పరిస్థితిని అర్థమయ్యేలా చేస్తుంది' అంటూ కేసీఆర్‌కు చురకలంటించారు. రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ పార్టీ పూర్తిగా అదృశ్యం అవుతుందని, ఆ పార్టీలో తండ్రి, కొడుకు మాత్రమే మిగిలిపోతారని గౌడ్ వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు.

## కాళేశ్వరం విచారణ కమిషన్ గడువు పొడిగింపు

**హైదరాబాద్(జనంసాక్షి):** కాళేశ్వరం ఎత్తిపోతల బ్యారేజీల్లో అవకతవకలపై న్యాయవిచారణ చేస్తున్న జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ గడువును మరోమారు రాష్ట్ర ప్రభుత్వం పొడిగించింది.ఇప్పటి వరకు పొడిగించిన గడువు ఈ నెలాఖరు వరకు ఉన్న పరిస్థితుల్లో... ఏప్రిల్ 30 వరకు కమిషన్ గడువు పొడిగిస్తూ నీటిపారుదల శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. జస్టిస్ పీసీ ఘోష్ ఈనెల 23న హైదరాబాద్ రానున్నారు. కాళేశ్వరం ఆన కట్టలకు సంబంధించి తదుపరి విచారణ కొనసాగించనున్నారు.ఈ దఫాలో మిగిలిన విచారణ, క్రాస్ ఎగ్జామినేషన్ ప్రక్రియను కమిషన్ పూర్తి చేసే అవకాశం ఉంది. పరిస్థితిని బట్టి కొంత మంది ఇంజనీర్లు, అధికారులు, గుత్తేదార్లను విచారణకు పిలిచే అవకాశం ఉంది. గత ప్రభుత్వ పెద్దలను కూడా విచారణకు పిలిచే అవకాశం లేకపోలేదు.





## పనామాలో భారతీయులు సేఫ్


**వలసదారుల నిర్బంధంపై వార్తల నేపథ్యంలో స్పందించిన భారత ఎంబసి**

**న్యూయార్క్(జనంసాక్షి):** అమెరికా నుంచి బహిష్కరణకు గురైన అక్రమ వలసదారులను ఆ దేశ మిలిటరీ పనామాకు చేర్చిన సంగతి తెలిసిందే. అయితే.. అక్కడి హోటల్‌లో భారతీయులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారంటూ వచ్చిన వార్తలపై పనామా, నికరాగ్వా, కోస్టారికా దేశాల్లోని భారత రాయబార కార్యాలయం

మిగతా 2లో..

## అడల్ట్ కంటెంట్ లేకుండా చూడండి

**ఓటిటి ప్లాట్‌ఫామ్‌లకు కేంద్ర ప్రభుత్వం హెచ్చరిక**




**న్యూఢిల్లీ(జనంసాక్షి):** 'ఇండియాస్ గాట్ లాటెంట్' కార్యక్రమంలో రణ్‌వీర్ అల్హాబాదియా చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపిన క్రమంలో ఐటీ రూల్స్‌లోని కోడ్ ఆఫ్ ఎథిక్స్‌ను ఓటీటీలు, సామాజిక మాధ్యమాలు తప్పనిసరిగా పాటించాలని కేంద్రం హెచ్చరించింది.

మిగతా 2లో..

## గత బైడెన్ ప్రభుత్వం నాతో అత్యంత దారుణంగా వ్యవహరించింది

**ఓడిపోయుంటే నా జీవితం దారుణంగా ఉండేది: ట్రంప్**

- బైడెన్ భారత్‌లో ఎవర్నో గెలిపించేందుకు ప్రయత్నం చేశాడు
- భారత్‌లో టెస్లా కార్ల తయారీ ఫ్యాక్టరీ ఏర్పాటు సరికాదు
- ఎలాన్‌మస్క్ నిర్ణయంపై అమెరికా అధ్యక్షుడి అసంతృప్తి
- చైనాతో డీల్ కుదుర్చుకుంటామని ప్రకటన



**వాషింగ్టన్(జనంసాక్షి):** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 2024 అధ్యక్ష ఎన్నికల్లో తన విజయంపై కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ ఎన్నికల్లో ఓడిపోయి ఉంటే తన జీవితం దారుణంగా ఉండేదన్నారు. గత ప్రభుత్వం తనతో అత్యంత దారుణంగా వ్యవహరించిందని ఆరోపించారు. మియామిలో నిర్వహించిన ఓ సదస్సులో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.అధ్యక్ష ఎన్నికల్లో ఓడిపోయి ఉంటే తన జీవితం చాలా ఘోరంగా ఉండేదని ట్రంప్ వ్యాఖ్యానించారు. అంతేకాక.. న్యాయపరమైన సవాళ్లను ఎదుర్కొంటూ జీవితం గడిపే పరిస్థితి వచ్చుండేదన్నారు. అధ్యక్షుడిగా ఎన్నికైనందుకు సంతోషంగా ఉందన్నారు. తాజా ఎన్నికల్లో ఓడిపోయి ఉంటే.. తర్వాత పోటీ చేసేందుకు చాలా ధైర్యం కావాలని మరో ప్రశ్నకు బదులిచ్చారు. ఈసందర్భంగా గత ప్రభుత్వం తనపై అత్యంత దారుణంగా ప్రవర్తించిందంటూ ఆరోపణలు చేశారు. 2024 అధ్యక్ష ఎన్నికల్లో

మిగతా 2లో..

## ట్రంప్ బెదిరింపులకు భయపడం

మెక్సికో అధ్యక్షురాలు క్లాడియా షేన్‌బామ్

2లో

## పాలమూరు బిడ్డలకు అండగా ఉంటా

**మంత్రి జూపల్లి**

**హైదరాబాద్(జనంసాక్షి):** హైదరాబాద్ నగరానికి వచ్చిన పాలమూరు బిడ్డలకు అండగా ఉంటానని తెలంగాణ రాష్ట్ర ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్, టూరిజం, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. కూకట్‌పల్లి ఎల్లమ్మబండ జన్మభూమి కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన పట్నంలో 'పాలమూరు బిడ్డలు.. సంక్షేమ సంఘం' కార్యాలయాన్ని మంత్రి జూపల్లి కృష్ణారావు ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా పట్నంలో పాలమూరు బిడ్డలు సంక్షేమసంఘం

మిగతా 2లో..



## ఢిల్లీ సీఎంగా రేఖాగుప్తా ప్రమాణం

- ప్రమాణం చేయించిన ఎల్జీ వికె సక్సేనా
- హాజరైన ప్రధాని మోడీ, కేంద్రమంత్రులు
- పలువురు సిఎంలు, డిప్యూటి సిఎంలు హాజరు

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి20(జనంసాక్షి):** దేశ రాజధాని దిల్లీలో కొత్త ప్రభుత్వం కొలువుదీరింది. గురువారం మధ్యాహ్నం రామ్‌లీలా మైదానంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రిగా రేఖాగుప్తా ప్రమాణస్వీకారం చేశారు. లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా ఆమెతో ప్రమాణం చేయించారు. 27 ఏళ్ల తర్వాత దిల్లీలో అధికారాన్ని దక్కించుకున్న భాజపా.. ఈ కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించింది. దీనికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ, పలువురు కేంద్ర మంత్రులు, ఎన్డీయే పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, భాజపా అగ్రనేతలు హాజరయ్యారు. ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పాల్గొన్నారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్ తోపాటు కేంద్రమంత్రులు, ఎన్డీయే కీలక నేతలు, 20 రాష్ట్రాల సీఎంలు, డిప్యూటీ సీఎంలు పాల్గొన్నారు. మరోవైపు సినీ, పారిశ్రామిక రంగాల పలువురు ప్రముఖులు సైతం విచ్చేశారు. 27 ఏళ్ల తర్వాత ఢిల్లీలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన నేపథ్యంలో బీజేపీ కార్యకర్తలు, నేతలు సంబరాల్లో మునిగితేలుతున్నారు. ఉదయం ఇంటినుంచి బయల్దేరిన రేఖా గుప్తా.. హనుమాన్ ఆలయంలో పూజలు చేశారు. అనంతరం ఆమె రామ్‌లీలా మైదానానికి చేరుకొని, అందరినీ పలకరించారు.

మిగతా 2లో..

# నిరుపేద యువకుడికి సిఎం రేవంత్ అండ

## వైద్య ఖర్చులను భరించేలా ఆదేశాలు జారీ



**హైదరాబాద్,ఫిబ్రవరి20(జనంసాక్షి):** కండరాల వ్యాధితో బాధపడుతూ వైద్యం చేయించుకోలేక పోతున్న నిరుపేద యువకుడు రాకేష్ గురించి తెలుసుకుని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చలించిపోయారు. తక్షణమే రాకేష్‌కు కావాల్సిన వైద్య సాయం అందించాలని అధికారులను ఆదేశించారు. ఉచితంగా వైద్యం అందించడంతో పాటు రాకేష్ కోసం ఛార్జింగ్ వాహనాన్ని కూడా అందించాలని ముఖ్యమంత్రి సూచించారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు సీఎం ఓఎస్డీ వేముల శ్రీనివాసులు రాకేష్ కుటుంబీకులతో ఫోన్ లో మాట్లాడారు. ప్రభుత్వం నుంచి అన్ని రకాలుగా ఆదుకుంటామని సీఎం తరఫున హామీ ఇచ్చారు. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం రంగయ్యపల్లి గ్రామానికి చెందిన గూళ్ల రాకేష్ చాలా కాలం సూడో మస్క్యులర్ డిస్ట్రోఫీ అనే కండరాల వ్యాధితో బాధపడుతున్నాడు. ఇటీవల వ్యాధి తీవ్రత పెరగడంతో నడవలేని పరిస్థితికి వచ్చాడు. అయితే రాకేష్ కు ఆరోగ్యం మెరుగు కావాలంటే ఖరీదైన ఇంజక్షన్‌లను క్రమం తప్పకుండా ఇవ్వాలని వైద్యులు సూచించారు. పేదరికంలో ఉన్న రాకేష్ కుటుంబం ఖరీదైన వైద్యం చేయించలేకపోతుందని, పత్రికలో వచ్చిన కథనంపై సీఎం రేవంత్ రెడ్డి తక్షణమే స్పందించారు. ములకనూరులోని ఓ ప్రైవేటు కాలేజీలో రాకేష్ ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. స్వగ్రామం నుంచి ములకనూరు వెళ్లి రావడానికి చార్జింగ్ వెహికల్ ను కూడా ప్రభుత్వం అందించనున్నది. తమ బిడ్డను ఆదుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి రాకేష్ తల్లిదండ్రులు గూళ్ల సమ్మయ్య, లక్ష్మి ధన్యవాదాలు తెలిపారు.

# తెలంగాణలో జలదోపిడీ జరిగింది



ఎస్ఎల్ బీసీ టన్నెల్ ను పదేళ్లు పూర్తిగా పడుకోబెట్టారని ఆరోపించారు. లక్షా 85 వేలకోట్లు ఖర్చు చేసి ఎకరాకు నీళ్లివ్వలేదన్నారు ఉత్తమ్. సగం పూర్తయిన ప్రాజెక్టులను కేసీఆర్ పట్టించుకోలేదు.. విభజన చట్టం అమలు కోసం కేసీఆర్ ఎలాంటి ప్రయత్నం చేయలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే తెలంగాణకే 500 టీఎంసీలు కావాలని వాదన ప్రారంభించామన్నారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు పూర్తి చేసి ఉంటే మహబూబ్‌నగర్ జిల్లా అద్భుతంగా ఉండేదన్నారు. భారాస ప్రభుత్వం వల్లే తెలంగాణకు అన్యాయం జరిగిందన్నారు. జగన్‌తో స్నేహంగా ఉంటూ.. ఏపీ జలదోపిడీకి భారాస సహకరించిందన్నారు. జగన్ పోతిరెడ్డిపాడు సామర్థ్యం పెంచుతున్నా, అక్రమంగా ముచ్చుమర్రి నిర్మిస్తున్నా కేసీఆర్ నోరెత్తలేదని మండిపడ్డారు.కాళేశ్వరం ప్రాజెక్టుతో నీళ్లు రాలేదు కానీ.. భారాస నేత జేబులు నిండాయి. కాళేశ్వరంపై రూ.లక్షా 30వేల కోట్లు ఖర్చు చేస్తే మేడిగడ్డ కూలిపోయింది. కాళేశ్వరం ప్రాజెక్టు అప్పు తెలంగాణ ప్రజలు ఎన్నటికీ తీర్చలేనంత భారంగా మారింది. పదేళ్ల అధికారంలో ఉన్న భారాస ప్రభుత్వం కనీసం టెలిమెట్రీలు కూడా ఏర్పాటు చేయలేదు. కృష్ణా జలాలను జగన్ ప్రభుత్వం బేసిన్ అవతలకు తరలిస్తుంటే పట్టించు కోలేదు. కృష్ణా జలాల్లో 299 టీఎంసీలు మన హక్కు అయితే 190 టీఎంసీల కంటే ఎక్కువగా ఎప్పుడూ వాడలేదు. కృష్ణా బేసిన్‌లో ఆన్‌గోయింగ్ ప్రాజెక్టులు పూర్తి చేసి ఉంటే మన వాటా పూర్తిగా వాడుకునే వాళ్లం. ఏదుల, దిండి ప్రాజెక్టులను కూడా పదేళ్లలో పూర్తి చేయలేదని ఉత్తమ్ విమర్శించారు. ఈక్రమంలోనే శ్రీశైలం ప్రాజెక్టును ఏపీకి అప్పగిస్తామని 2021-22లో బీఆర్ఎస్ ఒప్పుకుందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆరోపించారు. నాగార్జున సాగర్ శ్రీశైలం ప్రాజెక్టుల్ని బోర్డుకు అప్పగిస్తామని 2021లో బీఆర్ఎస్ ఒప్పుకుందన్నారు. 2023 నవంబర్ లో సాగర్ ను ఏపీ ఆక్రమించింది.. ఏపీ ఆక్రమణ తర్వాతే సాగర్ సీఆర్పీఎఫ్ ఆధీనంలోకి వెళ్లిందన్నారు. ఉమ్మడి ఏపీలో శ్రీశైలం నుంచి రోజు 4.2 టీఎంసీలు తీసుకెళ్లారని చెప్పారు ఉత్తమ్. రాష్ట్రం వచ్చాక బీఆర్ఎస్ హయాంలో రోజూ 9.6 టీఎంసీలు దోచుకెళ్లారని ఆరోపించారు ఉత్తమ్. కృష్ణా నీళ్లను ఏపీకి దోచి పెట్టినందుకే గత ఎన్నికల్లో బీఆర్ఎస్ ను ఓడించారని విమర్శించారు. హరీశ్ రావు ఇరిగేషన్ మినిస్టర్ గా కాదు..అసలు దేనికి పనికి రాడన్నారు. తెలంగాణ ప్రజలు, రైతుల ప్రయోజనాలు కాపాడుతామని వ్యాఖ్యానించారు.ఏపీ నీళ్ల దోపిడికి పదేళ్లు బీఆర్ఎస్ ప్రభుత్వం సహకరించిందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆరోపించారు . జగన్ దోస్తీ కోసం రాయల సీమ లిఫ్ట్, పోతిరెడ్డిపాడు వదిలేశారని చెప్పారు. పదేళ్లలో శ్రీశైలం నుంచి ఔట్ సైడ్ బేసిన్ 1200 టీఎంసీలు తరలించారని వ్యాఖ్యానించారు. తెలంగాణకు 550 టీఎంసీలు రావాల్సి ఉన్నా.. 298 టీఎంసీలు సరిపోతాయని చెప్పిన ఘనత కేసీఆర్ దేనని విమర్శించారు. కేసీఆర్ అసమర్థత,చేతగాని తనం వల్లే పాలమూరుకు నీటి కష్టాలు వచ్చాయన్నారు. పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్ఎస్ కనీసం టెలిమెట్రీ పరికరాలు కూడా పెట్టలేదని విమర్శించారు. కేసీఆర్ పదేళ్లు పాలమూరు ప్రాజెక్టులను పట్టించుకోలేదని విమర్శించారు. మేడిగడ్డ కూలితే ఒక్క పిల్లరే కూలిందని వాదిస్తున్నారు. వాళ్లే కట్టారు..వాళ్లే దోచుకున్నారు..వాళ్లే కూలగొట్టారు. కాళేశ్వరం అప్పులు తెలంగాణ ప్రజలకు ఎప్పటికీ భారమే. పాలమూరుకు వేల కోట్లు ఖర్చు చేసి ఒక్క ఎకరాకు నీళ్లివ్వలే. నీళ్ల కోసం కాదు బీఆర్ఎస్ నేతలు జేబులు నింపేందుకు కట్టారు. కృష్ణా నీళ్లలో ఏపీ దోపిడిని కేంద్రానికి వివరించాం.. కృష్ణా జలాల వాటా విషయంలో తెలంగాణకు అన్యాయం జరుగుతోంది. ఏపీ నీళ్ల దోపడిలో కేంద్రం జోక్యం చేసుకోవాలని ఉత్తమ్ అన్నారు.

## ఇప్పటికైనా ఏపీ జలదోపిడీని
# అడ్డుకోండి

టీఎంసీల నీటిని తరలించారు. తెలంగాణ నీటి ప్రయోజనాలు కాంగ్రెస్ ప్రభుత్వానికి పట్టవా? ప్రభుత్వ నిర్లక్ష్యం తెలంగాణకు పెనుశాపంగా మారింది అని హరీశ్‌రావు ధ్వజమెత్తారు. నాగార్జున సాగర్ కేంద్ర బలగాల చేతిలో ఉన్నప్పటికీ కేంద్రం అనుమతి లేకుండా ఏపీ ఇష్టారీతిన నీటిని తరలించుకుపోతోంది. కేంద్రాన్ని అడిగే ధైర్యం లేదు, చంద్రబాబును అడిగే దమ్ము లేదు. ప్రతిపక్షాలను బాగా విమర్శిస్తారు కానీ, కేంద్రాన్ని అడిగే పరిస్థితి లేదు. శ్రీశైలం, సాగర్ నీటిని తరలించుకుపోతుంటే కనీసం స్పందించడం లేదు. 1015 టీఎంసీల నీరు కృష్ణాలో ఈ ఏడాది వచ్చింది. ఏపీకి కేవలం 9 టీఎంసీల హక్కు మాత్రం ఉంది. ఇవాళ కూడా ఏపీకి నీరు తరలిస్తూనే ఉన్నారు. 220 టీఎంసీలు మాత్రమే తెలంగాణ వాడుకుంది. ఇంకా 123 టీఎంసీలు రావాలి. తెలంగాణ ఇప్పటికే నష్టపోయింది. ఇప్పటికైనా కళ్లు తెరవాలి అని హరీశ్‌రావు సూచించారు. యాసంగి పంట కింద ఎన్ని ఎకరాలకు నీరు ఇస్తారో ప్రభుత్వం ప్రకటనలు ఇచ్చింది. ఆరున్నర లక్షల ఎకరాల్లో రైతులు పంటలు వేసుకున్నారు, సాగర్ ఎడమకాల్వకు ఇంకా నాలుగు తడులు కావాలి. హైదరాబాద్ సహా చాలా జిల్లాల తాగునీటి అవసరాలు ఉన్నాయి. ఇప్పటికైనా మొద్దు నిద్ర వీడి ఏపీకి నీరు ఆపేలా చూడండి. కృష్ణా బోర్డు కార్యాలయం ముందు, ఢిల్లీలో ధర్నా చేద్దాం.. మేమూ వస్తాం. సాగర్ కుడి కాల్వ, ముచ్చుమర్రి, పోతిరెడ్డిపాడు నుంచి నీరు వెళ్లకుండా అడ్డుకోవాలి. నీటి తరలింపు ముమ్మాటికీ కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యం. రాష్ట్ర ప్రభుత్వం మొద్దు నిద్ర పోతోంది కాబట్టే ఏపీ ఇష్టం వచ్చినట్లు నీటిని తరలించుకుపోతోంది అని హరీశ్‌రావు ధ్వజమెత్తారు

## పాలమూరు బిడ్డలకు
# అండగా ఉంటా

సభ్యులు మంత్రికి బోనాలు, బతుకమ్మలతో స్వాగతం పలికారు. భారీ క్రేయిన్‌తో మంత్రిని గజమాలతో సత్కరించారు. అనంతరం మంత్రి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు దేశంలోని ముంబయ్, పుణే నగరాలలోనే కాకుండా దేశ విదేశాల్లో అనేక ఆకాశ హర్మ్యాలు నిర్మించిన కూలీలు పాలమూరు కార్మికులేనన్నారు. ఎక్కడ ఉపాధి అవకాశాలు లభిస్తే అక్కడికి వెళ్లి కూలీ పని చేసుకునే జీవించే నిస్వార్థ జీవులు వారన్నారు. నగరంలో పొట్టకూటి కోసం వచ్చి లక్షలాది సంఖ్యలో నివాసం ఉంటున్న పాలమూరు వాసుల కష్ట సుఖాలు, సంక్షేమం కోసం పట్నంలో పాలమూరు బిడ్డలు సంక్షేమసంఘం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సంఘం వ్యవస్థాపక సభ్యులు శ్రీధర్ పంతులు, రవీందర్, సంకి సత్యం, గోపాస్ చంద్రశేఖర్, బంగారి బండి, కుర్మయ్య, రాములు, లోకేష్‌రెడ్డి, ప్రదీప్ రెడ్డి, గోపాల్, సాయి పాల్గొన్నారు.

# 7 రోజుల్లోగా ఆయుధాల్ని సరెండర్ చేయండి

దాదాపు రెండేళ్లుగా జాతుల మధ్య వైరంతో రగులుతున్న మణిపుర్‌లో కల్లోల పరిస్థితుల నేపథ్యంలో ఇటీవల సీఎం బీరెన్ సింగ్ రాజీనామా చేసిన విషయం తెలిసిందే. దీంతో అక్కడ రాష్ట్రపతి పాలన విధించిన కేంద్ర ప్రభుత్వం అధికారాలన్నింటినీ అక్కడి గవర్నర్‌కు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.మణిపుర్‌లో శాంతి పునరుద్ధరించే లక్ష్యంతో గవర్నర్ అజయ్ భల్లా ఓ ప్రకటన విడుదల చేశారు. "శాంతి, మత సామరస్యతను దెబ్బతీసే దురదృష్టకర ఘటనలతో మణిపుర్‌లోని లోయ, కొండ ప్రాంతాల్లోని ప్రజలు 20 నెలలకు పైగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అక్కడ సాధారణ స్థితిని పునరుద్ధరించేందుకు ప్రజలు తమ దైనందిన కార్యకలాపాలను కొనసాగించేందుకు వీలుగా అన్ని వర్గాలు వైరాన్ని వీడి శాంతిభద్రతలను కాపాడుకొనేందుకు ముందుకు రావాలి. మరీ ముఖ్యంగా యువత అక్రమ ఆయుధాలు, పేలుడు పదార్థాలను సమీపంలోని పోలీస్‌స్టేషన్/అవుట్ పోస్టు/భద్రతా దళాల క్యాంపుల్లో సరెండర్ చేయాలి. నిర్ణీత సమయంలోగా ఆయుధాలను తిరిగి ఇస్తే ఎలాంటి శిక్షార్హమైన చర్యలు ఉండవు. లేదంటే కఠిన చర్యలు తప్పవు. ప్రస్తుతం నెలకొన్న పరిస్థితికి శాంతియుతమైన పరిష్కారం కోసం, యువత భవిష్యత్తును కాపాడేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది. ఉజ్వల భవిష్యత్తు కోసం అందరం కలిసి రాష్ట్రాన్ని పునర్నిర్మించుకుందాం.. ముందుకు రండి. శాంతి మార్గాన్ని ఎంచుకోండి" అని పేర్కొన్నారు.

# అడల్ట్ కంటెంట్ లేకుండా చూడండి

చిన్నారులకు 'ఎ' రేటెడ్ కంటెంట్ అందుబాటులో లేకుండా చూడాలని ఆదేశించింది. సమాచార, ప్రసార మంత్రిత్వశాఖ గురువారం ఈ మేరకు ఓ ప్రకటనను విడుదల చేసింది. 'ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లు, సోషల్ మీడియాలోని అశ్లీల, అసభ్యకరమైన కంటెంట్‌లపై ఫిర్యాదులు అందాయి. ఐటీ రూల్స్‌లోని కోడ్ ఆఫ్ ఎథిక్స్‌ను సామాజిక మాధ్యమాలు, ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లు తప్పనిసరిగా పాటించాలి. ఈ నిబంధనలు ఉల్లంఘించే ఏ కంటెంట్‌ను ప్రసారం చేయకూడదు. వయస్సు ఆధారిత కంటెంట్ అందుబాటులో ఉండాలి. స్వీయ నియంత్రణ కలిగిన ఓటీటీలు నైతిక విలువలను పాటించాలని ఆ ప్రకటనలో పేర్కొంది. ఐజీఎల్‌లో పాల్గొన్న ఓ వ్యక్తిని తల్లిదండ్రుల గురించి, శృంగారం పైన ప్రశ్నించడంతో ప్రముఖ యూట్యూబర్ రణ్‌వీర్ అల్హాబాదియాపై తీవ్ర నిరసనలు వ్యక్తమయ్యాయి. అతడి వ్యాఖ్యలపై పలువురు పార్లమెంటు సభ్యులు కూడా తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. సమయ్ రైనా షోలో రణ్‌వీర్ ఈ వ్యాఖ్యలు చేశాడు. దాంతో అతడిపై పలు రాష్ట్రాల్లో ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి.

# పనామాలో భారతీయులు సేఫ్

స్పందించింది.వారి పరిస్థితి గురించి వివరించింది."అమెరికా నుంచి భారతీయులు పనామాకు సురక్షితంగా చేరుకున్నారు. ఈ విషయాన్ని అక్కడి అధికారులు తెలియజేశారు. హోటల్లో వారికి అన్ని వసతులు సమకూర్చారు. ఎలాంటి ఇబ్బంది లేదు. ఆతిథ్య ప్రభుత్వంతో కలిసి పని చేస్తున్నాం" అని భారత కార్యాలయం తెలిపింది. కాగా.. తమ దేశంలో అక్రమంగా నివసిస్తున్న వలసదారులపై అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కొరడా ఝుళిపించారు. భారతీయులతో సహా మధ్య ఆసియా దేశాల నుంచి వచ్చిన అక్రమ వలసదారులను దేశం నుంచి బహిష్కరించారు.ఆయన ఆదేశాలతో అమెరికా మిలిటరీ ఇప్పటికే పలువురు భారతీయులను వెనక్కి పంపించింది. ఈ క్రమంలోనే భారత్‌తో సహా పలు దేశాల అక్రమ వలసదారులను తమ దేశంలోకి తీసుకుంటున్నట్లు పనామా ప్రకటించిన సంగతి తెలిసిందే. అక్కడ వారందరికీ ఒక హోటల్‌లో బస ఏర్పాటు చేసింది. అయితే వారిలో 40 శాతం మంది తిరిగి తమ స్వదేశానికి వెళ్లేందుకు ఆసక్తి చూపడం లేదని అక్కడి అధికారులు పేర్కొన్నారు.

# ఎన్నిక ఏదైనా విజయం మనదే

### ఎన్‌డిఎ పక్ష సమావేశంలో ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** ఎన్నిక ఏదైనా ఇక ఎన్‌డిఎదే విజయమని, ఎక్కడా తగ్గేది లేదని ప్రధాని మోడీ స్పష్టం చేశారు. బెంగాల్ కావచ్చు, బీహార్ కావచ్చు, కేరళ అయినా విజయం తమ కూటమిదేనని ధీమా వ్యక్తం చేశారు. ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖాగుప్తా ప్రమాణ స్వీకారం ముగిసిన తర్వాత ఢిల్లీలో ఎన్డీయే పక్షాల సీఎంలు, డిప్యూటీ సీఎంల సమావేశం జరిగింది. అలాగే బీజేపీ ఎన్డీయే నేతలకు ప్రత్యేక విందు ఏర్పాటుచేసింది. ఈ సమావేశంలో ప్రధాని మోదీ, అమిత్ షా, బీజేపీ జాతీయ అధ్యక్షులు నడ్డా హాజరయ్యారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కూడా ఈ సమావేశానికి హాజరయ్యారు. అలాగే ఎన్డీయే పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఉప ముఖ్యమంత్రులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్ర బడ్జెట్ ప్రవేశపెట్టడంతో ఆ రాష్ట్ర సీఎం యోగి ఆదిత్యనాథ్ ఢిల్లీ సీఎం ప్రమాణ స్వీకారానికి, ఎన్డీయే పక్షాల సీఎంల సమావేశానికి హాజరుకాలేదు. ఈ సమావేశంలో ప్రభుత్వాల పనితీరు ప్రధాని మోదీ అడిగి తెలుసుకున్నట్లు తెలుస్తోంది. ఢిల్లీ సీఎం రేఖాగుప్తా, డిప్యూటీ సీఎం పర్వేష్ సాహెబ్ సింగ్ కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. కొత్తగా సీఎం, డిప్యూటీ సీఎం బాధ్యతలు చేపట్టిన ఈ ఇద్దరినీ ఎన్డీయే పక్షాల సీఎంలు, డిప్యూటీ సీఎంలు అభినందించారు. ఆ తర్వాత బీజేపీ జాతీయ అధ్యక్షులు నడ్డా, ప్రధాని మోదీ మాట్లాడారు. అభివృద్ధి అజెండాపై ఈ సమావేశంలో చర్చించినట్లు సమాచారం. అయితే మోడీ ఎక్స్‌లో కూడా ఇదే పోస్ట్ చేసారు.

# లోక్‌పాల్ ఉత్తర్వులపై సుప్రీం స్టే

అదనపు జిల్లా జడ్జిని, అదే హైకోర్టు జడ్జిని ఒక ప్రైవేట్ కంపెనీ ఫిర్యాదుదారుపై దాఖలైన ఫిర్యాదును ఆ కంపెనీకి అనుకూలంగా మార్చేలా ప్రభావితం చేశారని హైకోర్టు సిట్టింగ్ అదనపు జడ్జిపై రెండు ఫిర్యాదులు దాఖలయ్యాయి. ఈ ఫిర్యాదులపై హైకోర్టు న్యాయమూర్తులను విచారించే అధికారం తమకు ఉందంటూ లోక్‌పాల్ ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో పేరున్న హైకోర్టు జడ్జి బార్‌లో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్న సమయంలో ప్రైవేట్ కంపెనీ ఫిర్యాదుదారుగా ఉన్నట్లు ఆరోపణలు వచ్చాయి.ఈ రెండు ఫిర్యాదులలో రిజిస్ట్రీలో నమోదైన వివరాలు, సంబంధిత మెటీరియల్‌ను పరిశీలన కోసం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి పంపాలని లోక్‌పాల్ ఉత్తర్వులు జారీ చేసింది.

# 21న కేఆర్ఎంబీ సమావేశం

నాగార్జునసాగర్ నుంచి నీటిని ఏపీ అక్రమంగా తరలిస్తోందని, వెంటనే అడ్డుకోవాలని మంత్రి ఉత్తమ్ ఫిర్యాదులో పేర్కొన్నారు. శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టుల పరిధిలో 35 చోట్ల టెలిమెట్రీ పరికరాలు ఏర్పాటు చేయాలని తెలంగాణ ప్రభుత్వం కోరుతోంది. ఈ అంశంపై కూడా ప్రధానంగా చర్చ జరిగే అవకాశముంది.

# బైడెన్ ప్రభుత్వం నాతో అత్యంత దారుణంగా వ్యవహరించింది

డెమొక్రటిక్ అభ్యర్థి కమలా హారిస్‌పై ట్రంప్ ఘన విజయం సాధించిన సంగతి తెలిసిందే. ఈ ఎన్నికలకు ముందు ట్రంప్ పోర్న్ స్టార్‌కు హష్ మనీ కేసుతో సహా పలు క్రిమినల్, సివిల్ కేసులు ఎదుర్కొన్నారు. అధ్యక్షుడిగా ఎన్నికైన అనంతరం ఆయనపై ఉన్న రెండు ఫెడరల్ కేసుల నుంచి ఊరట లభించింది. ఇటీవల హష్ మనీ కేసులో న్యూయార్క్ న్యాయమూర్తి షరతులు లేని డిశ్చార్జిని వర్తింపజేశారు.

**బైడెన్ భారత్‌లో ఎవర్నో గెలిపించేందుకు ప్రయత్నం చేశాడు**

భారత్‌లో జరిగే ఎన్నికల్లో ఓటర్ల సంఖ్యను పెంచేందుకు అందించే 21 మిలియన్ డాలర్ల ఫండ్ ను ఇటీవల అమెరికా డోజ్ విభాగం రద్దు చేసిన సంగతి తెలిసిందే.ఈ నిర్ణయాన్ని మరోసారి సమర్థించిన అగ్రరాజ్య అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గత బైడెన్ సర్కారుపై సంచలన ఆరోపణలు చేశారు. భారత ఎన్నికల్లో జోక్యం చేసుకునేందుకు వారు ప్రయత్నించారంటూ పరోక్షంగా దుయ్యబట్టారు. మియామిలోని ఓ సదస్సులో పాల్గొన్న ట్రంప్.. ఈ నిధుల అంశాన్ని ప్రస్తావించారు. "భారత్‌లో ఓటింగ్ శాతం కోసం మనమెందుకు 21 మిలియన్ డాలర్లను ఖర్చు చేయాలి? బహుశా ఆ దేశంలో మరెవర్నో గెలిపించేందుకు వారు (బైడెన్ ప్రభుత్వాన్ని ఉద్దేశిస్తూ) ప్రయత్నించినట్లు అర్థమవుతోంది. ఈ విషయాన్ని భారత ప్రభుత్వానికి తప్పనిసరిగా తెలియజేయాలి. అదే కీలక ముందడుగు అవుతుంది" అని ట్రంప్ వ్యాఖ్యానించారు. ఈ నిధుల రద్దు గురించి ట్రంప్ ఇంతకుముందు కూడా మాట్లాడారు. "భారత్‌కు మేం ఎందుకు 21 మిలియన్ డాలర్లు ఇవ్వాలి. వారివద్ద చాలా డబ్బు ఉంది. ప్రపంచంలోనే అత్యధిక పన్నులు వసూలుచేస్తున్న దేశాల్లో అది ఒకటి. వారు విధించే సుంకాలు కూడా చాలా ఎక్కువ. ఈ విషయంలో అమెరికా ఎన్నడూ భారత్‌ను చేరుకోలేదు. నాకు భారత ప్రజలు, ఆ దేశ ప్రధానిపై చాలా గౌరవం ఉంది. కానీ, వారి ఓటర్ల సంఖ్యను పెంచేందుకు 21 మిలియన్ డాలర్లు ఇవ్వాలా? మరి మన దేశంలో ఓటర్ల పరిస్థితి ఎలా ఉంది..?" అని ట్రంప్ ప్రశ్నల వర్షం కురిపించారు.ఇతర దేశాలకు ఇచ్చే నిధుల్లో కోత విధిస్తూ ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ నేతృత్వంలోని డోజ్ విభాగం ఫిబ్రవరి 16న జాబితా ప్రకటించింది. అందులో భారత్‌లో ఓటర్ల సంఖ్యను పెంచేందుకు ఉద్దేశించిన నిధులను కూడా రద్దు చేసినట్లు ప్రకటించింది. డోజ్ నిర్ణయం.. భారత్‌లో రాజకీయ వివాదానికి దారితీసింది. "ఓటర్ల సంఖ్యను పెంచేందుకు 21 మిలియన్ డాలర్లా? ఇది భారత ఎన్నికల ప్రక్రియలో జోక్యం చేసుకోవడమే అవుతుంది. ఈ నిధులతో ఎవరు లాభపడ్డారు? కచ్చితంగా అధికార పార్టీ మాత్రం కాదు" అని భాజపా జాతీయ అధికార ప్రతినిధి అమిత్ మాలవీయ పోస్ట్ చేశారు.

భారత్‌లో టెస్లా ఫ్యాక్టరీ ఏర్పాటు సరికాదు

అమెరికా దిగ్గజ ఈవీ కంపెనీ టెస్లా.. భారత మార్కెట్లోకి ఎంట్రీ ఇచ్చేందుకు సిద్ధమవుతోంది. ఇప్పటికే ఈ సంస్థ ఇక్కడ నియామకాలు ప్రారంభించిన సంగతి తెలిసిందే.షోరూంల ఏర్పాటు కోసం కూడా ప్రయత్నాలు మొదలుపెట్టింది. ఈ పరిణామాలపై తాజాగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. భారత్‌లో ఫ్యాక్టరీ ఏర్పాటుచేయాలనే టెస్లా అధినేత ఎలాన్ మస్క్ ప్రణాళిక 'అన్యాయమే' అని వ్యాఖ్యానించారు.మస్క్ పక్కన ఉండగానే అమెరికా అధ్యక్షుడు ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. వీరిద్దరూ కలిసి ఫాక్స్ న్యూస్‌కు ఇంటర్వ్యూ ఇచ్చారు. ఈ సందర్భంగా భారత్‌లోకి టెస్లా ఎంట్రీ ప్రణాళికలపై ట్రంప్ మాట్లాడారు. "ఈ ప్రపంచంలోని ప్రతి దేశం మమ్మల్ని వాడుకోవడానికి ప్రయత్నిస్తోంది. సుంకాలతో మానుంచి లబ్ధి పొందాలని చూస్తున్నారు. దీంతో ఎలాన్ మస్క్ తన కార్లను విక్రయించడం అసాధ్యంగా మారుతోంది. ఉదాహరణ భారతే..! ఇప్పుడు ఆయన (మస్క్) భారత్‌లో ఫ్యాక్టరీ ఏర్పాటుచేసేందుకు సిద్ధమవుతున్నారు. ఆయన వరకు అది మంచిదే కావొచ్చు.. కానీ, అమెరికా పరంగా అది చాలా అన్యాయమైన నిర్ణయమే" అని ట్రంప్ వ్యాఖ్యానించారు. ఈసందర్భంగా గతవారం భారత ప్రధాని మోదీతో భేటీని ట్రంప్ గుర్తుచేసుకున్నారు. ఆ సమావేశంలో విద్యుత్ కార్లపై అధిక సుంకాల విషయాన్ని మోదీతో ప్రస్తావించినట్లు తెలిపారు. సుంకాల సమస్యను పరిష్కరించుకోవడంతో పాటు వీలైనంత త్వరగా వాణిజ్య ఒప్పందం కోసం ఇరుదేశాలు కలిసి పనిచేసేలా నిర్ణయించినట్లు వెల్లడించారు.ఇటీవల మోదీ అమెరికా పర్యటన సందర్భంగా టెస్లా అధినేత ఆయనతో సమావేశమైన సంగతి తెలిసిందే. ఆ తర్వాత కొన్ని రోజులకే ఈ సంస్థ భారత్‌లో నియామకాలు చేపట్టింది. ఈ ఏడాది ఏప్రిల్ నుంచే విక్రయ కార్యకలాపాలను ప్రారంభించే అవకాశం ఉంది. అయితే, భారత్‌లో విద్యుత్ కార్ల తయారీపై టెస్లా ఇంకా నిర్ణయం తీసుకోలేదు.మరోవైపు, ఇటీవల భారత ప్రభుత్వం నూతన ఈవీ పాలసీని ఆవిష్కరించిన సంగతి తెలిసిందే. కార్ల తయారీ సంస్థలు దేశంలో కనీసం 500 మిలియన్ డాలర్లు పెట్టుబడి పెట్టడంతో ఇక్కడ ఫ్యాక్టరీని ఏర్పాటుచేస్తే దిగుమతి సుంకాలను 15శాతానికి తగ్గించేలా కేంద్రం కొత్త విధానం తీసుకొస్తోంది. ఈ పరిణామాల వేళ ట్రంప్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

చైనాతో డీల్ కుదుర్చుకుంటాం

దూకుడు నిర్ణయాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చైనా విషయంలో మరో కీలక నిర్ణయం తీసుకునేందుకు సిద్ధం అవుతున్నారు. డ్రాగన్‌తో ట్రేడ్ డీల్ రూపుదాల్చే అవకాశం ఉందని తాజాగా వ్యాఖ్యలు చేశారు. 2020లోనే చైనాతో ఒక గొప్ప వాణిజ్య ఒప్పందం జరిగిందని మీడియాతో మాట్లాడుతూ గుర్తుచేశారు. రెండు దేశాల మధ్య ట్రేడ్‌వార్ జరుగుతుందన్న ఆందోళనల వేళ అగ్రరాజ్య అధ్యక్షుడి నుంచి ఈ వ్యాఖ్యలు రావడం గమనార్హం ట్రంప్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఆయన నోటిలో టారిఫ్ పదమే వినిపిస్తోంది. దానికి తగ్గట్టే మిత్రులు, శత్రువులు అనేతేడా లేకుండా అన్ని దేశాలపై పరస్పర సుంకాలు విధిస్తానని తేల్చి చెప్పారు. వాణిజ్య లోటును తగ్గించుకోవడం కోసమే ఆయన దూకుడుగా వ్యవహరిస్తున్నారు. చైనా నుంచి అమెరికాకు దిగుమతి చేసుకునే వస్తువులపై 10 శాతం సుంకాలు విధిస్తూ నిర్ణయం తీసుకున్నారు. దానికి చైనా కూడా కౌంటర్ ఇచ్చింది. అమెరికా నుంచి దిగుమతి అవుతున్న బొగ్గు, ద్రవీకృత సహజ వాయువుపై (ఎల్ఎన్‌జీ) 15 శాతం సుంకం విధిస్తున్నట్లు చైనా ఆర్థిక మంత్రిత్వశాఖ ప్రకటించిన సంగతి తెలిసిందే.

# సామాజిక కార్యకర్త రాజలింగమూర్తి హత్య కేసులో సీబీసిఐడి విచారణ

చేయించారని అన్నారు. కొత్త హరిబాబు రేణిగుంట్ల సంజీవ్ బుర్ర చంద్రయ్య, బుర్ర కొమురయ్య రేనిగుంట్ల కొమురయ్య మరికొంతమంది కలిసి హత్య చేశారని సరళ ఆరోపించారు. ఇప్పటికే భూపాలపల్లి ప్రభుత్వ ఆస్పత్రి వద్దకు రాజలింగమూర్తి బంధువులు చేరుకున్నారు. కాగా... బైక్‌పై వెళ్తున్న రాజలింగమూర్తిని ఐదుగురు గుర్తుతెలియని వ్యక్తులు కత్తులతో పొడిచి హత్య చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతిపై గతంలో కేసీఆర్, కేటీఆర్, హరీష్‌రావుపై లింగమూర్తి కేసు వేశారు. ఆ ఫిర్యాదుతో కేసీఆర్, కేటీఆర్, హరీష్‌రావుతో పాటు ఐదుగురిపై కేసు నమోదు అయ్యింది. దీంతో పాటు భూపాలపల్లిలో వెంకటేశ్వర స్వామి గుడి నిర్మాణంపై మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డిపై రాజలింగమూర్తి కేసు వేశారు.

**బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీశ్‌రావుల హస్తం:మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి**

సామాజిక కార్యకర్త రాజలింగమూర్తి హత్యపై సీబీసీఐడీతో విచారిస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్పష్టం చేశారు. ఈ హత్యపై పోలీసుల విచారణ జరుగుతోందని.. దోషులను 24 గంటల్లోనే పట్టుకుంటామని తెలిపారు. రాజలింగమూర్తి కేసును ఫాస్ట్రాక్ కోర్టులో విచారణ జరిపిస్తామని చెప్పారు. రాజలింగమూర్తిని గండ్ర వెంకట రమణా రెడ్డి హత్య చేయించారని ఆరోపించారు. దీని వెనక కేసీఆర్, కేటీఆర్, హరీష్ ఉన్నారని ఆరోపించారు. 'మీరు తెలంగాణలో ఎలా పుట్టారో అర్థం కావడం లేదని ఆక్రోశం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ హత్యా రాజకీయాలను ప్రోత్సహిస్తోందని దుయ్యబట్టారు. హత్యా రాజకీయాలు తెలంగాణ సంస్కృతి కాదు. బీఆర్ఎస్ నేతలు హత్యా రాజకీయాలను మానుకోవాలని హితవు పలికారు. దోపిడీని ప్రశ్నిస్తే హత్య చేసే స్థాయికి దిగజారారని తెలిపారు. సామాజిక కార్యకర్త రాజలింగమూర్తి హత్యను ఖండిస్తున్నాను" అని అన్నారు. మేడిగడ్డ అక్రమాలపై రాజలింగమూర్తి కోర్టులో పోరాడుతున్నాడని తెలిపారు. నీళ్లు పోసుకుని పెట్రోల్ అని చెప్పి అమాయకులు చనిపోవడానికి హరీష్ కారణం అయ్యారని దుయ్యబట్టారు. దోపిడీ బయట పడుతుందని హత్యలు చేస్తారా అంటూ ఫైర్ అయ్యారు. అడ్వకేట్ వామన రావును హత్య చేసిన వాళ్ళకే కేసీఆర్ టికెట్ ఇచ్చారన్నారు. హరీష్ రావు మానవత్వం ఉన్న మనిషేనా అని ప్రశ్నించారు. రాజలింగమూర్తి హత్యను డైవర్ట్ చేసేందుకు హరీష్ రావు కృష్ణా నీళ్ల గురించి మాట్లాతున్నారన్నారు. "స్కాముల గురించి ప్రశ్నిస్తే చంపేస్తారా? 15 నెలల నుండి కేసీఆర్ ఈ ఎవరికైనా కనిపించాడా? కాంగ్రెస్ గ్రాఫ్ తగ్గిందని కేసీఆర్‌కు ఎలా తెలుసు? ఐదుగురు ఎమ్మెల్యేలు ఉన్నా ప్రతిపక్ష నాయకుడిగా భట్టి ఒంటరి పోరాటం చేశారు" అని మంత్రి పేర్కొన్నారు. జయశంకర్ భూపాలపల్లి: మాజీ కౌన్సిలర్ భర్త రాజలింగమూర్తి హత్యను కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. హత్యకు కారకులను వెంటనే పట్టుకోవాలని పోలీసులను ఆదేశించామని తెలిపారు.

రాజలింగమూర్తి హత్యపై అన్ని కోణాల్లో దర్యాప్తు : డీఎస్పీ

రాజలింగమూర్తి హత్యపై అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని డీఎస్పీ సంపత్‌రావు తెలిపారు. ఈ హత్య కేసులో ఇంకా ఎవరిని కస్టడీలోకి తీసుకోలేదని చెప్పారు. 'హత్య వెనుక ఎవరు ఉన్నా వదిలిపెట్టం. మృతుని భార్య ఫిర్యాదుతో కేసు నమోదు చేశాం. రాజలింగమూర్తితో హంతకులకు భూతగాదాలు ఉన్నాయి. హత్యకు ఇతర కారణాల కోణంలోనూ దర్యాప్తు జరుగుతోంది. ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి విచారణ జరుపుతున్నాం'అని డీఎస్పీ వెల్లడించారు. మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోవడానికి భారాస ప్రభుత్వమే కారణమంటూ కేసు వేసిన రాజలింగమూర్తి (47) హత్యకు గురయ్యారు. ఈ హత్యపై తెలంగాణ సీఎం కార్యాలయం (సీఎంవో) ఆరా తీసిన విషయం తెలిసిందే.

# ఢిల్లీ సిఎంగా రేఖాగుప్తా ప్రమాణం





ఈ కార్యక్రమానికి సాధువులు, పలువురు ప్రముఖులు హాజరుకావడంతో భారీ భద్రత ఏర్పాటుచేశారు. 25,000 మంది భద్రతా సిబ్బందిని మోహరించారు. రేఖా గుప్తాతో పాటు భాజపా ఎమ్మెల్యేలు పర్వేశ్ వర్మ, ఆశీశ్ సూద్, మజీందర్ సింగ్ సిర్సా, రవీందర్ ఇంద్రజ్ సింగ్, కపిల్ మిశ్రా, పంకజ్ కుమార్ మంత్రులుగా ప్రమాణం చేశారు. ఈ కొత్త సీఎంకు జడ్ కేటగిరీ సెక్యూరిటీని కేటాయించనున్నారు. హరియాణాలోని జులానాలో 1974 జులై 19న జన్మించిన రేఖా గుప్తా.. దిల్లీ యూనివర్సిటీ పరిధిలోని దౌలత్‌రామ్ కళాశాలలో బీకాం చదివారు. ఆ సమయంలోనే ఏబీవీపీ ద్వారా విద్యార్థి రాజకీయాల్లో ప్రవేశించారు. 1995-96లో దిల్లీ వర్సిటీ విద్యార్థి సంఘం కార్యదర్శిగా పనిచేశారు. 1996-97లో అధ్యక్షురాలిగా సేవలందించారు. మేరఠ్‌లోని చౌధరీ చరణ్‌సింగ్ విశ్వవిద్యాలయం నుంచి న్యాయశాస్త్రం పట్టా పుచ్చుకొని కొంతకాలం న్యాయవాదిగా పనిచేశారు. 1998లో మనీశ్‌గుప్తాను వివాహం చేసుకున్నారు. 2007లో ఉత్తర పీతంపుర మున్సిపల్ కౌన్సిలర్‌గా విజయం సాధించారు. అనంతరం దక్షిణ దిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. ఆరెస్సెస్‌తో ఆమెకు సన్నిహిత సంబంధాలున్నాయి. సంఘ్ మహిళా సంబంధిత కార్యక్రమాల్లో ఆమె చురుకుగా పాల్గొనేవారు. ప్రస్తుతం భాజపా మహిళా మోర్చా జాతీయ ఉపాధ్యక్షురాలిగా, పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యురాలిగా ఉన్నారు. భాజపా నుంచి సుష్మాస్వరాజ్, ఉమాభారతి, వసుంధర రాజే, ఆనందీబెన్ పటేల్‌ల తర్వాత ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన 5వ మహిళగా, దేశంలో విభిన్న పార్టీల నుంచి సీఎం పదవిని చేపట్టిన 18వ అతివగా రేఖాగుప్తా నిలిచారు.

# సంచలనంగా మారిన రాజలింగమూర్తి హత్య

- రాష్ట్రవ్యాప్తంగా రాజకీయ దుమారం
- బీఆర్ఎస్ నేతల హస్తం ఉన్నట్లు ప్రచారం
- మలుపులు తిరుగుతున్న కేసు
- పోలీసుల అదుపులో ఇద్దరు నిందితులు?
- పరారీలో మరికొందరు..
- ప్రతిష్టాత్మకంగా తీసుకున్న పోలీసులు..





**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో బుధవారం రాత్రి సామాజిక కార్యకర్త నాగవెల్లి రాజలింగమూర్తి దారుణ హత్యకు గురైన సంఘటన రాష్ట్రంలో సంచలనాత్మకంగా మారింది. రాజలింగమూర్తి హత్య వెనుక బీఆర్ఎస్ నేతల హస్తం ఉందనే ప్రచారం జోరుగా సాగడంతో ఈ విషయం సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి వెళ్లింది. దీంతో ఈ కేసు విషయంపై ఆరా తీసినట్లు తెలిసింది. రాజలింగమూర్తి హత్యను పలువురు నేతలు ఖండించినప్పటికీ, ఈ కేసు రాజకీయ హత్య గా భావిస్తున్న తరుణంలో కొత్త మలుపులు తిరిగింది. పోలీస్ స్టేషన్ ముందు గల భూవివాదంలో గత కొద్ది రోజులుగా ఘర్షణలు జరుగుతున్నాయి. ఈ కోణంలోనే హత్య జరిగినట్లు పోలీసులు భావిస్తున్నారు. హత్య కేసు రాష్ట్రవ్యాప్తంగా దుమారం లేచిన పరిస్థితులలో పోలీసులు ప్రతిష్టాత్మకంగా తీసుకుని అన్ని కోణాల్లో దర్యాప్తు ముమ్మరం చేశారు.

**బీఆర్ఎస్ నేతల హస్తం ఉందని ప్రచారం..**

జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని రెడ్డికాలనీలో బుధవారం రాత్రి సామాజిక కార్యకర్త నాగవెల్లి రాజలింగమూర్తి దారుణ హత్యకు గురైన విషయం తెలిసిందే. కాగా దుండగులు ఒకే ఉదుటున దాడి చేసి, పథకం ప్రకారం కత్తులతో పొడిచి హత్య చేయడం వెనుక బీఆర్ఎస్ నేతల హస్తం ఉందని ప్రచారం జరిగింది. మృతుని భార్య సరళ కూడా మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణా రెడ్డినే తన భర్తపై దాడి చేయించి హత్య చేయించాడని మీడియా ముందు చెప్పడంతో వారి హస్తం ఉన్నట్లు ప్రచారం జరిగింది. ఈ హత్య చేయడం వెనుక బలమైన కారణాలే ఉన్నట్లు గుసగుసలు వినిపించాయి. కాళేశ్వరం మేడిగడ్డ బ్యారేజ్ లో అవకతవకలు జరిగాయని, ప్రజాధనం వృధా అయ్యిందని సామాజిక కార్యకర్త నాగవెల్లి రాజలింగమూర్తి గతంలో కోర్టులో కేసు దాఖలు చేశారు. మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీష్ రావుతో పాటు మరికొంతమందిపై కోర్టులో పిటిషన్ వేశారు. అయితే ఈ కేసు విషయంలోనే బీఆర్ఎస్ రాష్ట్ర నేతలు, స్థానిక మాజీ ఎమ్మెల్యే పథకం ప్రకారం హత్య చేయించారనే ప్రచారం జోరందుకోగా, ఈ విషయంపై స్పందించిన మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి ఖండించారు.

**హత్యకు భూ వివాదాలే కారణమా..**

నాగవెల్లి రాజలింగమూర్తి హత్య కేసు మరో మలుపు తిరిగింది. భూవివాదాలే ప్రధాన కారణమనే చర్చలు జిల్లాకేంద్రంలో జోరుగా సాగుతున్నాయి. ఇటీవల స్థానిక పోలీస్ స్టేషన్ ముందు గల రేణికుంట్ల కుటుంబానికి సంబంధించిన భూమి వివాదాస్పదంగా మారింది. ఇందులో రాజలింగమూర్తి ప్రధాన పాత్ర పోషిస్తున్నాడని రేణికుంట్ల కుటుంబ సభ్యులు కక్ష పెంచుకున్నట్లు తెలుస్తుంది. గత 15 రోజులుగా పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న భూమిపై రాజలింగమూర్తితో గొడవలు జరుగుతుండగా ఇటీవల రేణికుంట్ల కుటుంబ సభ్యులు డిఎస్పీకి ఫిర్యాదు చేశారు. ఈ విషయంలోనే హత్య జరిగి ఉండొచ్చనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

**పోలీసుల అదుపులో ఇద్దరు నిందితులు..?**

మాజీ కౌన్సిలర్ సరళ భర్త రాజలింగమూర్తి హత్య కేసులో ఇద్దరు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. మరికొందరు పరారీలో ఉన్నట్లు ప్రచారం జరుగుతుంది. మృతుని భార్య ఫిర్యాదు మేరకు దర్యాప్తు ముమ్మరం చేసిన పోలీసులు ఈ కేసులో మొత్తం ఐదుగురు నిందితులు ఉన్నట్లు గుర్తించారు. హత్యకు గురైన రాజలింగమూర్తికి రేణికుంట్ల కొంరయ్య, రేణికుంట్ల సంజీవ్ తో భూ వివాదం కారణంగానే ఈ హత్య జరిగిందని, ఇందులో రేణుకుంట్ల సంజీవ్, సంజీవ్ బావమరిది శీమంత్ ను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. మోరె కుమార్, కొత్తూరి కుమార్ తదితరులు పరారీలో ఉండగా, వారి కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు తెలుస్తుంది.

**హంతకులను తొందరలోనే పట్టుకుంటాం: డీఎస్పీ.**

హంతకులను తొందరలోనే పట్టుకుంటామని డిఎస్పి సంపత్ రావు అన్నారు. పట్టణంలోని రెడ్డి కాలనీలో నాగవెల్లి రాజలింగమూర్తి హత్యకు గురైన విషయంపై గురువారం ఆయన మాట్లాడుతూ మృతుని భార్య ఫిర్యాదు మేరకు ఐదుగురు నిందితులపై కేసు నమోదు చేయడం జరిగిందని చెప్పారు. ఈ హత్యలో పాల్గొన్న వారిని ఎంతటి వారినైనా వదిలేది లేదని, ప్రత్యక్షంగా, పరోక్షంగా పాల్గొన్న వారందరిని తొందరలోనే పట్టుకుంటామని చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా డిఎస్పి చెప్పారు.



# విద్యుత్ ఆర్టిజన్స్ అరెస్టులకు ఖండన

**హైదరాబాద్, ఫిబ్రవరి 20 (జనంసాక్షి) :** హైదరాబాదులో విద్యుత్ ఆర్టిజన్స్‌ను వేల మందిని అరెస్టు చేసి వివిధ పోలీస్ స్టేషన్లో నిర్బంధించిన సందర్భంగా సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ తో పాటు సిపిఎం ప్రతినిధి వర్గం అసిఫ్ నగర్ పోలీస్ స్టేషన్ కు వెళ్లి వారిని పరామర్శించి సంఘీభావం తెలియజేశారు. ప్రతినిధి వర్గంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బి రవికుమార్, రాష్ట్ర పార్టీ నాయకులు డిజి నరసింహారావు, భూపాల్ తదితరులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా జాన్ వెస్లీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఆర్టిజన్స్‌తో చర్చలు జరిపి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. నిర్బంధాలు, అరెస్టులతో ఉద్యమాలను అణిచి వేయాలని చూడటం అన్యాయం అని అన్నారు. కార్మికుల పోరాటాలను అణిచి వేసిన గత పాలకులకు తగిన గుణపాఠం చెప్పారన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం విద్యుత్ సంస్కరణను అమలు చేసి ప్రైవేట్ కార్పొరేట్ సంస్థలకు అప్పగించడానికి చూస్తుంటే రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వ్యతిరేకించకుండా అవే విధానాలనుఅమలు చేస్తున్నారు. విద్యుత్ ఆర్టిజన్స్ క్షేత్రస్థాయిలో విద్యుత్ రంగంలో కీలకంగా పని చేస్తున్నారని వారి కోర్కెలను పరిశీలించి, తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

# సికింద్రాబాద్ నుంచి కాగజ్‌నగర్ వెళ్లే రైలు రద్దు

- ఇబ్బందులు పడ్డ ప్రయాణికులు

**హైదరాబాద్, ఫిబ్రవరి 20 (జనంసాక్షి) :** సికింద్రాబాద్ నుంచి పలు ప్రాంతాలకు వెళ్లే పలు రైళ్లు రద్దు కావడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. భాగ్యనగర్ (సికింద్రాబాద్ నుంచి కాగజ్‌నగర్), దానాపూర్ (సికింద్రాబాద్ నుంచి బిహార్) ఎక్స్‌ప్రెస్ రైళ్లతో పాటు మరో రెండు రైళ్లు రద్దయ్యాయి. అయితే రిజర్వేషన్ చేసుకున్న ప్రయాణికులు టికెట్ రద్దు చేసుకునేందుకు ఆశాఖ అధికారులు అవకాశం కల్పించారు. కాని రిజర్వేషన్ కౌంటర్ ఎక్కడ ఉందో తెలియక ప్రయాణికులు సికింద్రాబాద్ కేంద్రీయ రిజర్వేషన్ కార్యాలయానికి వెళ్లారు. ఈ సందర్భంగా రిజర్వేషన్ కౌంటర్‌లో పనిచేస్తున్న ఓ మహిళా ఉద్యోగి స్పందిస్తూ, రైళ్లు రద్దు చేశామని ఆ విషయాన్ని అనౌన్స్‌మెంట్ చేశామన్నారు. ఆపై రిజర్వేషన్ టికెట్ల రద్దుకు ప్రత్యేక కౌంటర్ సైతం ఏర్పాటు చేశామన్నారు. అయితే కొందరే స్పందించారని తెలిపారు. ఈ రైళ్లు రద్దుకు గల కారణాలు ఏమిటి? అనే వివరాలు తమకు తెలియదని ప్రయాణికులు చెప్పారు.

# వరంగల్‌లో దారుణం

- భార్య,అత్త మామలపై కత్తితో దాడి..







**వరంగల్ ఎంజీఎం, ఫిబ్రవరి 20(జనంసాక్షి):** వరంగల్ లోని పోచంమైదాన్ సెంటర్ కి దగ్గర్లో ఉన్న భారతీ డిగ్రీ కళాశాల వాసవి లైన్ లో జన్ను బాబు కుటుంబంతో నివాసం ఉంటున్నారు. జన్ను బాబు కుమార్తె పల్లవి నీ ఉర్సు గుట్ట ప్రాంతానికి చెందిన కోట చంద్రశేఖర్ తో వివాహం జరిగింది. కొన్ని రోజులపాటు బాగానే కలిసి ఉన్నారు, గత ఏడాది కాలంగా గొడవలు జరగడం వల్ల భార్యాభర్తలు కొంతకాలంగా దూరంగా ఉంటున్నారు. భర్త చంద్రశేఖర్ సాయంత్రం తన మామ జన్ను బాబు ఇంటికి వెళ్లి తన భార్య పల్లవి మెడపై కత్తితో దాడి చేశాడు. అలాగే అడ్డు వచ్చిన అత్త,మామల పై దాడి చేసి అక్కడ నుంచి వెళ్లిపోయాడు. స్థానికులు ఇచ్చిన సమాచారం తో క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. భార్య పల్లవి (22) మామ జన్ను బాబు (55) తీవ్ర గాయాలు అవ్వడంతో పరిస్థితి విషమంగా ఉంది. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని దర్యాప్తు చేస్తున్నారు. పట్టపగలే ఇలాంటి ఘటన చోటు చేసుకోవడం వలన చుట్టుపక్కల ఉన్న ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు.

# 'మన మన్యంకొండ' వీడియోను ఆవిష్కరించిన మంత్రి సురేఖ

- రాష్ట్రంలోని ఆలయాల విశిష్టత వీడియో తీసిన శ్రీధర్ ను అభినందించిన దేవాదాయ శాఖ మంత్రి



**హైదరాబాద్, ఫిబ్రవరి 20 (జనంసాక్షి) :** మహబూబ్ నగర్ జిల్లాలో కొలువై ఉన్న మన్యం కొండ శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి వారి జాతర విశిష్టత, ప్రశస్త్యత గురించి ప్రత్యేకంగా రూపకల్పన చేసిన వీడియోను తెలంగాణ రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ గురువారం ఆవిష్కరించారు. ప్రముఖ దర్శకులు , గద్దర్ అవార్డ్స్ కమిటీ సభ్యుడు, ఉత్తమ దర్శకుడు నంది అవార్డు గ్రహీత అల్లాణి శ్రీధర్ రచన దర్శకత్వంలో, ఫిల్మ్ మీడియా ప్రొడక్షన్స్ పతాకంపై సాయి తేజ నిర్మించిన వీడియో చిత్రం 'మన మన్యంకొండ' వీడియోను మంత్రి తన పేషీలో విడుదల చేశారు. "మహిమగల మన్యం, దర్శిస్తేనే పుణ్యం " అని తెలుగు ప్రజలు విశ్వసించే మన్యంకొండ బ్రహ్మోత్సవాలు జరుగుతున్న ఈ శుభ సందర్భంగా ఈ వీడియో చిత్రం ఆవిష్కరణ రాష్ట్ర సచివాలయంలో దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ చేతుల మీదుగా వైభవంగా జరిగింది. మన తెలంగాణ రాష్ట్రంలో ఎన్నెన్నో అద్భుతమైన ఆలయాలు ఉన్నాయని, వాటి వైభవోపేతమైన చరిత్రను, స్థల పురాణాన్ని, ప్రజల విశ్వాసాలను అందరికీ చేరేలాగా ప్రచారం జరగాలని అందుకు ప్రభుత్వం సహకరిస్తుందని మంత్రి చెప్పారు. సమాజం ఉత్తమ విలువలతో ముందుకు సాగాలంటే, ధార్మిక చింతన కలిగించే ఇటువంటి చిత్రాలు మరిన్ని రావాల్సిన అవసరం ఉందని ఆమె ఆకాంక్షించారు. సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యంగా దేవాదాయ శాఖ మన తెలంగాణ ఆలయాల అభివృద్ధికి ఎన్నో చర్యలు చేపట్టిందని మంత్రి ఈ సందర్భంగా గుర్తు చేశారు. అందుకు ఆలయాల సందర్శనకు పెరుగుతున్న జన సందోహమే నిదర్శనమని ఆమె పేర్కొన్నారు. ఎంతో బిజీగా ఉన్నా ఈ వీడియో ఆవిష్కరణకి సమయం ఇచ్చి ప్రోత్సహించినందుకు తమ యూనిట్ తరఫున దర్శకుడు అల్లాణి శ్రీధర్ ఆమెకు ధన్యవాదాలు తెలిపారు. కాగా, దేవాలయాలపై ఎంతో శ్రమకోర్చి వీడియో తీసిని శ్రీధర్ ను మంత్రి సురేఖ ప్రత్యేకంగా అభినందించారు. శాలువా కప్పి సన్మానించారు.

# బరితెగించి మాట్లాడుతున్న బిఆర్ఎస్ నేతలు

- అధికారులపై కెటిఆర్ వ్యాఖ్యలు దుర్మార్గం: ఆది శ్రీనివాస్



**రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి20 (జనంసాక్షి) :** బీఆర్ఎస్ పార్టీ బరితెగించి ముందుకు పోతుందని వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మండిపడ్డారు. బీఆర్ఎస్ పార్టీ భవనంలో ప్రెస్ మీట్‌లో అధికారుల పట్ల కేటీఆర్ చేసిన వ్యాఖ్యలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆది శ్రీనివాస్ మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. సోషల్ మీడియాలో జిల్లా కలెక్టర్ మీద అనేక ఆరోపణ చేస్తున్నారని ఆయన విమర్శించారు. జిల్లా కేంద్రంలోని 1000 ఎకరాల భూముల ఆక్రమణకు గురైంది, వాటిని స్వాధీనం చేసుకునే ప్రయత్నం చేస్తున్నందుకు వ్యక్తిగత జీవితం గురించి చూస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ఫోన్ ట్యాపింగ్ లో మీరు వ్యక్తిగతంగా సినిమా వాళ్ళ జీవితాల్లోకి తొంగి చూడలేదా అని ఆది శ్రీనివాస్ ప్రశ్నించారు. కలెక్టర్ పై ఎలాంటి కేసు లేదని నేను ఇవాళ మీడియాలో చూసానని, కలెక్టర్ పై కేసులు లేనప్పుడు వ్యక్తి గతంగా అవమాన పరిచినదుకు క్షమాపణ చెప్పాలన్నారు ఆది శ్రీనివాస్. ఎలక్షన్ కోడ్ అమలులో ఉండగా టీ పాయింట్ ఫ్లెక్స్ లో కేటీఆర్ ఉంటే తొలగించినందుకు కలెక్టర్ పై తీవ్ర ఆరోపణలు చేస్తున్నారని, పదేళ్ల అవినీతి అక్రమ పాలనలో అనేకమంది మా కార్యకర్తలపై కేసులు నమోదు చేసినా భయపడలేదన్నారు. . ఐపీఎస్, ఐపీఎస్ ఆధికారులకు మా ప్రభుత్వం అండగా ఉంటుందని, డబుల్ బెడ్రూం లో జరిగిన అవినీతిని బయట తీస్తున్నందుకు ఆరోపణలు చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా టీఆర్ఎస్ పార్టీ అసత్య ప్రచారాలు మానుకోవాలని ఆది శ్రీనివాస్ వ్యాఖ్యానించారు.

# పోడుభూములపై ఘర్షణ..

- గిరిజనులకు, ఫారెస్ట్ అధికారుల మధ్య తోపులాటలు..
- పలువురు రైతులకు గాయాలు..
- ఆజంనగర్ లో ఘటన..





**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** పోడు భూముల విషయంలో ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది. అటవీశాఖ అధికారులు పోడు జరుగుతుందనే సమాచారంతో ఆజంనగర్ కు వెళ్లగా అధికారులకు, గిరిజన రైతులకు ఘర్షణ జరిగింది. తోపులాటలు జరిగి పలువురు రైతులకు గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన ప్రకారం వివరాలిలా ఉన్నాయి. జయశంకర్ జిల్లా భూపాలపల్లి మండలం ఆజంనగర్ గ్రామానికి చెందిన సుమారు 20 కుటుంబాలు13 ఎకరాల్లో గత 30సంవత్సరాల నుండి పోడు భూములు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. గతంలోను ఫారెస్టు అధికారులు వస్తే ఎమ్మెల్యేకు చెప్పగా సంబంధిత అధికారులకు తగు సూచనలు చేయగా వదిలిపెట్టారు. ఈ నేపథ్యంలో గతంలో మాదిరిగానే ఈ ఏడాది పత్తి పంట సాగు చేస్తున్నారు. అయితే బుధవారం ఫారెస్ట్ అధికారులు వారి సిబ్బందితో సుమారు 40మంది ఆజంనగర్ వెళ్లారు. పోడు భూముల వద్దకు వచ్చి ట్రెంచ్ కొడుతుండగా బాధిత రైతులు అడ్డుకోగా, అధికారులకు, రైతులకు మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. రెండు వర్గాల మధ్య వాగ్వాదం పెరిగి తోపులాటకు దారితీసింది. మహిళా అధికారులు కడుపులో తన్నుతూ పెల్లెం శారదను దారుణంగా కొట్టడంతో అక్కడే అపస్మారక స్థితిలోకి వెళ్ళింది. ఈ పెనుగులాటలతో ఆమె పుస్తెలు తాడు పడి పోయింది. బాధిత రైతులను తాళ్ళలో కట్టడి చేస్తూ, కర్రలతో చితకబాదారు. అంతటితో ఆగకుండా కొండి శారద, పెట్టెం రజిత, పెట్టెం శ్రీను అను ముగ్గురిని తమ వాహనంలో ఎక్కించుకుని ఫారెస్ట్ ఆఫీస్ కు తీసుకువచ్చి పోలీస్ స్టేషన్లో హాజరు పరిచారు. గతంలో సర్వే చేశారు కానీ పాస్ బుక్కులు ఇస్తామని ఇవ్వలేదు. 30ఏళ్లుగా వ్యవసాయం చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్న తమపై విచక్షణ రహితంగా కొట్టిన ఫారెస్టు అధికారులపై చర్యలు తీసుకుని మా భూములకు పట్టాలు ఇవ్వాలని బాధిత రైతులు కోరుతున్నారు.

# సీఎం రేవంత్‌రెడ్డి నా దేవుడు

- పూజ గదిలో రేవంత్‌రెడ్డి ఫొటో పెట్టుకున్న కుమారి ఆంటీ...



**హైదరాబాద్, ఫిబ్రవరి20 (జనంసాక్షి) :** కుమారి ఆంటీ మరోసారి సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నారు. తన ఇంట్లోని పూజ గదిలో సీఎం రేవంత్ రెడ్డి ఫొటో పెట్టుకున్న ఆమె.. ప్రతి రోజూ దేవుళ్లతో పాటు నిత్యం హారతులిస్తూ రేవంత్ రెడ్డికి కూడా పూజలు చేస్తున్నారు. ఈ రోజు తాను ఫుడ్ స్టాల్ నడిపిస్తున్నానంటే అందుకు కారణం సీఎం అని, ఆయన తనకు దేవుడితో సమానం అని అందుకే పూజలు చేస్తుంటానని చెప్పుకొచ్చింది. ఇందుకు సంబంధించిన వీడియో తాజాగా నెట్టింట్లో వైరల్ అవుతోంది. సీఎంపై ప్రత్యేక అభిమానం హైదరాబాద్ మాదాపూర్ దుర్గం చెరువు సమీపంలో కుమారి ఆంటీ ఫుడ్ స్టాల్ నడుపుతున్నారు. ఆమె ఫుడ్ స్టాల్‌లో తక్కువ ధరకే ఫుడ్ దొరుకుతుందని, టేస్టీగా ఉంటుందని కొందరు గతంలో సోషల్ మీడియాలో ఆమె వీడియోలో షేర్ చేశారు. ఆ వీడియోలు కాస్త వైరల్ గా మారడంతో కుమారి ఆంటీ సెలబ్రేటీగా మారారు. అయితే, పోలీసులు కుమారి ఆంటీ ఫుడ్ స్టాల్ తొలగించేందుకు ప్రయత్నించారు. కానీ, సీఎం రేవంత్ స్పందించి తొలగించవద్దని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో కుమారీ ఆంటీ సీఎం రేవంత్ రెడ్డిపై ప్రత్యేక అభిమానాన్ని పెంచుకుంది.

## స్కూల్ హెడ్‌మాస్టర్ గది ముందు

# పసుపు.. కుంకుమ నిమ్మకాయలు

- ఆందోళనకు గురైన విద్యార్థులు.. పోలీసులకు ఫిర్యాదు



**కరీంనగర్, ఫిబ్రవరి20 (జనంసాక్షి) :** కరీంనగర్ రూరల్ మండలం దుర్శేడ్ జిల్లా పరిషత్ పాఠశాలకు ఎప్పటిలాగే విద్యార్థినీ, విద్యార్థులు ఉదయాన్నే యథావిధిగా వచ్చారు. ఒక్కసారి స్కూల్ ఆవరణలోకి అడుగుపెట్టేసరికి హెడ్ మాస్టర్ గది ముందు పసుపు, కుంకుమ, నిమ్మకాయలతో పూజలు చేసి, ముగ్గు వేసిన దృశ్యం ఆ విద్యార్థుల్ని ఆందోళనకు గురిచేసింది. పక్కనే చెల్లాచెదురుగా పడి ఉన్న నిమ్మకాయలతో ఏం జరిగి ఉంటుందన్న విషయం ఆ పసి హృదయాలకు అర్థం కాలేదు. వెంటనే వారి గురువుల వద్దకు విషయాన్ని తీసుకెళ్లారు. అప్పుడప్పుడే బడికి చేరుకుంటున్న టీచర్లూ ఆ క్షుద్రపూజల ముగ్గులు చూసి అవాక్కయ్యారు. అసలు ఎవరు చేసుంటారు ఈ పని అన్నది ఇప్పుడు దుర్శేడ్ జెడ్పీ హైస్కూల్‌లో చర్చనీయాంశంగా మారింది. పిల్లలను ఎవరైనా టార్గెట్ చేసుకుని ఏవైనా క్షుద్ర ప్రయోగాలు చేసుంటారా లేక, బళ్లో గురువులంటే పడనివారి పనయ్యుంటుందా లేక, మధ్యాహ్నం మాత్రమే బిజీగా ఉంటూ రాత్రంతా కామ్‌గా ఉంటుందని ఈ బడిని తమ క్షుద్రపూజల కోసం ఎంచుకుని ఉంటారా.. ఇలా పలురకాల అనుమానాలకు ఆస్కారమిచ్చింది. స్కూల్ హెడ్మాస్టర్ స్థానిక కరీంనగర్ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. పోలీసులు ఆ పని ఎవరు చేసి ఉంటారనే కోణంలో ఇప్పుడు విచారణ చేపట్టారు. కానీ, రేపట్నుంచీ పిల్లల్ని బడికి పంపాలంటే తల్లిదండ్రుల్లోనూ ఒకింత తెలియని ఆందోళనకు గురవుతున్నారు.

## కజారియా ఎటర్నిటీ, కెరోవిట్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్ ప్రారంభం




**ఖైరతాబాద్, ఫిబ్రవరి 20 (జనం సాక్షి) :** దేశంలోనే అతిపెద్ద సిరామిక్, విట్రిఫైడ్ టైల్ తయారీదారుగా పేరున్న కజారియా మరో ముందడుగు వేసింది. హైదరాబాద్ లో అతిపెద్ద ఎటర్నిటీ, కెరోవిట్ ఎక్స్ పీరియన్స్ సెంటర్ ను అందుబాటులోకి తెచ్చింది. ఈ కార్యక్రమానికి రిషీ కజారియా(జాయింట్ ఎండీ కజారియా సిరామిక్స్ లిమిటెడ్, మేనేజింగ్ డైరెక్టర్ కజారియా బాత్‌వేర్ ప్రై. లిమిటెడ్) హాజరై ఎక్స్ పీరియన్స్ సెంటర్ ను ప్రారంభించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ కజారియా తయా రు చేసే ప్రత్యేకమైన టైల్, బాత్, శానిటరీవేర్ కలె క్షన్ ను ప్రతీ కుటుంబానికీ అందుబాటులో ఉంచడమే తమ లక్ష్యమని తెలిపారు. హైదరాబాద్‌లో నెలకొల్పిన ఈ మెగా ఎక్స్‌పీరియన్స్ సెంటర్ ను నానాటికీ విస్తరిస్తున్న వారి నెట్ వర్క్ కు మరో మైలురాయిగా అభివర్ణించారు. దేశ వ్యాప్తంగా వరల్డ్ క్లాస్ డిస్ ప్లేస్ ను అందుబాటులోకి తేవాల నే కజారియా ఆలోచనకు ఇది మరింత బలాన్ని చేకూరుస్తుందని చెప్పారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం
21 ఫిబ్రవరి 2025
తెలంగాణ

# అక్షరాల దారిలో "తల్లడిల్లే తల్లి వేరు"



నేటి సాంకేతిక యుగంలో తెలుగు సాహిత్యాన్ని, అధ్యయనం చేస్తూ, కవిత్వాన్ని రాస్తూ చైతన్య వంతమైన సాహితీ కవిత్వాన్ని రాస్తూ, తెలుగు భాషకు తెలుగు సాహిత్యానికి సేవ చేస్తున్న, ప్రతిభావంతులైన సాహితీవేత్త సరికొండ నరసింహా రాజు. అతని రచనలు తెలుగు సాహిత్యాన్ని సృజనాత్మక ఎత్తులకు చేర్చాయి. వారి కవితా సంపదలో ప్రత్యేక స్థానం పొందిన "తల్లడిల్లే తల్లి వేరు" అనే ఈ కవితా సంకలనం, తెలుగు భాషా సాహిత్యాల యొక్క సూక్ష్మ సౌందర్యాన్ని, సామాజిక-సాంస్కృతిక లోతులను అన్వేషించే ఒక అద్భుతమైన ప్రయాణం. పుస్తకం శీర్షిక "తల్లడిల్లే తల్లి వేరు" అనేది మానవుడి అస్తిత్వ సంక్షోభం, మూలాలు తెగిపోయిన సామాజిక వ్యవస్థ, లేదా సాంస్కృతిక అనాథత్వాన్ని సూచిస్తుంది. నరసింహా రాజు కవితలు ప్రకృతి, మానవ హృదయ సంఘర్షణ, మరియు భావనలను ప్రతీకలను చిత్రి స్తాయి. భాషా సౌందర్యం కవి యొక్క "వర్ణాలు లేని వాక్యాలు" సరళతలోనే గాఢమైన అర్థాలను దాచి ఉంచాయి."చూపుడి వేలు పై సూర్యోదయం"భాషను సజీవంగా మారుస్తాయి. "నెత్తుటి పాదాలు", "భస్మ సింహాసనం" వంటి రచనలతో నరసింహారాజు తెలుగు కవితకు" మరొక పురుడు"పోసినట్లుగా, ఈ పుస్తకం సాంప్రదాయిక మరియు ఆధునికతల సమన్వయాన్ని సూచించింది. "తల్లడిల్లే తల్లి వేరు" కేవలం కవితల సమాహారం కాదు, తెలుగు భాష యొక్క సృజనాత్మక శక్తికి నిదర్శనం.

ఆంగ్ల భాష డబ్బు సంచి/అమ్మ భాష గర్భసంచి/మట్టి సుగందాల సమాసాలే/మమకారాల చందస్సు/తెలుగు వ్యాకరణం/తెలుగు తల్లి తోరణం. వంటి పదునైన కవిత సాహిత్యం ద్వారా తెలుగును మాతృస్వరూపంలో చిత్రించాడు. అలల భాషలోనే నది/ఆకుపచ్చని భాషలోనే ప్రకృతి/పరిమళ భాషలోనే పూల తోట/అమ్మ భాషలోనే పాలపిట్ట పాడుతూ/అమ్మ చనుబాలు తాగుతూ/సహజ సుందరంగా పరవశిస్తూ..

ఇది భాషకు జన్మనిచ్చే, పోషించే, ప్రేమతో తాగిస్తూ పెంచే తల్లి సాదృశ్యం. "అమ్మ చనుబాలు తాగుతూ"అనే పంక్తిలో భాషా సంస్కారం సహజంగా స్రవించే పాలతో సమానంగా కవి వర్ణన అద్వితీయ మైనది. పరాయికరణ అణిచివేత పై తిరుగుబాటు చేస్తూ/అక్షర ఖడ్గ చలనంతో కదిలింది కవి సైన్యం/అమ్మ భాష శిఖరం పై చైతన్య కవిత పతాకాలి ఎగరేస్తూ/ "పరాయికరణ అణిచివేత పై తిరుగుబాటు"అనేది ఆధునికత, విదేశీ భాషల ప్రభావాన్ని వ్యతిరేకించే సందేశాన్ని తెలియజేశారు కవి.

తల్లి భాష ఓ హృదయ లాలన/చందమామ ముంగిట నిలిపే/అమ్మ జోలపాటే ఓ పెద్ద భావ శిక్ష/గోరుముద్దుల తినిపించే అమ్మతనమే/నా తెలుగు అక్షరాలు/ఆమని ప్రసవించేదే/అమ్మ పాల భాషలోని ఆత్మీయతలను తెలియ జేశారు. నా తెలుగు తల్లి తప్పిపోయింది/బానిసల బతకలేక/సంకర నగరాల నరకాలనుండి/ పారిపోయింది/ పల్లె యాసల్లో బాసల్లో/అమ్మ సవర భాష జీవనది. నేటి సాంకేతిక యుగంలో టీవీ ఛానల్‌లో వాట్సాప్ యూ ట్యూబ్‌లో కూడా కలుషితమైన భాషను ఉపయోగిస్తూ తెలుగు భాషను ధ్వంసం చేస్తున్నారు అనే ఆవేదనను తెలియజేశారు కవి.దివ్య కీర్తన తేజరిల్లు/మాతృమూర్తికి తెలుగు తల్లికి/మధుర భావము కవితల్లి/తేటతెనుగు రంగరించి/కావ్యామృతమును పంచిపెట్టిన/కవీశ్వరులకు నమస్సులు. కవులు భాషను రక్షించడానికి అక్షరాలను ఆయుధాలుగా ఉపయోగిస్తున్నారు. ఇది సాహిత్య పోరాటాన్ని సూచిస్తుంది. "శిలల మధ్య పడి వేయండి/ఉలి నౌతాను... కావ్యమవుతాను"అనే పంక్తులు కష్టాలు, సృజనాత్మకతలు కలిసి కవిత్వాన్ని పునాదిస్తాయని సూచిస్తాయి. "కావ్యామృతమును పంచిపెట్టిన కవీశ్వరులకు నమస్సులు"అంటూ, తెలుగు సాహిత్య వారసత ఈ కవిత ఆధునిక యుగంలో మాతృభాషలు ఎదుర్కొంటున్న సవాళ్లను ప్రశ్నిస్తుంది. ఈ కవిత తెలుగు భాష ఘోష. తెలుగు భాషను ఒక జీవిత ప్రవంతిగా, సంస్కృతి సంరక్షకురాలిగా చిత్రించి, దాని ప్రాధాన్యతను తల్లి ప్రేమతో సమానం చేస్తుంది. కవి యొక్క భాషా దీక్ష, సాంస్కృతిక అస్తిత్వాన్ని రక్షించే తపన ఇందులో ప్రతిధ్వని స్తున్నాయి. (ఫిబ్రవరి 21 అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవం సందర్భంగా)



పూసపాటి వేదాద్రి
కవి సాహితీ విశ్లేషకులు
9912197694

# స్నేహ బలం బతికిస్తుంది!



ఎండి.మునీర్
సీనియర్ జర్నలిస్ట్, విశ్లేషకులు,
9951865223,



స్నేహ బలం చవి చూస్తే, అస్వాదిస్తే తప్ప మనకు తెలియదు. స్నేహం మనిషిని బతికిస్తుంది. అది నీ విల్ పవర్ ను పెంచుతుంది.ఈ మధ్య కాలం లో నా అలవాట్లు కొన్ని తప్పాయి. అందులో తప్పందల్లా నా ఆర్టికల్స్ రాయడం. ఎందుకంటే నా స్నేహితులు ఎలాగో, నేను రాయడంను ఊపిరి గా భావిస్తాను. అందుకే..ఎందుకో.. ఎందుకో.. నిద్ర లేవగానే ఈ రోజు ఫ్రెండ్స్ పేరిట ఒక లేఖ రాయాలని అనిపించింది. అలవాటుగా రాయడం, చదవడం, వాకింగ్‌కు వెళ్లడం ఉండేది. మిత్రులు కె. రాజన్న, మాటూరి బానయ్య ముగ్గురం రోజూ 7 నుంచి 8 కిలో మీటరులు నడుస్తాము.10 వేల స్టెప్స్ దాటెవి. ఇటీవల, ప్రస్తుతం హైదరాబాద్ లో ఉంటున్న మిత్రుడు మార్టిన్ ప్రకాష్ మంచిర్యాల వచ్చాడు. అప్పుడు ప్రకాష్ రెండు రోజులు నా ఇంటిలోనే ఉన్నాడు. మేమిద్దరం కలిసి కూడా వాక్ కు వెళ్ళాము! నేను వాకింగ్, జిమ్ అంటే ఇష్టపడతాను. జి. కనకయ్య, శేఖర్, ప్రకాష్, నేను, రాజన్న, ఇలా చాలా మందిమి కలిసి పెరిగాము. సుఖ దుఃఖాలను పంచుకు న్నాము!స్నేహం అంటే నాకు చాలా ఇష్టం. అందుకే నేమో నాకు గంప నిండా స్నేహితులు, బంధువులు, హితులు, సన్నిహితులు, కోడి పిల్లల్లా ఉన్నారు. నేను ఈ విషయంలో చాలా గర్వంగా ఫీల్ అవుతుంటారు. అందుకే నేనెప్పుడూ అంటూ ఉంటాను. అభి హమ్ జిందా హై తో సిర్ఫ్ దోస్తొంకి బదవులత్ అని.. (మనం బతికి ఉన్నామంటే ఆ స్నేహితుల ప్రేమ హృదయాల వల్లె) స్నేహమే నా ఆక్సిజన్ అని!రెండు నెలల క్రితం సడన్ గా సిక్ అయిపోయాను. ఎంత సిక్ అయిపోయాను అంటే మా అందరి ఆదర్శ ప్రాయుడు మడక రాయలింగు అన్న లాంటి వాళ్ళు కాలం చేసినా, కనీసం కడ చూపుకు నోచుకోని పరిస్థితి వచ్చింది.ఇలా పలువురు మిత్రుల విషయంలో జరిగింది. అనారోగ్యం కారణంగా నా వాకింగ్ ఆగిపోయింది. కాని మిత్రుల రాక పోకలు గతం కన్నా పెరిగాయి. ప్రకాష్, కనకయ్య, శేఖర్‌లు, వారి భార్యా పిల్లలు, రాజేందర్ , జనార్దన్, పుల్లూరు సుధాకర్,వసీం, నా 10 క్లాస్ బ్యాచ్ స్నేహితులు అందరూ,జనం సాక్షి ఎడిటర్, మిత్రుడు రెహ్మాన్ భాయ్, ప్రతిపక్షం ఎడిటర్ ఫజల్ భాయ్, అఫ్జల్, కాంపల్లి సమ్మయ్య,అందరూ నా వెంటే ఉన్నారు. నన్ను అమితంగా ప్రేమించే మాజీ ప్రభుత్వ విప్, అన్ని వేళలా నాతోనే అనే విధంగా కనిపించే నల్లాల ఓదెలు,నా ఆప్తులు, శ్రేయోభి లషులు,ఈడి విజయరాజు సర్, సంజీవరావు, రాజరత్నం, ముగ్గురు అన్నదమ్ములు, ఆప్తులు అన్న కెంగర్ల మల్లన్న, రచయిత, నా మిత్రుడు,చందు అన్న, శేషగిరి అన్న, నన్ను ప్రేమించే ఎమ్మెల్యే గడ్డం వివేకానంద, ఎంపీ గడ్డం వంశీ, కోదండ రామ్ సర్, సంపత్ కుమార్,ఓ.రాజశేఖర్ , వాసిరెడ్డి సీతారామయ్య , సోదరులు మదాసు రామ్మూర్తి, వంశీ, నాగేశ్వర్ రావ్, గోసిక మల్లేష్,సోదరులు అబ్బాస్ , విజయ్, హెచ్.రవీందర్, టీచర్ కుమార్, లక్ష్మణ్, చందర్,సిరాజ్ , సుల్తాన్, ఇంకా సింగరేణి అధికారులు,ఇలా ఎంతో మంది శ్రేయోభిలాషులు, కరీంనగర్ లో శ్రీనివాస్, సరోజ దంపతులు ఇలా ప్రతీ ఒక్కరికీ భోజనం తెచ్చే వారు, నా మిత్రులు జి. యాదిరెడ్డి వచ్చే వాడు, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ కుమార్, ఎం . శ్రీనివాస్, రవికుమార్ రెడ్డి ఇలా ఎంతో మంది శ్రేయోభిలాషులు, కుటుంబ సభ్యులు వారి ప్రేమ గౌరవం లభించడం ఇదే జీవితం అనిపిస్తుంది! కష్టాలు ఎన్నటికి తీరడం సాధ్యం కాదు. అవి ఏ రూపంలో అయినా ఉంటూనే ఉంటాయి! వాటిని మనం ధైర్య సాహసాలతో, విల్ పవర్ తో ఎదుర్కోవాలి అని అనుభవం మీద తెలుసుకున్నాను. పట్టుదల, చిత్తశుద్ధి, నిజాయితీ మంచి స్నేహం మనల్ని బతికిస్తది. జీవితం అంటే అదే మరి, ఎవరి జీవితం కూడా సులభ తరం కాదు. కాని దానిని సులభతరం చేసుకోవాల్సి వస్తుంది. అన్నింటికీ మించి బీ పాజిటివ్ డియర్, లవ్ ఎవ్రీ వన్ జానీ!. హంతో వైసె హి జీతే హై.. బీ వేర్ ఆఫ్ ప్యార్ కే దుష్మన్. స్వచ్ఛమైన హృదయం తో స్నేహం చేస్తూ,సదా మీ ప్రేమ కోరే.

# అసలు బేడీలు వేయాల్సింది ఎవరికి?

అమెరికాకు మన ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ వెళ్ళి వచ్చినా మనోళ్ళకు అవమాన భారం తప్పడం లేదు. అవే యుద్ధ విమానాల్లో గొలుసులు, హ్యాండ్ కప్ లు వేసి తరలిస్తున్నారు.మన పీఎం నరేంద్ర మోడి మాట కూడా వినలేదని అమెరికా ప్రెసిడెంట్ డోనాల్డ్ ట్రంప్ స్వయంగా ఎగుమతి దిగుమతు ల టారిఫ్ ల విషయం లో చెప్పారు. ఇతరులకు ఏది వర్తిస్తుందో అదే ఇండియా కూడా అంటూ స్పష్టం చేసినట్లు అమెరికా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చెప్పారు. చిన్న చిన్న దేశాలవారు తమవారిని యుద్ధ విమానాల్లో పంపవద్దని పేర్కొని అడ్డుకోగా తిరిగి మామూలు గా ప్రయాణికులను, పంపే విమానాల్లో తరలిస్తున్న పరిస్థితి కొలంబియా, మెక్సికో లలో చూసాము. ఆ మాత్రం కూడా మన వాళ్ళు చేయలేదు. అమెరికా అంటే భయమా, గౌరవమా. తెలియదు, అమెరికా లెక్క ప్రకారం మనవాళ్ళు 7.25 లక్షల మంది అక్కడ అక్రమంగా ఉంటున్న పరిస్థితి ఉన్నది. ఆ దేశం తో 500 బిలియన్ డాలర్ల వ్యాపార లావాదేవీల వ్యవహారం ఉన్నది. లక్ష కోట్లకు పైగా మనకు, అమెరికాకు రెవెన్యూ వస్తున్నది. మోడీజీ గతంలో కొద్ది సేపు ఉక్రెయిన్,రష్యా యుద్ధం కు విరామం ఇప్పించి వాళ్ళను రప్పించారు, అని బీజేపీ వాళ్లు భారీ ప్రచారం చేశారు. ఆ తర్వాత అదంతా ఉత్తదే అని అధికారిక ప్రకటన రావడం చూసాము. మొన్నటి మొన్న మన పీఎం మోడీజీ అమెరికా వెళ్ళే ముందు, వెళ్లి వచ్చిన తర్వాత మనవాళ్ళు ఎన్నో ఆశలు పెట్టుకున్న పరిస్థితి. చివరికి చూస్తే, అంతా ఉత్తదే, తుస్సు అయ్యింది.

పీఎం మోడీ, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ స్వయంగా వారిద్దరి మధ్య జరిగిన సంభాషణ లో ముఖ్య అంశాలు అన్నట్లు ఒక్కక్కిటిగా లీక్ చేస్తున్నారు. టారిఫ్ విషయంలో రాజీ లేదు అని పీఎం మోడీ కి చెప్పాను, అని ట్రంప్ కుండ బద్దలు కొట్టాడు. కనీసం దశాబ్దాలు గా అమెరికాలో ఉన్న అక్కడ పుట్టిన శిశువుకు అమెరికా పౌరసత్వం ఇస్తున్న చట్టం ను కూడా ట్రంప్ రద్దు చేశారు. ఆ విషయం లో కూడా మన పీఎం నరేంద్ర మోడి మాట్లాడినట్లు ఎక్కడ కూడా దాఖలా లేదు. అక్రమంగా అమెరికాలో ఉండడం తప్పే అంటాడు మన విదేశాంగ మంత్రి.

ఇలాంటి వ్యవహారం అధికారం లో ఉన్న వారిది ఉంటే ఉద్యోగాలు దొరకక, ఉపాధి కోసం, తక్కువ జీతాలు ఉన్నవాళ్లు ఎక్కువ జీతాల కోసం లక్షల రూపాయలు అప్పులు చేసి, ఆస్తులను, భూములను, పుస్తెలను అమ్మి, విదేశాలకు అక్రమ మార్గాల్లో వెళ్ళడం జరుగుతున్నది. ఇదంతా మన ప్రభుత్వ వైఫల్యమే కదా? ఇక్కడ మీరిచ్చిన హామీ ప్రకారం చదువుకోదని, యూనివర్సిటీ లు సరిపడ లేవు, ఫ్యాకల్టీ లే భర్తీ కాని పరిస్థితి ఉన్నది. ఏదో చదువుల పేరు మీద అమెరికా వెళ్లి చదువుతూ ఐదు రోజుల పార్టైం ఉద్యోగం చేసుకుంటే ఖర్చుల వెసలు బాటు ఉండేది, ఇప్పుడు ట్రంప్ ఆదేశాలతో పార్ట్ తో పార్ట్ టైం నౌకరి హుష్ కాకి అయిపోయింది. టోటల్ గా మన వాళ్ళ పరిస్థితి అగమ్య గోచరంగా మారింది. బతుకుదామని, వెళ్ళిని వారికి బతుకు లేదు, బతికే మార్గం లేదు! దేశంలోకి ఇలా అన్నీ కోల్పోయి అవమాన భారంతో అమెరికా నుంచి ఘర్ వాపసు వస్తున్న వారి కి ఇండియాలో ప్రభుత్వం గ్యారంటీ లేదు. ఇలాంటి జీవితానికి కారకులు పాలకులు కారణం కాదా? అక్రమంగా ఉంటున్న వారిది తప్పే, అయితే దీనికి కారణం ఎవరు? ఈ స్థితి, దుస్థితికి భాద్యులు ఎవరు? నిజానికి ప్రతీ భారత పౌరునికి రాజ్యాంగం ఇచ్చిన జీవించే హక్కు ను హరిస్తున్నది ఎవరు? ఉద్యోగం, వైద్యం, రైతన్న లకు పంటకు తగిన గిట్టుబాటు ధర, రుణ మాఫీ,చదువు, ధరలు తగ్గించడం,పాలకుల భాధ్యత కాదా? అసలు బేడీలు ఎవరికి వేయాలి? ఎవరికి గొలుసులు, హ్యాండ్ కప్ లు పడాలి?

ఎండి. మునీర్,
సీనియర్ జర్నలిస్టు, విశ్లేషకులు,
9951865223,

# అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం

**మాతృభాష పైన మమకారమును మాని, ఆదరించుటన్న అన్య భాష, మంచినీళ్లు వదిలి మద్యమ్ము ద్రాగుటే, శ్యాము వాక్కు నమ్ము సత్య వాక్కు.**
**భాష్యతి ఇతి భాషః.**



భాషింపబడునది భాష అని అర్థం.భావ గ్రహణకు, భావవ్యక్తీకరణకు సాధనమైనది భాష. తల్లి గర్భంలో ఉన్నప్పటినుండే శిశువుకు అలవడే భాష మాతృభాష. శిశువు పుట్టిన తర్వాత తన పరిసరాలను, పరిస్థితులను అనుసరించి ఆ భాషలో తన వ్యవహారాన్ని కొనసాగిస్తాడు.పక్షి పిల్లలు రెక్కల సాయంతో ఎగిరినట్లుగా పిల్లలు తమ ముద్దుముచ్చట్లతో ఊహ ప్రపంచంలో విహరిస్తారు.పిల్లల సహజాతాలు మాతృభాష ద్వారానే వికసిస్తాయి. యునెస్కో ధ్రువీకరించిన 8324 భాషల్లో సుమారు 7000 భాషలు నేడు ఉనికిలో ఉన్నట్లు తెలుస్తుంది. ఏ భాషలో నైతే కనీసం 40 శాతం పట్టణ పాట్టణాలలో లేకపోతే ఆ భాష క్రమంగా కనుమరుగవుతుందని భాషావేత్తలు చెబుతున్నారు. మనది భారతదేశం.భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీక.రాజ్యాంగం గుర్తించినవి పోను గుర్తించనివి వ్యవహారం లో గల భాషలు చాలా ఉన్నాయి భాష అనేది ఆయా జాతుల అస్తిత్వానికి ప్రతీక వంటిది. ఈ నేపథ్యంలో మనం ఏటా ఫిబ్రవరి 21న అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం.1947లో దేశ విభజన తరువాత పాకిస్తాన్ తమ దేశంలో ఉర్దూను అధికార భాషగా చేస్తూ రాజ్యాంగంలో పొందుపరిచింది. దానితో అప్పటి తూర్పు పాకిస్తాన్ అంటే నేటి బంగ్లాదేశ్ లో ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ప్రజలు ఆందోళనలు చేశారు. బంగ్లాదేశ్ లో అధిక శాతం ముస్లిం మతస్తులైన వారి మాతృభాష బెంగాలీ.దాంతో అక్కడ బెంగాలీని అధికార భాషగా గుర్తించాలని విద్యార్థులు సామాన్య ప్రజలతో కలిసి 21.2.1952 పెద్ద ర్యాలీ తీశారు. ఆందోళన తీవ్ర రూపం దాల్చడంతో అక్కడి ప్రభుత్వం కాల్పులు జరిపింది.ఆ కాల్పుల్లో ఐదుగురు చనిపోయారు. మాతృభాష పరిరక్షణ కోసం అసువులను అర్పించిన ఆ అమరవీరుల జ్ఞాపకార్థం ఏటా ఫిబ్రవరి 21న అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం గా ప్రకటిస్తూ యునెస్కో 21.2.1999 ప్రకటించి 21.2.2000జరుపుతున్నది. ఈ నేపథ్యంలో విశ్వవ్యాప్తంగా మనం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని జరుపుకుంటున్నాము.తెలుగకు సంబంధించి ఆగస్టు 29న గిడుగు రామమూర్తి పంతులు జయంతిని తెలుగు భాషా దినోత్సవం గా జరుపుకుంటుండగా, తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన తర్వాత పలుకుబడులకవి ప్రజాకవి కాళోజి నారాయణరావు జయంతి అయిన సెప్టెంబర్ 9 ని తెలంగాణ భాషా దినోత్సవం గా జరుపుకుంటున్నాము.ఈ నేపథ్యంలో మాతృభాష ప్రాశస్త్యాన్ని గురించి చర్చలు, సభలు, సమావేశాలు, జరుగుతున్నాయి.మనకు ఇప్పటికే పెద్దలు చెప్పినట్టుగా మాతృభాషా తృణీకారము- మాతృదేవీ తిరస్కారంతో సమానమని మాతృభాష కళ్ల వంటిది- అన్య భాష కళ్లద్దాల వంటిది, మాతృభాష తల్లిపాల వంటిది- ఇతర భాషలు పోతపాల వంటివి అని ఇలా మాతృభాష ప్రాధాన్యం గురించి చెప్పే సూక్తులు ఎన్నో ఉన్నాయి. కాగా ఇటీవల కేంద్ర ప్రభుత్వం 2020 లో ప్రవేశపెట్టిన నూతన విద్యా విధానంలో మాతృభాషలకు ప్రాధాన్యమిస్తున్నట్లు ప్రకటించింది. ప్రభుత్వ ప్రైవేటు అనే విచక్షణ లేకుండా కనీసం ప్రాథమిక విద్య నైనా దేశవ్యాప్తంగా ఆయా మాతృభాషలలో గడించినప్పుడే అవి మనుగడ సాగిస్తాయి. పునాది లేకుండా భవనం నిలవదు కదా! ముఖ్యంగా మన తెలుగు రాష్ట్రాలలో తెలుగుకు తెగులు సోకిందంటే అతిశయోక్తి కాదు. దక్షిణాది రాష్ట్రాలైన కర్ణాటక, కేరళ, తమిళనాడు వంటి రాష్ట్రాలలో అక్కడి మాతృభాషకు ఎంతో ప్రాధాన్యమిస్తున్నారు. మన పరిస్థితి రెంటికి చెడ్డ రేవడి అయింది. విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాల పేర తెలుగును నిర్లక్ష్యం చేస్తున్నారు. బట్టీయం వేయించి సాధించిన మార్కులతో తల్లిదండ్రులు సంతోషపడుతున్నారు.అందుకే ఇవాళ పిల్లలు ప్రకృతితో, పరిసరాలతో మమేకం కాలేకపోతున్నారు.ప్రాథమిక చదువు యొక్క లక్ష్యం పరిసరాలతో ఇమిడిపోవడమే అన్న అంశాన్ని ఎవరు గుర్తించటం లేదు.మాతృభాషలో పరిజ్ఞానం ఉన్నవారే ఇతర భాషల్ని సులువుగా నేర్చుకుంటారని విద్యావేత్తలు, శాస్త్రవేత్తలు అంటున్నారు.అభివృద్ధి చెందిన దేశాలన్నీ తమ మాతృభాషలో విద్యాబోధన కొనసాగించినవే కావడం గమనీయం.అన్నింటిలో పాశ్చాత్యులను అనుకరించే మనవాళ్లు ఈ విషయంలో మాత్రం అనుకరించడం లేదు.కాగా మన దగ్గరే నిన్న మొన్నటి వరకు మాతృభాషలో విద్యాభ్యాసం చేసి ఉన్నత పదవులను అందుకున్న వారు ఎందరో ఉన్నారు.తెలుగులో అపారమైన సాహిత్యం, చరిత్ర ఉంది.అది అజంత భాషగా గుర్తింపు పొందడం వల్ల సంగీతానికి అనువైన భాషగా పేరుపొందింది.ఇలా మన తెలుగు భాష వైభవాన్ని గురించి ఎంత కీర్తించినా తక్కువే. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో తెలంగాణ అధికార భాషా సంఘం గాని తెలంగాణ సాహిత్య అకాడమీ కి చైర్మన్ గాని నియామకం కాలేదు ప్రభుత్వం తెలుగు భాష అమలుపట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి.అందువల్ల అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ సందర్భంగా మనం మన భాషను సంస్కృతిని పరిరక్షించుకోవాల్సిన అవసరం మన అందరి పైన ఉన్నది.



డాక్టర్ శంకరమంచి
శ్యాంప్రసాద్
99 891 48 305

# మాస్టర్"కీ"ని సాధించే దిశలో బిసి కులాలు

సమానత్వం ప్రజాస్వామ్య వ్యవస్థలో ముఖ్యమైన భావన. ఆర్థిక, సామాజిక, విద్య మున్నగు రంగాలలో అసమానత్వాలు సామాజికంగా వ్యక్తుల మధ్య అసమానత్వాలకు దారితీయకుండా ఉండేటట్లుగా ఉండకూడదు. రాజకీయ హక్కులను సంపూర్ణంగా అనుభవించాలంటే వ్యక్తికి సామాజిక, ఆర్థిక సమానత్వం ఉండాలి. అసమానత్వాలు ఉన్న సామాజిక వ్యవస్థలో ఒక వర్గం ఇంకొక వర్గానికి లోబడి ఉంటుంది. వ్యక్తులలో రెండు రకాల అసమానత్వా లుంటాయి. ఒకటి స్వాభావికం కాగా, రెండవది రాజకీయమైనది. రాజకీయ అసమానత్వం ఇతర అసమానత్వాలకు దారితీయును. ఈ రకమైన వ్యవస్థలో కొందరికి మిగతావారికన్నా ప్రత్యేక, విశేష అధికారాలుంటాయి. ఈ అధికార బలంతో వారు మిగతా వారిని శాపించే స్థితిలో ఉంటారు. ఈ విధమైన సామాజిక అసమానత్వాలు ప్రజాస్వామ్య వ్యవస్థకు విరుద్ధమైనవి. ఈ విధమైన వ్యవస్థను రూపుమాపి సామాజిక, ఆర్థిక సమానత్వం కల్పించుటకు రాజ్యాంగం ఎస్.సి., ఎస్.టి., బి.సి. వర్గాలకు ప్రయోజనం కల్పించుట కొరకు రిజర్వేషన్ విధానం ద్వారా అణచివేయబడిన వర్గాలకు మిగతా వర్గాలతో సమాన అవకాశాలను కల్పించడంలో రాజ్యాంగం చెప్పుకోదగినంతగా కృతకృత్యం అయ్యింది. కానీ కేవలం సమానత్వ హక్కు కల్పించడం ద్వారా సామాజిక న్యాయం సమకూరదని, సమానత్వం పొందు టకు తగిన సామాజిక పరిస్థితుల కల్పన ద్వారా అది సాధ్యమవుతుందని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు 76 సం.ల నుండి గుర్తించ లేదు.

నిజానికి స్వాతంత్ర్యం రాకపూర్వం భారతదేశంలో కొన్ని బ్రిటీష్ పాలిత రాష్ట్రాలలో మరియు రాజరిక పాలి రిజర్వేషన్ విధానం అమలులో ఉండేది. 1925వ సంవత్సరం నాటికి భారత ప్రభుత్వం కొన్న" అల్పసంఖ్యాక వర్గాలకు రిజర్వేషన్ కల్పించినది. 1936 నాటికి 25 శాతం రిజర్వేషన్ ను ముస్లిం మరియు ఇతర అల్పసంఖ్యాకులకు ప్రభుత్వ సర్వీసులలో రిజర్వేషన్ కల్పించబడినది. స్వతంత్ర్యం వచ్చిన తరువాత ఈ కమ్యూనల్ రిజర్వేషన సవరించబడినవి. రాజ్యాంగ నిర్మాణ సభలో రాజ్యాంగబద్ధమైన ఎస్.సి., ఎస్.టి.ల రిజర్వేషన్లకు అంతగా వ్యతిరేకతలేదు, కాని ఈ మధ్యన శాసనబద్ధమైన ఇతర వెనుకబడిన వర్గాల రిజర్వేషన్లు ప్రతికూల వాతావరణంను ఎదుర్కొంటున్నాయి. ఇతర వెనుకబడిన తరగతులను నిర్ధారించుటకు భారతప్రభుత్వం 1953వ సంవత్సరంలో కాకా కాలేల్కర్ కమిషన్ ను మరియు రాజ్యాంగ స్ఫూర్తిని, వివిధ వర్గాల నుండి వచ్చే ఒత్తిడికి తలొగ్గి 1979లో భారత ప్రభుత్వం రెండవ వెనుకబడిన తరగతుల కమీషన్ను బి.పి. మండల్ నాయకత్వం లో ఏర్పాటు చేసినది. మండల్ కమీషన్ నివేదిక ప్రకారం షెడ్యూల్డు కులాలు 1500, షెడ్యూల్డు తెగలు 1000, వెనుకబడిన కులాలు 3,749 ఉన్నాయి. బ్రాహ్మణీయ సమాజక్రమంలో అణగారిన కులాలు మొత్తం 6000 వరకు ఉన్నాయి. ఈ కమీషన్ 3743 కులాలను వెనుకబడినవిగా 27 శాతం రిజర్వేషన్లను సూచించినది. మండల కమీషన్ సూచనలను ఆమోదిస్తూ 1990లో కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీచేసినది. ఫలితంగా సమాజంలో మండల్ సూచనలకు అనుకూల ప్రతికూల వర్గాలు ఏర్పడ్డాయి. ఇరువర్గ... మొదలయిన మాటి ద్వారా తమ నిరసనలు తెలుపుతూనే ఉన్నాయి. 2007 2008 లో పార్లమెంటు, ఇతర వెనుకబడిన వర్గాలకై చేసిన రిజర్వేషన్లను సుప్రీంకోర్టు రాజ్యాంగబద్ధమైనవని తీర్పునివ్వడం ద్వారా వాటి అమలు తప్పనిసరి అయినది. సుప్రీంకోర్టు కూడా కేవలం కులంనే వెనుకబాటుతనానికి మూలం అని చెప్పనప్పటికి కూడా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సామజిక న్యాయం చేయడం లేదు అని, వెనుక బడిన వర్గాలు తమ సమస్యల పరిష్కారం కొరకు రాజ్యదికారమే శరణం అనే స్తితి కి వచ్చినాయి అనడంలో సందేహం లేదు.

ఈ మధ్య కాలంలో తెలంగాణా లోని బీసి ల ఉద్యమాలు గమనిస్తూ ఉంటే యు.పి లోని, మాన్య శ్రీ కాన్షీరాం గారి ఉద్యమాలు" లాగ అనిపిస్తుంది.



అంబేద్కర్ భావ జాలాన్ని అర్థం చేసుకున్న మాన్య శ్రీ కాన్షీరాం, బాబాసాహెబ్ అంబేద్కర్ చెప్పినట్లు, అన్ని సమస్యలకు పరిష్కారం రాజ్యధికారమే ఎందుకంటే 'రాజకీయ అధికారం అతి ముఖ్యమైన తాళం చెవి". అవును అది ఒక ముఖ్యమైన తాళంచెవి, దానితో నువ్వు ప్రగతికి సంబంధించిన అన్ని తలుపులను తెరవగలవు. అన్నారు. అందుకే మాన్య శ్రీ కాన్షీరాం గారు, ముందుగా %ళి%బామ్సేష%రి% వెనుకబడిన మరియు అల్పసంఖ్యాకా వర్గాల ఉద్యోగుల సమాఖ్య ను ఏర్పాటు చేసి, రాజకీయ అధికారం ప్రాముఖ్యతను తెలిపి, తరువాత బి. ఎస్.పి పార్టీ ని స్థాపించి, 600 కులాలను ఒక్కటిగా ఏకం చెయ్యడంవల్లే భారతదేశంలో నాలుగవ అతిపెద్ద పార్టీగా ఆవిర్భవించి యు.పిలో ఆధికారం లోకి వచ్చిన విషయం అందరికి తెలిసినదే. యు.పి లో లాగానే బీసీల మెదళ్లలో యుద్ధం మొదలై తెలంగాణలో ఉన్న బీసీ కులాలు 75 సంవత్సరాల స్వాతంత్రం తర్వాత కూడా బానిసలుగా, పార్టీల జెండాలు మోసే కార్యకర్తలుగా, వారికి ఓటు వేసే యంత్రం లాగా ఉండాలా అని బిసి సంఘాలు, మేధావులు ఏకం అవుతున్నారు. దీర్ఘకాలిక ఉద్యమాలద్వారా ఏర్పడ్డ తెలంగాణలో మొదట ఉద్యమ ఆకాంక్షలకు భిన్నంగా నడిచే ప్రభుత్వమే వచ్చినప్పటికీ కుటుంబ పాలన, మరియు అవినీతి, నియంతృత్వ పాలనా తో, బీసీ కులాలను అధికారానికి, అభివృద్ధికి దూరంగా ఉంచి, బీసీలను ఆర్థికంగా రాజకీయంగా అణగ దొక్కడానికి, ఈ.డబ్ల్యు. ఎస్ రిజర్వేషన్లను తెచ్చారు అని దీనిపల్ల బీసీలకు దాదాపు 60 లక్షలమంది నిరుద్యోగులకు శాపంగా మారింది అని కేవలం 3 శాతం ఉన్న ఓసీ కులాలకు 10 శాతం, 65 శాతం ఉన్న బీసీలకు 29 శాతం రిజర్వేషన్లు ఇవ్వడం ఎంతవరకు న్యాయం అని ప్రశ్నిస్తూ, మేము ఎంతో మాకు అంత వాటా కావాలి అని డిమాండ్ చేస్తున్నారు.

కనుక బీసీల సమస్య పరిష్కారం బీసీల చేతుల్లోనే ఉంది అని రెడ్డి, వెలమ ప్రభుత్వాలు 2014-2024 వరకు బడ్జెట్ రూపంలో 22 లక్షలకోట్లు ఖర్చు చేస్తే. 65 శాతం జనాభా ఉన్న బీసీలకు రాష్ట్ర ప్రభుత్వం తొమ్మిదకి వేలకోట్ల బడ్జెట్ కేటాయించింది అని మొత్తం బడ్జెట్లో 3 శాతం మాత్రమే కేటాయించడం మన వర్గాలను అవమానించి, అన్యాయం చేయడమే అని అంటున్నారు. సమగ్ర కుటుంబ సర్వే ప్రకారం తెలంగాణ జనాభా 3.63 కోట్లు, అసెంబ్లీ స్థానాల సంఖ్య 119. బీసీ 65 శాతం పైగా జనాలు ఉన్నప్పటికీ పది నుంచి 14 సీట్లు మాత్రమే లభిస్తున్నాయి అని, అంటే వారికి అదనంగా రావాల్సిం 43 సీట్లు అధిపత్య కులాలు స్వాహా చేస్తున్నారు అని తెలంగాణలో ఇప్పటికి జరిగిన ఎన్నికల్లో రెడ్డి మరియు వెలమలు' జనాభా కంటే 39 నుండి 40 మంది సభ్యులు ఎన్నిక అవుతున్నారని, బిసి కులాలల్లో ముదిరాజ్, యాదవ మరియు 6 నుండి సీట్లు భారీగా కోల్పోతున్నారు అని, తెలంగాణలో ఉన్న 119 అసెంబ్లీ సీట్లలో 17 లోక్సభసీట్లలో బీసీలు సగం, బీసీలకు సగం సీట్లు కేటాయిస్తే 60 అసెంబ్లీ సీట్లు ఎనిమిది లోక్ సభ సీట్లు రావాలి అని బీసీలు విద్యకు, విజ్ఞానానికి, ఆస్తి కి అధికారాని దూరం చేసిన పాలక పార్టీలను, రాష్ట్రంలో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల లో బీసీలు గ్రామ గ్రామాన జే.ఏ.సి.లు గా ఏర్పడి, అన్ని జనరల్ స్థానాల్లో పోటీ చేసి, బీసీ అభ్యర్థులను గెలిపించి సంఘటితశక్తితో అధికారాన్ని సంపాదించాలని తెలంగాణా లో ఉన్న 134 బిసి కులాలు చేస్తున్న రాజకీయ అధికార యుద్ధానికి కాలమే సమాదానం చెప్పాలి.



డాక్టర్ తాళ్ళపెల్లి సంజీవ్
అసిస్టెంట్ ప్రొఫెసర్, కాకతీయ
యూనివర్సిటీ వరంగల్.
9701843998.

# బ్యాంకు వద్ద యువకులను నిలదీసిన మహిళలు

- దొంగ సంతకాల పేరుతో లక్షల రూపాయల ఎస్ఎస్‌జి గ్రూపు డబ్బులు స్వాహా..
- అరగంట పాటు హైడ్రామా..
- గొడవను నిలువరించలేకపోయిన ఒక కానిస్టేబుల్



కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా బ్యూరో ఫిబ్రవరి 20 (జనం సాక్షి) : స్వయం సహాయక గ్రూపు సభ్యుల డబ్బులను గ్రూప్ ఆర్గనైజర్ మమత కాజేశారని ఆగ్రహం వ్యక్తం చేస్తూ సదరు మహిళ ఆర్గనైజర్ తమ్ముడు, మరో వ్యక్తిని గ్రూప్ సభ్యులు నిర్బంధించారు. కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్ పట్టణంలోని ఎల్లా గౌడ్ తోటలో గల తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఎదుట గురువారం సాయంత్రం ఈ ఘటన చోటుచేసుకుంది. గత రెండు సంవత్సరాల క్రితం సంబంధిత గ్రూప్ ఆర్గనైజర్ మమత ఈ గ్రూపులోని సభ్యుల పేర్ల మీద లక్షల రూపాయలు స్వాహా చేసినట్లు వారు ఆరోపిస్తూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతకు ముందు గ్రూప్ ఆర్గనైజర్ తమ్ముడు ,మరో వ్యక్తి రెబ్బెన మండల కేంద్రం నుంచి.ఇక్కడికి రావడంతో గ్రూపుల మహిళ సభ్యులు వారి మోటార్ సైకిల్ యొక్క తాళం చెవిని తీసుకున్నారు. డబ్బులు చెల్లించాలని , తమను మోసం చేశారని మండిపడ్డారు. ఈ సందర్భంగా విషయం తెలుసుకున్న పోలీసులు రవిచంద్ర అనే కానిస్టేబుల్ను అక్కడికి పంపించారు. కానీ ఒక్క కానిస్టేబుల్ రావడంతో వీరి గొడవను ఆపడంలో, వారిని సముదాయించడంలో ఇబ్బంది పడ్డారు. అనంతరం పోలీస్ వాహనం రావడంతో పోలీసులు ఇరు వర్గాల వారిని సముదాయించి పంపించి వేశారు. ఈ గొడవ ఇరు వర్గాల మధ్య దాడికి, ఘర్షణకు దారి తీసింది. రోడ్డుపైన వచ్చిపోయే వారుఈ గొడవను సినిమా స్టైల్ లో తిలకించారు.

# మరో అవకాశం జారవిడవొద్దు

- గ్రూపు విభేదాలతో ఎంపీ ఎన్నికల్లో ఓడిపోయాం..!
- ఎమ్మెల్సీగా నరేందర్ రెడ్డిని గెలిపించండి
- ఇద్దరం కలిసి జిల్లాను అభివృద్ధి చేస్తాం
- జిల్లా ఇంచార్జ్ మంత్రి సీతక్క




కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా బ్యూరో ఫిబ్రవరి 20 (జనం సాక్షి) : గత పార్లమెంట్ సాధారణ ఎన్నికల్లో గ్రూపు విభేదాలతో కాంగ్రెస్ పార్టీ ఓడిపోయిందని, తిరిగి జార విడుచుకోవద్దని, ఎట్టి పరిస్థితుల్లో పట్టభద్ర ఎమ్మెల్సీగా వి. నరేందర్ రెడ్డిని గెలిపించుకోవాలని కాంగ్రెస్ శ్రేణులకు పంచాయతీరాజ్ , గ్రామీణ అభివృద్ధి , గిరిజన సంక్షేమ శాఖ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్చార్జ్ మంత్రి సీతక్క అన్నారు. గురువారం కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్ పట్టణంలోని వినయ్ గార్డెన్ ఫంక్షన్ హాల్ లో ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా జరిగిన ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బిజెపి, బిఆర్ఎస్ రెండు పార్టీలు ఒక్కటై కాంగ్రెస్ పార్టీని ఓడించేందుకు లోపాయి కారి ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయని విమర్శించారు. ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ రెడ్డిని గెలిపిస్తే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతోజిల్లా అభివృద్ధికి కృషి చేస్తామని అన్నారు. అంతకుముందు ఎమ్మెల్సీ అభ్యర్థి వి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు ప్రత్యేకంగా యూనివర్సిటీ ఏర్పాటుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే ఉద్యోగస్తుల, పాఠశాలల , ఇతర సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని అన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండి విట్టల్ మాట్లాడుతూ గతంలో బిఆర్ఎస్ పార్టీ వదిలిపెట్టిన ప్రణహిత చేవెళ్ల ప్రాజెక్టు పూర్తి చేస్తామని తెలిపారు. అలాగే సిర్పూర్ పేపర్ మిల్లు స్థానికులకు ఉద్యోగాలు దక్కేలా చూస్తామని హామీ ఇచ్చారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే గణేష్ మాట్లాడుతూ ఎన్నికల్లో ఎమ్మెల్సీ గెలుపు ఖాయం అన్నారు. ముఖ్యంగా మూడు అంశాలు ఆధారంగా ఒకటి సమర్థవంతమైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలన, రెండోది అన్ని రకాల సమర్ధుడైన విద్య సంస్థల అధిపతి, మూడోది బలమైన కాంగ్రెస్ బలగం వల్ల గెలుపు ఖాయం అన్నారు. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడమ బొజ్జు మాట్లాడుతూ ఎన్నికల్లో జిల్లాలో 6 వేల పైచిలుకు పట్టభద్ర ఓటర్లు ఉన్నారని, వీరిని కాంగ్రెస్ పార్టీ ఓటు బ్యాంకుగా మార్చుకునేందుకు గ్రీన్, ఎల్లో, రెడ్ జోన్లుగా గుర్తించి గెలుపుకు కృషి చేయాలని పార్టీ శ్రేణులకు సూచించారు. ఈ ఆత్మీయ సమ్మేళనంలో టి పి సి సి కార్యదర్శి రవళి రెడ్డి, డిసిసి అధ్యక్షులు విశ్వప్రసాదరావు, మాజీ ఎంపీ లు సోయం బాబురావు, వేణుగోపాల చారి, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, ఆసిఫాబాద్ కాంగ్రెస్ ఇంచార్జ్ శ్యాం నాయక్, కాంగ్రెస్ పార్టీ నాయకురాలు ఆత్రం సుగుణ , అజ్మీర ఆత్మరాం నాయక్, హర్షద్ హుస్సేన్, మాజీ జెడ్పి చైర్మన్ గణపతి, కో డప విశ్వేశ్వరరావు, పొన్న రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# బీవీఆర్ఐటీలో జాతీయ ఈ బాహా సే ఇండియా 2025

- పోటీలు అట్టహాసంగా ప్రారంభం





నర్సాపూర్, ఫిబ్రవరి 20 (జనంసాక్షి) : నర్సాపూర్ నందు గల బివి రాజు సాంకేతిక విద్య సంస్థ (బీవీఆర్ఐటీ)లో జాతీయ ఈ బాహా సే ఇండియా 2025 పోటీలు అట్టహాసంగా ప్రారంభమైనాయి. దక్షిణ భారత దేశంలో మొట్ట మొదటి సారి 2024 లో బివి రాజు సాంకేతిక విద్య సంస్థ నిర్వహించగా మంచి ఉత్తమ ఫలితాలు సాధించినందుకు మరల 2025 రెండవ సారి నిర్వహించే అవకాశం బివి రాజు ఇన్స్టిట్యూట్ అఫ్ టెక్నాలజీకి దక్కింది.

ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమం పాల్గొనే వారందరికీ గొప్ప అవకాశాలను, ఉజ్వల భవిష్యత్తును తీసుకువస్తుందని బలమైన నమ్మకాన్ని వ్యక్తం చేసిన కెవి విష్ణు రాజు, చైర్మన్, శ్రీ ఆదిత్య విస్సం, సెక్రటరీ ఎస్వీఈఎస్ నుండి ఈవెంట్ శు భాకాంక్షలు అందుకుంది. ఎస్వీఈఎస్ వైస్ చైర్మెన్ రవి చంద్రన్ రాజ్‌గోపాల్ 20 రాష్ట్రాల నుండి బృందాలను స్వాగతించారు. వారి అభిరుచిని జీవించడానికి, నేర్చుకోవడానికి మరియు భవిష్యత్తు కోసం ప్రేరణ పొందడానికి ఇదే సరైన వేదిక అని అన్నారు. ఎస్ఏఈ ఛైర్మన్ బాల్‌రాజ్ సుబ్రమణ్యం బజాని పరిచయం చేసారు. బాజా ఎస్ఏఈఇండియా సలహాదారు డాక్టర్ కేసీ వోరా గత 10 సంవత్సరాలలో ఈ బాజా వృద్ధిని పంచుకున్నారు. ఈ ఈవెంట్‌కు మద్దతు ఇస్తున్న టాటా మోటార్స్‌తో కలిసి స్టార్ట్-అప్, ఆవిష్కరణల గురించి పంచుకున్నారు.

శ్రీ మయాంక్ డింగ్రా, అసిస్టెంట్ ఎడిటర్ ఆటోకార్ ప్రొఫెషనల్, ఆటోమొబైల్ పరిశ్రమలో తన ప్రయాణంతో యువకులకు స్ఫూర్తినిచ్చారు. ఈ ఈవెంట్ నుండి వచ్చిన అనుభవం వారిని చాలా దూరం తీసుకువెళుతుంది.

నిజామాబాద్ బీపీసీఎల్ టెరిటరీ మేనేజర్ శ్రావణ్ కుమార్ బాజా ఎస్ఏఈ ఇండియాతో 18 సంవత్సరాల అనుబంధం గురించి, కొత్త కార్యక్రమాలలో వారి భాగస్వామ్యం గురించి మాట్లాడారు. అతను ఈవీ విప్లవం, ఛార్జింగ్ టెక్నాలజీలపై వెలుగునిచ్చాడు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన శ్రీమతి సిమోనా అడెలీనా, రెనాల్ట్ గ్రూప్ హెచ్ఆర్ వైస్ ప్రెసిడెంట్ ఆసియా, స్థానికంగా మరియు ప్రపంచవ్యాప్తంగా డిజిటల్ ఇంజినీరింగ్‌ను ప్రోత్సహించడంలో తమ కార్యక్రమాల గురించి మాట్లాడారు. ఇంటర్న్‌షిప్ మరియు ఉపాధి అవకాశాలను అందించడంలో వైవిధ్యం, చేరిక ప్రాముఖ్యతను ఆమె నొక్కి చెప్పారు.

5 రోజుల పాటు జరిగే ఈ మెగా ఈవెంట్‌లో ఎన్ఐటీ, ఐఐటీఎస్ విశ్వవిద్యాలయాలు, కళాశాలల నుండి వచ్చే భారతదేశం నలుమూలల నుండి 15 రాష్ట్రాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న 80 కంటే ఎక్కువ బృందాలు పాల్గొంటున్నాయి. ఈ ఈవెంట్ అపారమైన సాంకేతికతను తెస్తుంది. ఆచరణాత్మకంగా నేర్చుకోవడం, పరిశ్రమ, హెచ్ఆర్ బృందాలకు బహిర్గతం చేయడం, ఆటోమొబైల్ ఈవీ దిగ్గజాలతో ఉపాధి కోసం అవకాశాన్ని అందిస్తుంది.

కో కన్వీనర్ ప్రణవ్ ఖటేకర్ మాట్లాడుతూ ఏ-ఈ బాహా ఉపయోగాలు, వాటి వలన విద్యార్థులు ఎంతో ఉన్నత స్థాయికి చేరేందుగు తోడ్పడుతుందని చెప్పారు.

ఈ బాజా ఎస్ఏఈ ఇండియా జాయింట్ కన్వీనర్ మనోనీత్ సింగ్ మాట్లాడుతూ విష్ణు మోటార్ స్పోర్ట్స్ వలన శ్రీ విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ నందు మంచి విద్య ఉద్యోగ అవకాశాలు కల్పిస్తూ విద్యార్థులు సర్వతోముఖాభివృధికి శ్రీ విష్ణును ఏడువషనల్ సొసైటీ ఈబాహా ద్వారా సహాయం చేస్తుందని చెప్పారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో డాక్టర్ లక్ష్మీప్రసాద్ డైరెక్టర్ బివిఆర్ఐటిఎన్, డాక్టర్ సంజయ్ దూబె ప్రిన్సిపాల్ బివిఆర్ఐఎన్, ఎస్‌విఇఎస్ గ్రూప్ ప్రిన్సిపాల్స్, డిపార్ట్‌మెంట్ హెడ్‌లు, డీన్‌లు, ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు మీడియా సిబ్బంది, జనరల్ మేనేజర్ బాపి రాజు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సురేష్ శ్రీ కాంత రావు గారు, డాక్టర్ రాయుడు మొదలైన అన్ని విభాగాలు పాల్గొన్నారు. వివిధ రాష్ట్రాల నుండి 80 మంది టీమ్స్ పాల్గొంటున్నాయి.

**ఆ టీంలు ఇవే..**

తెలంగాణ-2, ఆంధ్ర ప్రదేశ్ -2, మహారాష్ట్ర -23, తమిళనాడు-17, కేరళ-7, ఢిల్లీ-1, ఒడిశా-2, మధ్యప్రదేశ్ -5, ఉత్తరప్రదేశ్ -3, గుజరాత్-4, కర్ణాటక-4, ఉత్తరాఖండ్ -1, త్రిపుర-1, కర్ణాటక-4, ఛత్తీస్‌గఢ్ -1, చండీగఢ్ -1, జార్ఖండ్ -1, జమ్మూ కాశ్మీర్ -1, హరియాణా-1 పాల్గొంటున్నాయి .

# మార్కెటింగ్ జిఎం సేవలు మరువలేనివి

- టీబీజీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్ రెడ్డి



నస్పూర్ ఫిబ్రవరి 20, (జనంసాక్షి): సింగరేణిలో ఉత్పత్తి ఉత్పాదకతకు,ఉద్యోగుల రక్షణకు మార్కెటింగ్ జిఎం రవి ప్రసాద్ చేసిన సేవలు మరువలేనివని టీబీజీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్ రెడ్డి కొనియాడారు. గురువారం శ్రీరాంపూర్ ఏరియాలో టీబీజీకేఎస్ నాయకులు ఈనెల పదవి విరమణ పొందుతున్న మార్కెటింగ్ జిఎం రవిప్రసాద్ ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి పదవి విరమణ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కేతిరెడ్డి సురేందర్ రెడ్డి మాట్లాడారు. సుదీర్ఘకాలంగా సింగరేణిలో వివిధ హోదాలలో పనిచేసిన అయన ఉద్యోగుల మన్ననలు పొందారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు పెట్టం లక్ష్మణ్, డిప్యూటీ జనరల్ సెక్రటరీ బండి రమేష్,కేంద్ర చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ పొగాకు రమేష్,ఆర్గనైజింగ్ సెక్రటరీ అన్వేష్ రెడ్డి,ఉత్తేజ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మక్తల్ ఎమ్మెల్యేపై సీఎం రేవంత్‌కు ఫిర్యాదు

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 20 (జనంసాక్షి) : మక్తల్ కాంగ్రెస్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరిపై ఆ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తిరగబడ్డారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అవినీతి చేశాడంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మక్తల్ కాంగ్రెస్ కార్యకర్తలు బహిరంగంగా లేఖ రాశారు. ఎన్నికలకు ముందు డబ్బులు లేవని అప్పులు తీసుకున్న వాకిటి శ్రీహరి ఇప్పుడు తన ఇంటి పక్కనున్న మరో ఇల్లును కోటి 50 లక్షలు పెట్టి ఎలా కొన్నాడు? అని ప్రశ్నించారు. అలాగే లహరి కన్వేషన్ పక్కన 100 గజాల స్థలం, హైదరాబాద్‌లో 5 ప్లాట్లు, భూత్పూర్ దగ్గర 10 ఎకరాల భూమి, కుటుంబసభ్యులు తిరగడానికి 5 కార్లు ఎలా వచ్చాయి? అని నిలదీశారు. వైన్ షాపులో పని చేసే నాగరాజు అనే వ్యక్తి వాకిటి శ్రీహరి గెలిచాక కోట్ల రూపాయలకు ఎలా పడగెత్తినాడు? వాకిటి శ్రీహరి అనుచరులు కల్లు మామ్ల చేసుకునే గౌడ కులస్తులతో మామూళ్లు ఎందుకు వసూలు చేస్తున్నారు? వాకిటి శ్రీహరికి మంత్రి పదవి ఇస్తే మక్తల్ మొత్తం నాశనం అవుద్ది అంటూ సీఎం రేవంత్ రెడ్డితో పాటు కాంగ్రెస్ పార్టీలోని పలువురు పెద్దలకు మక్తల్ కాంగ్రెస్ కార్యకర్తలు లేఖలు రాశారు. ప్రస్తుతం ఈ లేఖ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

# కూలీ పనులు పరిశీలించి... పలుగు పార పట్టిన కలెక్టర్

- భూగర్భ జలాలు భవిష్యత్తు తరాలకు అందించాలని పిలుపు



హైదరాబాద్, ఫిబ్రవరి 20 (జనంసాక్షి) : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ గురువారం ఉదయం టేకులపల్లి మండలంలోని సులానగర్, చింతలంక, కోయగూడెం, చంద్రు తండా, కొత్త తండా గ్రామ పంచాయతీలలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధి కూలీలతో కలిసి పలుగు పారా పట్టి పారం పాండు పనుల్లో పాల్గొన్నారు. స్వయంగా మట్టిని తట్టలోకి ఎత్తి దానిని మోశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్తు తరాలకి భూగర్భ జలాలు ఉండాలంటే ప్రతి రైతు వ్యవసాయ భూములలో పారం పాండు నిర్మాణం చేపట్టాలని సూచించారు. ఉపాధి కూలీల సాధకబాధకలు తెలుసుకున్నారు. పలు గ్రామాలలో విద్యుత్ సమస్య, పోడు భూముల్లో విద్యుత్ సమస్యల గురించి కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై సంబంధిత అధికారులకు తగిన సూచనలు చేశారు. ప్రస్తుతం రైతులకు మిర్చి వాణిజ్య పంటలే కాకుండా తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆదాయం వచ్చే మునగ సాగు, వెదురు సాగుపై అవగాహన కల్పించారు. పలు గ్రామాలలో మునగ సాగు క్షేత్రాన్ని పరిశీలించారు. మునగ సాగుపై అధిక లాభం సాధించవచ్చని సూచించారు. కలెక్టర్‌తోపాటు డీఎల్‌పీఓ రమణ, మిషన్ భగీరథ డీఈ పద్మావతి, విద్యుత్ శాఖ డీఈ రంగస్వామి, ఎంపీడీవో రవీందర్ రావు, ఎంపీ ఓ గణేష్ గాంధీ, ఏపీవో శ్రీనివాస్, విద్యుత్ శాఖ ఏఈ బుజ్జి కన్నయ్య, ఆయా పంచాయతీల కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది తదితరులు ఉన్నారు.

# హత్యా రాజకీయాలు కాంగ్రెస్‌కే అలవాటు

- మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి మతి భ్రమించింది
- బీఆర్ఎస్ హత్యా రాజకీయాలను ప్రోత్సహించదు : గండ్రా వెంకటరమణారెడ్డి




హైదరాబాద్, ఫిబ్రవరి 20 (జనంసాక్షి) : హత్యా రాజకీయాలు కాంగ్రెస్ పార్టీకే అలవాటు.. బీఆర్ఎస్ పార్టీ హత్యా రాజకీయాలను ప్రోత్సహించదు అని మాజీ ఎమ్మెల్యే గండ్రా వెంకటరమణారెడ్డి స్పష్టం చేశారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మతి భ్రమించి మాట్లాడుతున్నారని మండిపడ్డారు. తెలంగాణ భవన్‌లో గండ్రా వెంకటరమణారెడ్డి మీడియాతో మాట్లాడారు. భూపాలపల్లిలో రాజలింగ మూర్తి హత్యను బీఆర్ఎస్ మాజీ శాసన సభ్యుడిగా తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. హత్య తర్వాత కాంగ్రెస్ పార్టీ వాస్తవాలు తెలుసుకోకుండా మాట్లాడుతోందని అన్నారు. ఈ హత్యను బీఆర్ఎస్ పార్టీ, కేసీఆర్, హరీశ్‌రావుకు ఆపాదించాలని కాంగ్రెస్ శతవిధాల ప్రయత్నించడం దుర్మార్గమని పేర్కొన్నారు. స్థానిక భూవివాదం నేపథ్యంలో ఈ హత్య జరిగిందని ఎఫ్ఐఆర్ కూడా నమోదైందని వివరించారు. కొందరి ఒత్తిడితో రాజలింగ మూర్తి భార్య నాపై ఆరోపణలు చేస్తున్నారని అని వెంకట రమణారెడ్డి తెలిపారు. ఈ హత్యపై సీబీఐ, సీఐడీ విచారణను కాంగ్రెస్ నేతలు కోరుతున్నామన్నారు. ఎలాంటి విచారణ చేసుకున్నా మాకు అభ్యంతరం లేదని తేల్చిచెప్పారు. మేడిగడ్డపై రాజలింగమూర్తి కోర్టులో కేసు వేశారని.. దాన్ని న్యాయపరంగా ఎదుర్కొంటున్నామని తెలిపారు. మృతుడిపై భూ వివాదాల ఆరోపణలు ఉన్నాయి.. రౌడీ షీట్ కూడా ఉందన్నారు. బీఆర్ఎస్‌పై, నాపై ఆరోపణలు చేయడం ద్వారా విచారణను ప్రభావితం చేయడానికి కాంగ్రెస్ నేతలు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. హత్యలో అరెస్టయిన వ్యక్తుల పేర్లతో రాజలింగ మూర్తి పోలీసులకు ఫిర్యాదు కూడా చేశారన్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట రెడ్డికి మతి భ్రమించిందని తెలిపారు. బట్ట గాల్చి మీద వేసే ప్రయత్నం చేస్తున్నారని.. అని మాజీ ఎమ్మెల్యే ధ్వజమెత్తారు. హత్యా రాజకీయాలు కాంగ్రెస్ పార్టీకి అలవాటు.. బీఆర్ఎస్ హత్యారాజకీయాలను ప్రోత్సహించదు. నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశంపై కూడా కోమటిరెడ్డి నల్లగొండ మున్సిపల్ చైర్మన్‌ను హత్య చేశారని ఆరోపించారు. వేముల వీరేశం ఇప్పుడు కాంగ్రెస్ పార్టీలోనే ఉన్నారు. కోమటిరెడ్డి పూటకో మాట మాట్లాడతారు.. ఆయన నోటికి మొక్కాలి. పోలీసులు నిస్పాక్షిక విచారణ జరిపి దోషులకు కఠిన శిక్షలు పడేలా చేయాలని ఆయన కోరారు.

# హైడ్రాను మరింత పటిష్టం చేయాలి

- భూ కబ్జాదారుల ఆటకట్టిస్తున్న హైడ్రా
- విలేకరుల సమావేశంలో శివారు ప్రాంత బాధితులు


హైదరాబాద్, ఫిబ్రవరి20 (జనంసాక్షి) : హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లోని చెరువులు, కుంటలు, ప్రభుత్వ స్థలాల పరిరక్షణ కోసం ఏర్పాటు చేసిన హైడ్రాను మరింత పటిష్టం చేయాలని పలువురు భూ కబ్జాదారుల బాధితులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఎన్నో సంవత్సరాలుగా కబ్జాదారుల నుంచి ఎదుర్కొంటున్న సమస్యలకు హైడ్రా పరిష్కారం చూపుతోందన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో నగరం, శివారు ప్రాంతాలకు చెందిన బాధితులు నాగేశ్వరరావు, సాయికుమార్, చంద్రశేఖర్, తనూజ, శ్రీనాథ్, గాయత్రి, నవీన్ కుమార్ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం హైడ్రా వంటి మంచి వ్యవస్థను ఏర్పాటు చేసిందని, కబ్జాదారుల బారి నుంచి తమను రక్షిస్తుందని చెప్పారు. కొంత మంది కబ్జాదారులు హైడ్రాపై ఉద్దేశపూర్వకంగా తప్పుడు ప్రచారం చేయిస్తున్నారని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా హైడ్రా ప్రభుత్వ స్థలాల పరిరక్షణకు ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతుందని చెప్పారు. పార్కులు, చెరువులు, ప్రభుత్వ స్థలాను కబ్జా చేస్తున్న వారిపై ఫిర్యాదు చేసిన బాధితులపై కక్షపూరిత కేసులు నమోదు చేస్తున్నారని, సీఎం స్పందించి బాధితులకు అండగా నిలవాలని కోరారు. ఈ మేరకు తమకు హైడ్రా చేసిన మేలును, కబ్జాదారులు వేధిస్తున్న వివరాలను పలువురు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో దివ్యనగర్, కోహెడ, అమీన్‌పూర్, నాగిరెడ్డి చెరువు, ముత్తంగి, బడంగ్ పేట్ తదితర ప్రాంతాల్లో హైడ్రా వల్ల లబ్ధిపొందిన వారు పాల్గొన్నారు.

# విద్యుద్ఘాతంతో ముగ్గురి మృతి

నిజామాబాద్, ఫిబ్రవరి20 (జనంసాక్షి) : జిల్లాలోని బోధన్ మండలం పెగడపల్లి గ్రామ శివారులో కరెంట్ షాక్‌తో ముగ్గురు మృతి చెందడంతో గ్రామంలో విషాదం నెలకొంది. పందుల వేటకు వెళ్లగా ప్రమాదవశాత్తు కరెంట్ షాక్ తగిలి మృతి చెంది ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. మృతులు రెంజల్ మండలం సాటాపూర్ గ్రామానికి చెందిన ఒకే కుటుంబానికి చెందిన ఓర్సు గంగారం, బాలమణి, కిషన్ గా గుర్తించారు. ఈ ఘటనపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# విహారయాత్ర విషాదాంతం

- ఈత కోసం తుంగభద్ర నదిలో దిగిన డాక్టర్ మృతి



హైదరాబాద్, ఫిబ్రవరి20 (జనంసాక్షి) : హైదరాబాద్‌కు చెందిన ఓ లేడీ డాక్టర్‌కు ఈతే ఆమె పాలిట మృత్యువుగా మారింది. కర్ణాటక రాష్ట్రంలోని హంపిలో ఈ ఘటన చోటుచేసుకుంది. హంపి వద్ద హైదరాబాద్‌కు చెందిన లేడీ డాక్టర్ మృతి తీవ్ర కలకలం రేపుతోంది. విహారయాత్రకు వెళ్లిన అనన్యరావు ఈత కోసం తుంగభద్ర నదిలో దూకారు. అయితే కాసేపటికే నీటి ప్రవాహంలో ఆమె కొట్టుకుపోయారు. రెండు రోజుల క్రితం స్నేహితులతో కలిసి ట్రిప్‌కు వెళ్లారు డాక్టర్ అనన్య రావు. హంపిలోని ఓ రిసార్ట్‌లో స్నేహితులతో కలిసి స్టే చేశారు. బుధవారం మధ్యాహ్నం 2 గంటల తర్వాత తుంగభద్ర నదిని చూసేందుకు వెళ్లిన సమయంలో ఆ నదిలో ఈతకొట్టాలని వారు భావించారు. ఈ క్రమంలో డాక్టర్ అనన్య రావు 25 అడుగుల ఎత్తు నుంచి కిందకు దూకారు. కాసేపు స్విమ్మింగ్ చేశారు. అయితే కొద్దిసేపటికే మరోవైపు నుంచి అలలు రావడంతో నీటి ప్రవాహంలో డాక్టర్ కొట్టుకుపోయారు. ఈ విషయాన్ని గుర్తించిన స్నేహితులు ఆమెను కాపాడేందుకు తీవ్రంగా ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. తుంగభద్రలో అనన్యరావు దూకుతున్న దృశ్యాలను స్నేహితులు వీడియో తీశారు. రెండు నిమిషాల పాటు స్విమ్మింగ్ చేయగా.. ఆ సమయంలో వ్యతిరేక దిశలో అలలు రావడంతోనే లేడీ డాక్టర్ కొట్టుకుపోయినట్లు తెలుస్తోంది. స్థానికంగా ఉన్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు స్నేహితులు. వెంటనే వారు అక్కడకు చేరుకుని దాదాపు మూడు గంటల పాటు తుంగభద్ర నదిలో గాలింపు చర్యలు చేపట్టి ఎట్టకేలకు అనన్యరావు మృతదేహాన్ని బయటకు తీశారు. హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ డాక్టర్ కుమార్తె అనన్యరావు. ఆమె కూడా డాక్టర్ చదవు పూర్తి చేశారు. ఈ నేపథ్యంలో స్నేహితులతో కలిసి విహారయత్రకు వెళ్లిన అనన్యరావు ప్రాణాలు కోల్పోయింది. కుమార్తె మృతి సమాచారం తెలుసుకున్న అనన్యరావు తల్లిదండ్రులు శోకసంద్రంలో మునిగిపోయారు.

# గంజాయి కోసం కొల్లాపూర్‌లో ప్రత్యేక తనిఖీలు

- రెండు రోజులపాటు పది టీములతో జల్లెడ పట్టిన అధికారులు, సిబ్బంది
- పోలీసుల సహకారంతో జాగిలాలతో ప్రత్యేక తనిఖీలు



**కొల్లాపూర్, నాగర్‌కర్నూల్ జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 20 (జనంసాక్షి) :** ఎక్సైజ్ శాఖమంత్రి జూపల్లి కృష్ణారావు సొంత నియోజకవర్గమైన కొల్లాపూర్ లో ఎక్సైజ్ శాఖతోపాటు పోలీసులు కలిసి 10 టీములుగా రెండు రోజులపాటు ప్రత్యేక తనిఖీలు చేపట్టారు.నాగర్ కర్నూల్ జిల్లాతో పాటు కొల్లాపూర్ ఇతర ప్రాంతాల్లో గంజాయి వినియోగం జరుగుతుందని సమాచారం మేరకు ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఎక్సైజ్ శాఖను తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు.తొలి రోజున పెట్ల వెల్లి మండలం పెద్దకొత్తపల్లి మండలంలోని నాలుగు తండాల్లో మారేడు మాందిన్న, యాపట్ల, చంద్ర బండ లింగంపల్లి,కొల్లాపూర్ ప్రాంతాల్లో చేపట్టినటువంటి తనిఖీల్లో కొద్దిపాటి ఐడి లిక్కర్, రెండు కేసులు నమోదు చేశారు. గురువారం మారేడు తండా యాపట్ల చంద్రబండ జొన్నల బొగడ ప్రాంతాల్లో చేపట్టిన తనిఖీల్లో 150 కేజీల బెల్లం 20 కేజీల పట్టిక ఇద్దరు వ్యక్తులు పై కేసు నమోదు చేయడం జరిగింది.నాగర్ కర్నూల్ జిల్లా ఎస్పీ గైక్వాడ్ వైభవ్ చొరవతో పోలీసులు, ఎక్సైజ్ పోలీసులు కలిసి కొల్లాపూర్ మున్సిపాలిటీలో డాగ్ స్క్వేర్స్‌తో స్పెషల్‌గా కాటన్ సెర్చ్ నిర్వహించారు.కొల్లాపూర్ నియోజకవర్గంలోని ఏడు మండలాలు కొల్లాపూర్ పెద్ద కొత్తపల్లి, పెంట్లవెల్లి మండలాలతోపాటు వనపర్తి జిల్లాలో ఉన్నటువంటి వీపనగండ్ల చిన్నంబావి పాన్గల్ మండలాల్లో కూడా ప్రత్యేక తనిఖీలు చేపట్టారు.

### గంజాయి మొక్కల కోసం అటవీ ప్రాంతంలో తనిఖీలు

అటవీ ప్రాంతంలో గంజాయి మొక్కలు పెంచుతున్నారని అనుమానంతో ఫారెస్ట్ పోలీస్ ఎక్సైజ్లు కలిసి కొల్లాపూర్ నియోజకవర్గంలోని అమరగిరి అటవీ ప్రాంతంలో కూడా తనిఖీలు చేపట్టారు. అడవిలోని అనుమానిత ప్రాంతాలన్నిటిని తనిఖీలు నిర్వహించిన ఎక్కడ కూడా గంజాయి మొక్కలు లభించలేదు. హైదరాబాదు నుంచి వచ్చినటువంటి నాలుగు ఎస్ టి ఎఫ్ టీములతోపాటు డిటిఎఫ్ మహబూబ్ నగర్ డిటిఎఫ్ నాగర్ కర్నూల్ ఎన్ఫోర్స్మెంట్ మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, కొల్లాపూర్ ఎస్‌హెచ్‌ఓలతో ఎక్సైజ్ పోలీస్‌లు దాడుల్లో పాల్గొన్నారు. ఈ దాడుల్లో ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ విజయభాస్కర్ రెడ్డి, అడిషనల్ ఎస్పీ భాస్కర్, డిఎస్పి తిరుపతి యాదవ్, ఎక్సైజ్ సూపర్ ఇండియన్స్ ఎస్టిఎఫ్ టీం లీడర్స్ అంజిరెడ్డి, ప్రదీప్ రావు, నాగర్ కర్నూల్ ఎక్సైజ్ సూపర్డెంట్ గాయత్రి,, కొల్లాపూర్ సిఐ మహేష్,ఏ ఈ ఎస్ సుధాకర్, ఎన్ఫోర్స్మెంట్ సీఐ వెంకటేశ్వర్ రెడ్డి, కొల్లాపూర్ సిఐ నాగిరెడ్డి, నాగర్ కర్నూల్ డి టి ఎఫ్ కళ్యాణ్, సిఐ ఆర్వి రాజ్యలక్ష్మి తో పాటు 60 మంది సిబ్బందితో కలిసి రెండు రోజులపాటు నిర్వహించిన దాడుల్లో పాల్గొన్నారు.

### నెలరోజుల పాటు జరిగిన స్పెషల్ డ్రైవ్

ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టర్ విపి కమలహాసన్ రెడ్డి చేపట్టినటువంటి ఐడి లిక్కర్ స్పెషల్ డ్రైవ్ లో భాగంగా నాగర్ కర్నూలు జిల్లాలో 21 కేసులు నమోదు చేసి 26 మందిని అరెస్ట్ చేశారు. 4500 లీటర్ల బెల్లం పానకాన్ని నేలపాలు చేశారు.118 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నారు. 24 వాహనాలను 9 సెల్ ఫోన్లను కూడా స్వాధీనం చేసుకున్నారు. ఈ ప్రత్యేకతనికిలవల్ల నాగర్ కర్నూలు జిల్లాలో తోపాటు కొల్లాపూర్ లో గంజాయి తో పాటు నాటు సారా తయారీ వినియోగం వికలాం పూర్తిస్థాయిలో తగ్గుముఖం పట్టినట్లు తనిఖీల అనంతరం వెల్లడించారు. రెండు రోజులపాటు ప్రత్యేకంగా నిర్వహించిన దాడుల పట్ల ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టర్ వివి కమలహాసన్ రెడ్డి జాయింట్ కమిషనర్ గురించి ప్రత్యేకంగా అభినందించారు.

# పశువుల మేతగా రైతు కష్టం



**ముస్తాబాద్, ఫిబ్రవరి 20 (జనంసాక్షి) :** యాసంగి వరి పంటకు సాగు నీరు అందక ఎండిపోతున్న దుస్థితి మండలంలోని సేవలల్ తండా గ్రామంలో నెలకొంది. గతంలో సంవత్సరానికి రెండు పంటలు పండించుకున్నాం. ఇప్పుడు కనీసం య సంగీ పంట కూడా పండలేక పోతుంది. ఎక్కువ మానేరు కెనాల్ కాల్వ మీద ఆధారపడి ఇక్కడ భూమిని నమ్ముకుని వ్యవసాయం చేసుకుంటే చివరికి గొర్రు మేకల పాలు పశువుల పాలు మేతగా రైతు కష్టం మిగిలిందని ఆవేదన చెందుతుంది. మరోవైపు కాల్వ ద్వారా మల్లన సాగర్, రంగనాయక సాగర్, ఎగువ మానేరు ,కాల్వ ద్వారా నీరు విడుదల చేస్తే ఇప్పుడున్నటువంటి పంటలను చేతికొచ్చే విధంగా రైతులు సర్వ ప్రయత్నాలు చేసుకొనడానికి సిద్ధంగా ఉన్నారు. ప్రభుత్వం వెంటనే నీటిని విడుదల చేస్తే పంటలు చేతికొస్తాయని అంటున్నారు.

# లోకాయుక్తకు పూర్తి నివేదిక సమర్పిస్తాం

- జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి



**వనపర్తి బ్యూరో, ఫిబ్రవరి 20 (జనంసాక్షి) :** జిల్లాలోని కొత్తకోట మండల పరిధిలోని రాయినిపేట రాయసముద్రం చెరువుకు సంబంధించి అన్ని రికార్డులు పరిశీలించిన తర్వాత లోకాయుక్తకు పూర్తి నివేదిక సమర్పిస్తామని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. కొత్తకోట మండల పరిధిలోని రాయినిపేట చెరువు నీటి వల్ల తమ భూములు మునుగుతున్నాయని, మునిగిన తమ భూములకు ప్రభుత్వ నష్టపరిహారం చెల్లించాలంటూ చెరువు ఆయకట్టు రైతులు ఇదివరకు లోకాయుక్తలో ఫిర్యాదు చేయడం జరిగింది. ఈ నేపథ్యంలో లోకయుక్త కు నివేదిక సమర్పించడం కొరకు జిల్లా కలెక్టర్ గురువారం నాడు అదనపు కలెక్టర్ రెవెన్యూ జి వెంకటేశ్వర్లు, ఇరిగేషన్ సూపరిండెంట్ ఇంజనీర్ శ్రీనివాస్, ఆర్డీవో సుబ్రహ్మణ్యంతో కలిసి చెరువు పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అక్కడికి వచ్చిన రాయిని పేట, వనపర్తి మండలంలోని కడుకుంట్ల గ్రామాల రైతులతో మాట్లాడి, పరిస్థితులను తెలుసుకున్నారు. చెరువు నీటి వల్ల మునుగుతున్న తమ భూముల సమస్య గురించి రైతులు కలెక్టర్‌కు విన్నవించారు. కలెక్టర్ మాట్లాడుతూ అన్ని రికార్డులు పరిశీలించిన అనంతరం లోకాయుక్తకు పూర్తి నివేదిక సమర్పించడం జరుగుతుందని తెలిపారు.ఇరిగేషన్ సూపరిండెంట్ ఇంజనీర్ శ్రీనివాస్, వనపర్తి తాసిల్దార్ రమేష్ రెడ్డి, కొత్తకోట తహసిల్దార్ శ్రీనివాసులు, ఇతర అధికారులు తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

# బాగా చదివి ఉన్నతస్థాయికి చేరుకోవాలి




**ఖమ్మం, ఫిబ్రవరి 20 (జనం సాక్షి) :** బాగా చదివి సమాజంలో గొప్ప స్థాయికి ఎదిగి, మరో నలుగురి ఎదుగుదలకు తోడ్పాటు అందించాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. గురువారం జిల్లా కలెక్టర్ స్థానిక శాంతినగర్ ఏ.ఎస్.ఆర్. ప్రభుత్వ జూనియర్ కళాశాల నందు 47 మంది ప్రభుత్వ విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు పోటీ పరీక్షల్లో మెరుగైన ఫలితాలు కోసం అవసరమైన శిక్షణ, పుస్తకాలు అందించేందుకు మలబార్ గోల్డ్ చారిటబుల్ సంస్థ వారు నగదు ప్రోత్సాహంగా 3 లక్షల 80 వేల రూపాయల చెక్కును జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ, తల్లిదండ్రులు చాలా కష్టపడి పిల్లలను ఉన్నత చదువులు చదివిస్తున్నారని, ఇందులో కొందరు ఆర్థికంగా స్థిరంగా ఉంటారని, కొందరు పేదరికం లో ఉంటారని, వారిని చూసి స్ఫూర్తి పొంది సమాజంలో అగ్రస్థాయికి చేరుకునేందుకు బాగా చదువుకోవాలని అన్నారు. మన పుట్టుక, కులం, మతం, ప్రాంతం, చుట్టూ పరిస్థితులు మన చేతిలో ఉండవని, అందుబాటులో ఉన్న విద్యను మనం వినియోగించుకుంటే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని అన్నారు. చదువు వల్ల సమాజంలో మనకు గౌరవం లభిస్తుందని, ముఖ్యంగా ఆడపిల్లలకు విద్య అస్తిత్వం అందిస్తుందని కలెక్టర్ తెలిపారు. పూర్వికులకు దొరకని అవకాశం మనకు లభించిందని, మనకు అందిన ఈ అవకాశం ఎట్టి పరిస్థితుల్లోనూ చేజార్చుకోవద్దని అన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు సహాయం చేసేందుకు ముందుకు వచ్చిన మలబార్ గోల్డ్ సంస్థ ప్రతినిధులకు కలెక్టర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఇంటర్మీడియట్ అధికారి రవిబాబు, కళాశాల ప్రిన్సిపాల్ గోవిందరావు, అధ్యాపకులు పవన్, భరత్ కుమార్, రాణి, శ్రీనివాస్, కిరణ్, మలబార్ సంస్థ జిల్లా హెడ్ విష్ణు, మేనేజర్ రామారావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అమరవీరుల త్యాగాలను మరువకూడదు



**వనపర్తి, ఫిబ్రవరి 20 (జనంసాక్షి) :** ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనకు తమ ప్రాణాలను త్యాగం చేసిన అమరవీరులను మరువకూడదని మాజీ వ్యవసాయ శాఖామంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఉద్బోధించారు .మాజీ మంత్రి నివాసంలో తెలంగాణ అమరవీరుడు సిరిపురం యాదయ్య వర్ధంతిని బీఆర్ఎస్ అధ్వర్యంలో గురువారం జరుపుకున్నారు.మాజీ మంత్రి నిరంజన్ రెడ్డితో పాటు చిన్నారులు కంచ తన్వీశా, కంచ కాత్యాయని యాదయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లు అర్పించారు.తెలంగాణ అమరవీరులందరికీ రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు .ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ ఆంధ్రా పాలకుల వివక్ష పాలన మూలంగా తెలంగాణకు అన్ని రంగాల్లో జరిగిన అన్యాయాన్ని భరించలేక పలువురు తమ ఉజ్వల భవిష్యత్తును పణంగా పెట్టి ఉద్యమానికి ఊపిరి పోశారని గుర్తు చేశారు. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రంలో పాలన ప్రస్తుతం ఆంధ్రా పాలకుల కనుసన్నలలో సాగుతున్నదని అన్నారు. ఇదే పరిస్థితులు కొనసాగితే మరోసారి ఉద్యమించాల్సి వస్తుందని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అమరవీరుల ఆశయాల్లో భాగంగా తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు నేతృత్వంలో సాధించిన బంగారు తెలంగాణను అధికారంలో ఉన్న కాంగ్రెస్ నాయకులు భ్రష్టు పట్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అద్యక్షుడు గట్టు యాదవ్, అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్, మీడియా సెల్ కన్వీనర్ నందిమల్ల అశోక్ ,మార్కు ఫెడ్ డైరెక్టర్ విజయ్ కుమార్,మాజీ కౌన్సిలర్లు నాగన్న యాదవ్,సమధ్,కంచ రవి,నాయకులు ప్రేమ్ నాథ్ రెడ్డి,స్టార్ రహీమ్,మహేశ్వర్ రెడ్డి ,ఆరీఫ్,పాషా, జోహేబ్ హుస్సేన్, చిట్యాల రాము,ప్రేమ్ కుమార్, మునేశ్వర్,గ్రీన్ యార్డ్ యూసూఫ్, అలీమ్,శివ లక్ష్మణ్,వజ్రాల రమేష్,తోట శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# అగ్రహారంలోని కరీంనగర్ పాల శీతలీకరణ కేంద్రం సీజ్..





- అనుమతులు లేవని తెలిపిన అధికారులు

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 20 (జనంసాక్షి) :** వేములవాడ అర్బన్ మండలంలోని అగ్రహారం వద్ద ఏర్పాటు చేసిన కరీంనగర్ డైరీ పాల సీతలికరణ కేంద్రాన్నిగురువారం అధికారులు సీజ్ చేశారు. పాలసీతలికరణ కేంద్రానికి చేరుకున్న అధికారులు కేంద్రంలోని నిర్వాహకులకు నోటీసు ఇవ్వడానికి ప్రయత్నిచగా వారు తీసుకోవడానికి నిరాకరించారు. దీంతో అధికారులు అందులో పని చేస్తున్న సిబ్బందిని బయటకు పంపించి గేటుకు తాళం వేసి సీజ్ చేయడానికి ప్రయత్నించగా సిబ్బంది వ్యతిరేకించారు. దీంతో జిల్లా పరిశ్రమల శాఖ అధికారి భారతి, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ అన్సారి, తహసిల్దార్ మహేశ్ సిబ్బందితో మాట్లాడి అధికారులకు సహకరించాలని సూచించారు. అనంతరం గేట్‌కు తాళం వేసి సీజ్ చేసి అధికారులు వెళ్లిపోయారు.విషయం తెలుసుకున్న కరీంనగర్ డైరీ డైరెక్టర్ ప్రభాకర్ రావు, పలువురు రైతులు,సిబ్బంది కేంద్రం వద్ద ఆందోళన నిర్వహించారు.అనంతరం రహదారిపై రాస్తారోకో చేపట్టి నిరసన వ్యక్తం చేశారు. 20,000 లీటర్లు పాలు ట్యాంకులో ఉండగానే అధికారులు సీజ్ చేయడానికి పలు రైతులు బారాస నాయకులు ఖండించారు. లక్షల మంది రైతుల కుటుంబాలతో నడుస్తున్న సంస్థపై ప్రభుత్వ అనాలోచిత చర్యలు చేపడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.

# మాజీ మంత్రి నాగంపై కేసు కొట్టివేసిన హైకోర్టు



**నాగర్‌కర్నూల్ ఆర్సీ, ఫిబ్రవరి 20 (జనంసాక్షి) :** నాగర్ కర్నూల్ అసెంబ్లీ ఎన్నికల సమయంలో మాజీ మంత్రి నాగం జనార్ధన్ రెడ్డి పై నాగర్ కర్నూల్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన కేసును హైకోర్టు కొట్టివేసింది. అసెంబ్లీ ఎన్నికల సమయంలో తనపై తప్పుడు కేసు నమోదు చేశారని, కొట్టివేయాలని కోరుతూ జనార్ధన్ రెడ్డి హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. 2023, నవంబర్ 26న అనుమతి లేకుండా దాదాపు300 మందితో నాగర్ కర్నూల్ జిల్లా శ్రీపురం గ్రామంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద రాత్రి 9.30 ప్రాంతంలో ర్యాలీ నిర్వహించారని ఫిర్యాదు అందిందనీ ఎన్నికల కోడ్ అమల్లో ఉండగా బీ.ఆర్.ఎస్ పార్టీకి అనుకూలంగా, అనుమతి పొందకుండా ర్యాలీ నిర్వహించడం చట్టవిరుద్ధమంటూ పోలీసులు కేసు నమోదు చేశారు. ఆధారాలు లేకుండా నమోదు చేసిన ఎఫ్.ఐ.ఆర్‌ను కొట్టివేయాలని కోరుతూ, నాగం జనార్దన్ రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్ పై న్యాయమూర్తి జస్టిస్ కె.లక్ష్మణ్ బుధవారం విచారణ చేపట్టారు. వాదనలు విన్న న్యాయమూర్తి ఎఫ్.ఐ.ఆర్‌ను కొట్టివేస్తూ తీర్పునిచ్చారు.

# వెయ్యికోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

- ఎమ్మెల్యే చిట్టెం పర్ణిక రెడ్డి



**నారాయణపేట జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 20 (జనంసాక్షి) :** నారాయణపేట జిల్లాలోని అప్పక్ పల్లి దగ్గర.సీఎం సభస్థలిని ఎమ్మెల్యే లు చిట్టెం పర్ణిక రెడ్డి,వాకిటి శ్రీహరి,వంశీకృష్ణ, వీర్లపల్లి శంకర్ కలిసి పరిశీలించారు.అనంతరం సభా ప్రాంగణంలో విలేకరుల సమావేశంలోనారాయణపేట ఎమ్మెల్యే పర్ణిక రెడ్డి మాట్లాడుతూసీఎం సభ ను విజయవంతం చేయాలి 1000 కోట్లతో అభివృద్ధి పనులను శంకుస్థాపన చేస్తున్నారని అన్నారు. .రాష్ట్రంలో మొట్టమొదటిగా మహిళ సమాఖ్య ద్వారా పెట్రోల్ పంప్ ప్రారంభిస్తారు.మహిళలకు పెద్దపీట వేస్తున్నది కాంగ్రెస్ ప్రభుత్వమేనని అన్నారు. మక్తల్ ఎమ్మెల్యే శ్రీహరి మాట్లాడుతూ శుక్రవారంమెడికల్ కళాశాలతో పాటు పేట ఎత్తిపోతల పథకం ద్వారా ఈ ప్రాంతం సస్యశ్యామలం అవుతుందని ఆయన అన్నారు. ఈ ప్రాంతంలో నీరు చూస్తామో లేదో అనుకున్నాము కానీ, పేట ఎత్తిపోతల పథకం వస్తుందంటే మేము చాలా అదృష్టవంతులమని అన్నారు. మన జిల్లా వాసి అపరభగీరతుడు సీఎం అయినందునే మాకు ఈ ప్రాజెక్టు మా అదృష్టంగా భావిస్తున్నామని ఆయన తెలిపారు.వలసల జిల్లాకు కాదు వలసలు వచ్చే విధంగా నారాయణపేటను అన్ని విధాలుగా అభివృద్ధి చిందే విధంగా చేస్తామని అన్నారు. కొందరుప్రతిపక్ష నాయకులు ఆయనను విమర్శిస్తున్నారుబీసీ బిడ్డగా బీసీ కులగణను స్వాగతించం అది నెరవేర్చిన ఘనత మన సీఎం కు దక్కుతుందని, 42 శాతం ఉన్న బీసీ లకు 42 శాతం టికెట్లు సాధిస్తాం అన్నారు.అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చేయని సాహసోపేత నిర్ణయాలను మన సీఎం తీసుకున్నారు.ఇందిరమ్మ ఇండ్ల మహిళలకు పెద్దపీఠ వేస్తుంది ఇందిరమ్మ రాజ్యం పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేయబోతున్నారు. ప్రజలు పెద్దఎత్తున హాజరై సభను విజయవంతం చేయాలి అన్నారు. ఎన్నికల సమయంలో ఆంధ్ర అక్రమంగా నీరు తీసుకబోతే అడ్డుకుంటామని అన్నాడు కానీ ఆంధ్ర వాళ్ళు నీళ్లు దోచుకున్న నోరు మూసుకొని కుసున్నది కేసీఆర్ కాదా అని ఆయన అన్నారు. కెసిఆర్ ప్రభుత్వం 10 సంవత్సరాలలో చేయని అభివృద్ధి 14 నెలలలోనే మీరు చేయని పనులు మేము చేసాం చూపిస్తున్నాం గతంలో కేసీఆర్ పాలమూరును దత్తత తీసుకున్నారు కానీ ఏమీ చేయలేదు ఘాటుగా విమర్శించారు. షాదనగర్ ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ ప్రజా పాలన ప్రగతి బాట ఎడారిగా మారబోతున్న మక్తల్ నారాయణపేట కొడంగల్ ప్రాంతాలకు నీరు అందించాలని కంకణం కట్టుకున్నారు.వాస్తవాలను ప్రజలు గ్రహిస్తారు పాలమూరు కష్టాలను ఎత్తిచూపి గతంలో పొద్దు ఎల్లగొట్టుకున్నారు. మీ పది సంవత్సరాలన పాలనలో ఇక్కడి ప్రాంతానికి ఒక ఎకరానికైనా నీరు నిర్వహించలేని దుర్భాగ్యమైన పాలన చేశారని ,ఇక్కడి ప్రజలకు రైతుల నిర్వహించలేని ప్రభుత్వం చేతకాని ప్రభుత్వం అని ఆయన అన్నారు.ఈ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో విఫలం చేశారని, కొడుకు అల్లుడు బుడుబుక్కలట ఆడుతున్నారని అన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు ప్రశాంత్ కుమార్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పురుగుల మందు తాగితే రైతు భరోసా వస్తది

- వ్యవసాయ అధికారి రైతులతో ఎగతాళి
- అధికారి తీరుపై రైతుల ఆగ్రహం



**హత్నూర, ఫిబ్రవరి 20 (జనం సాక్షి) :** పురుగుల మందు తాగితే రైతు భరోసా వస్తుందని సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారి ఎగతాళిగా మాట్లాడుతున్నాడని ఆరోపిస్తూ రైతులు పురుగుల మందు డబ్బాలను చేతపట్టుకొని ఆందోళనకు దిగిన సంఘటన సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం కాసాల గ్రామంలో గురువారం జరిగింది.దౌల్తాబాద్ క్లస్టర్ పరిధిలోని కాసాల గ్రామానికి చెందిన రైతులు తమకు రైతు భరోసా డబ్బులు ఖాతాల్లో జమ కావడం లేదని సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారి మహేందర్ ను సంప్రదించగా పొంతన లేని సమాధానం చెప్తూ దురుసుగా ప్రవర్తిస్తున్నారని రైతులు ఆరోపించారు. రైతులను తక్కువ చేసి మాట్లాడతూ హీనంగా చూస్తున్న అధికారి మహేందర్ ను వెంటనే సస్పెండ్ చేయాలని వారు డిమాండ్ చేశారు.కార్యక్రమంలో రైతులు కోర ప్రభు,కృష్ణ,ఎండీ.అఖిల్,శ్రీనివాస్ గౌడ్, మల్లేశం తదితరులు ఉన్నారు.

# లబ్ధిదారులు నివాసం లేనివి గుర్తించి నోటీసులు జారీ చేయండి

- జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి



**వనపర్తి బ్యూరో ఫిబ్రవరి 20 (జనంసాక్షి) :** ఇప్పటి వరకు పట్టాలు ఇచ్చిన రెండు పడకల గృహాల్లో అసలైన లబ్ధిదారులు నివాసం లేనివి గుర్తించి నోటీసులు జారీ చేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. గురువారం సాయంత్రం కలక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో అదనపు కలెక్టర్ రెవెన్యూ జి వెంకటేశ్వర్లు, పంచాయతీ రాజ్ కార్యనిర్వహక ఇంజనీరు, గృహ నిర్మాణ శాఖ పి.డి, సంబంధిత తహాశీల్దార్లతో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పై సమీక్ష నిర్వహించారు.ఇటీవల డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను పరిశీలించగా వాటిలో ఎవరైతే పట్టాలు పొందారో అట్టి లబ్ధిదారులు నివాసం ఉండటం లేదనే విషయం గుర్తించడం జరిగిందన్నారు. జిల్లాలో 1488 డబుల్ బెడ్ రూమ్ ఇళ్ళు నిర్మించి 543 మందికి నిరుపేద కుటుంబాలుగా గుర్తించి లక్కీ డీప్ ద్వారా ఇళ్ల పట్టాలు ఇవ్వడం జరిగింది. మరికొన్ని రోడ్డు విస్తీర్ణంలో ఇళ్ళు, దుకాణాలు కోల్పోయిన వారికి పట్టాలు ఇవ్వడం జరిగింది. కానీ ఇచ్చిన ఇళ్లలో అసలు పట్టాదారులు నివాసం ఉండకుండా అద్దెకు ఇవ్వడం మరికొన్ని ఖాళీగా పడి ఉన్నట్లు తెలిసిందన్నారు. నిబంధనల ప్రకారం డబుల్ బెడ్ రూమ్ ఇళ్ళు అద్దెకు గాని, లీజ్ కు లేదా అమ్ముకోడానికి వీలు లేదని,అందువల్ల డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పట్టాల జాబితా, ఇటీవల కుటుంబ సర్వే లో ఉన్న ఇంటి నెంబర్ల జాబితాను పరిశీలించి సంబంధిత తహాశీల్దార్లు తమ వెంట ఇంజనీరింగ్, పోలీస్ సిబ్బందిని వెంట తీసుకొని డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను పరిశీలించాలని ఆదేశించారు. ఖాళీ ఉన్న వాటిని ప్రభుత్వ అధీనంలోకి తీసుకొని అద్దెకు ఉన్న వారికి ఫారం 2, అసలు పట్టాదారు కు ఫారం 1 ద్వారా నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. స్వాధీనం చేసుకున్న ఇళ్లను ఇందిరమ్మ ఇళ్ల కొరకు దరఖాస్తు చేసుకున్న అర్హులకు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా ఎక్కడైతే 90 శాతానికి పైగా డబుల్ బెడ్ రూమ్ ఇళ్లలో నివాసం ఉంటున్నారో ఎలాంటి కాలనికి అవసరమైన మౌలిక సదుపాయాలు ఎంకావాలో నివేదిక సిద్ధం చేసి ఇవ్వాలని సూచించారు.అదనపు కలెక్టర్ రెవెన్యూ జి. వెంకటేశ్వర్లు, పంచాయతీ రాజ్ కార్యనిర్వహక ఇంజనీరు మల్లయ్య, ఆర్డీఓ సుబ్రమణ్యం, పి.డి. హౌజింగ్, తహాశీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

# వనజాతరలో ఇబ్బందులు రానివ్వొద్దు



- మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ నగేష్

**పాపన్నపేట,ఫిబ్రవరి 20(జనంసాక్షి):** ఏడుపాయల వన జన జాతరలో భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు సమన్వయంతో విధులు నిర్వహించాలని మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ మెంచు నగేష్ పేర్కొన్నారు. మహాశివరాత్రి జాతర నిర్వహణ ఏర్పాట్ల పై అదనపు కలెక్టర్ వివిధ శాఖల అధికారులతో గురువారం ఏడుపాయల ఈవో కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు.అనంతరం వ్యాపార దుకాణ దారులకు ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పిస్తూ దిశా నిర్దేశం చేశారు.ఈసందర్భంగా ఆలయ ఈవో చంద్రశేఖర్,మెదక్ డిఎస్పి ప్రసన్నకుమార్,పాపన్నపేట తహసిల్దార్ సతీష్ కుమార్,ఎంపీడీఓ విష్ణు వర్ధన్, పాపన్నపేట, కొల్చారం ఎస్ఐలు,శ్రీనివాస్ గౌడ్,గౌస్,వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ముగిసిన కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ ఆర్మ్డ్ రిజర్వు వార్షిక మొబిలైసెషన్

- పరేడ్ నిర్వహించిన సాయుధ బలగాలు
- ముఖ్య అతిధిగా హాజరైన అడిషనల్ డీసీపీ ఎ.లక్ష్మీనారాయణ




**కరీంనగర్ బ్యూరో, ఫిబ్రవరి 20 (జనంసాక్షి) :** ప్రతీ సంవత్సరం ఆర్మ్డ్ రిజర్వు పోలీసులకు శిక్షణలో భాగంగా నిర్వహించే వార్షిక మొబిలైసెషన్ కార్యక్రమం గురువారం రోజు ముగిసింది. డిమొబిలైసెషన్ కార్యక్రమ పరేడ్ గురువారం రోజు కరీంనగర్ పోలీసు కమిషనరేట్ పరేడ్ గ్రౌండ్ లో నిర్వహించారు. సాయుధ బలగాల పోలీసులు ఈ పరేడ్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అడిషనల్ డీసీపీ మాట్లాడుతూ... శాంతి భద్రతల సమస్యలు తలెత్తినపుడు వాటిని అదుపు చేయుటకు ముఖ్యంగా ఆర్మ్డ్ రిజర్వు పోలీసుల సేవలు వినియోగించుకుంటామన్నారు. ఈ మొబిలైసెషన్ లో భాగంగా సాయుధ బలగాల పోలీసులకు, విధులకు సంబందించిన ఆర్మ్ డ్రిల్, వెపన్ డ్రిల్, పరేడ్ , మాబ్ ఆపరేషన్, వెపన్ ఫైరింగ్ మొదలగు అన్నీ అంశాల్లో 20 రోజుల పాటు శిక్షణ అందించామన్నారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను విధుల్లో కనబరుస్తూ మెరుగైన సేవలు అందించాలని తెలిపారు. ముగింపు సందర్భంగా డిమొబిలైసెషన్ పరేడ్ నిర్వహించామని ఈ కార్యక్రమం ముగిసిందని డీసీపీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రిజర్వు ఇన్స్పెక్టర్లు రజనీకాంత్ , జానీమియా , శ్రీధర్ రెడ్డి , సురేష్ ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# మంథని తాసిల్దార్ కార్యాలయంలో ఏసీబీ దాడులు

- లంచం తీసుకుంటూ పట్టుబడ్డ ల్యాండ్ సర్వేయర్



**మంథని, (జనంసాక్షి) :** పెద్దపల్లి జిల్లా మంథని రెవెన్యూ కార్యాలయంలో ఏసీబీ దాడులతో కలకలం రేగింది. భూమి సర్వే రిపోర్ట్ కోసం డబ్బులు డిమాండ్ చేసిన ల్యాండ్ సర్వేయర్ రెడ్ హ్యాండెడ్ గా గురువారం రాత్రి ఏసీబీకి చిక్కాడు. ఏసీబీ డిఎస్పి వివి రమణమూర్తి కథనం ప్రకారం మంథని మండలం రెవెన్యూ సర్వేర్ గా పని చేస్తున్న జాటోతు గణేష్ మంథని రెవెన్యూ గ్రామ శివారులోని రెడ్డి చెరువు వద్ద సర్వేనెంబర్ 814 /డి /1, 815/సి సర్వే నెంబర్ల ఒక ఎకరం భూమిని కొలిచేందుకు రైతు సువర్ణ క్రాంతి దగ్గర రూ.17వేల డిమాండ్ చేశారు. ఈనెల 5న తొమ్మిది వేల రూపాయలు తీసుకున్నాడు. మళ్లీ డబ్బులు డిమాండ్ చేయడంతో రైతు ఏసీబీ ని ఆశ్రయించాడు. మరో మూడు వేలు రెండవ వాయిదాగా గురువారం ఇస్తానని ఫోన్ చేయగా సర్వేయర్ ఆఫీసుకు కాకుండా బస్టాండ్ కు రమ్మని బాధితునికి చెప్పాడు దీంతో బాధితుడు రూ. 3000 బస్టాండ్ లో సర్వేయర్ గణేష్ కు అందజేస్తుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. మంథని పట్టణంలో చాలా రోజుల తర్వాత ఏసీబీ అధికారులు దాడులు చేయడంతో ఉద్యోగుల్లో ఒకసారిగా కలకలం రేగింది. ఈ దాడుల్లో ఏసీబీ సిఐలు తిరుపతి కృష్ణ కుమార్, హెడ్ కానిస్టేబుల్ వేణుగోపాల్, కానిస్టేబుల్ శ్రీకాంత్, హోంగార్డులు అశోక్, సంతోష్ లు ఉన్నారు.



## క్రేన్ ప్రమాదంలో వ్యక్తి మృతి



**మర్రిగూడ, ఫిబ్రవరి 20 (జనంసాక్షి) :** క్రేన్ ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం, గట్ల నర్సింగాపూర్ గ్రామంలో సంఘటన జరిగింది, పూర్తి వివరాలకు వెళితే నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలం తమ్మడపల్లి గ్రామానికి చెందిన గండికోట ఎల్లయ్య, వయసు 67 సంవత్సరాలు బ్రతుకుతెరువు కోసం బావులు తవ్వే పని కోసం వెళ్లి క్రేన్ ప్రమాదంలో బావిలో పడి చనిపోవడం జరిగింది, ఎల్లయ్య ముక్కుసూటి మనిషి అని, ఎవరిపై ఆధారపడకుండా సొంతంగా కష్టపడి పని చేసే వ్యక్తిని గ్రామస్తులు విచారణ వ్యక్తం చేస్తున్నారు.

# సీసీ రోడ్డు పనుల్లో నాణ్యతాలోపం

- వేసిన మూణ్ణాళ్లకే నెర్రెలిస్తున్న రోడ్లు
- కాంట్రాక్టర్ల పనితీరుపై ప్రజల మండిపాటు
- రోడ్డు వేసిన కొన్ని రోజులకే పగిలిన సీసీ రోడ్డు రోడ్లు



**తుర్కయంజాల్ ఫిబ్రవరి 20 (జనం సాక్షి ):** తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యతాలోపాలు తేటతెల్ల మవుతున్నాయి. కాసుల కక్కుర్తితో కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. లెస్సులకు కాంట్రాక్టులు నిలబెట్టుకుంటూ అందినకాడికి దోచుకోవడమే పరమావధిగా వ్యవహరిస్తున్నారు. కోహెడ 2వ వార్డు పరిధి రాజీవ్‌నగర్ కాలనీలో సీసీ రోడ్డు వేసి పట్టుమని మూడు నెలలు దాటకముందే రోడ్డు మొత్తం నెర్రెలు బారింది. ఇది చూసిన స్థానికులు, కాంట్రా క్లర్, అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ తరహా పనులు తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలో కోకొల్లులగా ఉన్నట్లు ప్రజలు చెబుతున్నారు. సీసీ రోడ్లు పగిలిపోవడం, మ్యాన్‌హోల్స్ కృంగిపోవడం సర్వసాధారణమైంది. కాం ట్రాక్టర్లు నాసిరకం పనులు చేపట్టడం, నాణ్యతా ప్రమాణాలు పాటించకపో వడం వల్లే ఈ దుస్థితి నెలకొన్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

**కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి**

నాసిరకంగా పనులు చేపడుతున్న కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. బిల్లులు మంజూరు చేయవద్దని డిమాండ్ చేస్తున్నారు. మున్సిపాలిటీ అధికారులకు ఎమ్మెల్యే ఎన్నిసార్లు హెచ్చరించినా నిర్లక్ష్యంగానే వ్యవహరించడం పలు అనుమానాలకు తావిస్తోందనని చెబుతున్నారు. ఈ కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్టులో పెట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

# అభివృద్ధి కోసమే అడుగులు



**షాబాద్ 20(జనం సాక్షి):** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అమలు పరుస్తున్న పలు అభివృద్ధి కార్యక్రమాలు చూసి గ్రామపంచాయతీ బిఆర్ఎస్ మాజీ సర్పంచులు కాంగ్రెస్ పార్టీలో చేరి అభివృద్ధిలో భాగస్వాములము అవుతామని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్ రెడ్డి అన్నారు. మండల పరిధిలోని తాళ్లపల్లి గ్రామ బిఆర్ఎస్ తాజా మాజీ సర్పంచ్ సమ్మి పెంటయ్య సీనియర్ నాయకులు గోస్వాడ రాజు, మారుగళ్ల నర్సింలు గురువారం గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తో కలిసి రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ... ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తూచా తప్పకుండా అమలు పరుస్తూ, తెలంగాణ ప్రజల మన్నలను పొంది ముందుకు సాగుతున్న ప్రభుత్వం మన ప్రభుత్వమే అని అన్నారు. త్వరలో జరగబోయే స్థానిక మరియు పంచాయతీ ఎన్నికల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు ముందుండి పార్టీ గెలుపు దిశగా నడిపించాలని కోరారు. పార్టీలో కష్టపడ్డా ఏ నాయకుడ్ని గాని కార్యకర్తను గాని పార్టీ ఎన్నడు కూడా మరవదని మరొకసారి గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పెంటయ్య గౌడ్, మాజీ సర్పంచులు మహేందర్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, బార్ల యాదయ్య మాజీ ఎంపీటీసీలు కుమ్మరి చెన్నయ్య, గుండాల అశోక్ పార్టీ నాయకులు దండు రాహుల్ గుప్తా, సుభాష్ రెడ్డి, శేఖర్, గౌరీశ్వర్, వెంకటయ్య, సుభాష్, మాధవరెడ్డి, అంజిరెడ్డి, రాజు తదితరులు పాల్గొన్నారు.

# కుత్బుల్లాపూర్‌లో ఫుట్‌పాత్ ఆక్రమణల కూల్చివేత



**హైదరాబాద్, ఫిబ్రవరి 20 (జనంసాక్షి) :** కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలోని 131 కుత్బుల్లాపూర్ డివిజన్ చింతల్ నుండి పద్మనగర్ రింగ్ రోడ్ మీదిగా సుచిత్ర వైపునకు వెళ్లే ప్రధాన దారికి ఇరువైపులా ఉన్న ఫుట్ పాత్ ఆక్రమణలను కూల్చేశారు. గురువారం టౌన్ ప్లానింగ్ అధికారులు సురేందర్ రెడ్డి, రమేష్ నేతృత్వంలో కూల్చివేతలు చేపట్టారు. గత కొన్ని రోజులుగా కాలనీలకు అంతర్గతంగా వెళ్లే రహదారులను పూర్తిగా ఆయా దుకాణ సముదాయాలు, వ్యాపారస్తులు రోడ్డుపై ఫుట్ పాత్‌లను ఆక్రమించి వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. దీంతో ఉదయం, సాయంత్రం సమయంలో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. దీనికి తోడు స్కూల్ బస్సులు ఇతర పెద్ద వాహనాలు ఈ దారుల గుండా రావాలంటే గగనంగా మారింది. అయితే స్థానికంగా కాలనీల వాసులు, వాహనదారులు చేస్తున్న ఫిర్యాదుల మేరకు కుత్బుల్లాపూర్ టౌన్ ప్లానింగ్ అధికారులు జేసీబీలు, ఇతర యంత్రాలతో ఫుట్ పాత్ ఆక్రమణలు పూర్తిగా తొలగించారు. ప్రధానంగా చింతల్ బస్ స్టాప్ నుండి ఎల్లమ్మ గుడి టెంపుల్ వరకు ఈ ఫుట్ పాత్ ఆక్రమణలు తొలగించగా మిగిలిన ప్రాంతంలో త్వరలో తొలగించేందుకు తగు చర్యలు తీసుకుంటామని టౌన్ ప్లానింగ్ అధికారులు తెలిపారు.

# ఇసుక అక్రమ రవాణాపై పటిష్ట నిఘా

- మైనింగ్ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎన్ శ్రీధర్



**మహదేవపూర్, ఫిబ్రవరి 20 (జనంసాక్షి) :** ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు పటిష్ట నిఘా కొనసాగాలని మైనింగ్ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎన్ శ్రీధర్ తెలిపారు. గురువారం భూపాలపల్లి జిల్లా మహాదేవ పూర్ మండలంలోని బొమ్మాపూర్, ఎల్కేశ్వరం, అన్నారం, పలుగుల ,పూసుకుపల్లి, మద్దులపల్లి లలో ఇసుక రీచ్ లను భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 24/7 ఇసుక కోసం ఆన్లైన్ సేవలను అందుబాటులోకి తెచ్చామని తెలిపారు. ఈ సేవల ద్వారా ప్రజలకు మరింత సులభంగా, పారదర్శకంగా ఇసుక లభించేందుకు వీలు కలుగుతుందని తెలిపారు. రీచ్‌లలో ఇసుక తీయు కార్యకలాపాలను సమీక్షించడంతో పాటు, ప్రతి రోజు ఎన్ని టన్నుల ఇసుక తీస్తున్నారని, రవాణా జరుగుతుందని టీఎస్ ఎండిసి, మైనింగ్ అధికారు లను అడిగి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల అవసరాలకు అనుగుణంగా ఇసుక అందుబాటులో ఉండేలా రాష్ట్ర ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. 24/7 ఆన్లైన్ ప్రక్రియ ద్వారా ఇసుక కొరత లేకుండా బుకింగ్ చేయడానికి అవకాశం కల్పించామని తెలిపారు. ఆయా ఏరియాల్లో ఇసుక స్టాకు, గోదావరిలో ఇసుక తీయు విధానాన్ని పరిశీలించారు. స్టాకు పాయింట్, రీచ్ లకు వచ్చు వాహనాలు, లోడింగ్‌తో వెళ్ళు మార్గాలల్లో సిసి కెమెరాలు ఏర్పాటు ద్వారా పటిష్ట పర్యవేక్షణ చేయడానికి సిసి కెమెరాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. విద్యుత్, సోలార్ యూనిట్లు ఏర్పాటు ద్వారా విద్యుత్తు సౌకర్యం కల్పించనున్నట్లు తెలిపారు. రోజు వారీ ఎంత ఇసుక రవాణా జరుగుతుందనే వివరాలు అడిగి తెలుసుకున్న కార్యదర్శి 8 నుండి 10 వేల మెట్రిక్ టన్నులకు పెంచాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వాహనాలు నిలుపుదల చేయడం వల్ల రైతులకు, ప్రజలకు ఇబ్బంది కలుగుతుందని రవాణాను నియంత్రణ చేసేందుకు ఇసుక స్టాక్ ఏర్పాటుకు అలాగే వాహనాలు నిపుదలకు పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేయాలని తెలిపారు. ఇసుక కొరత రాకుండా రాష్ట్రవ్యాప్తంగా నూతన ఇసుక రీచ్ లు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని ఇసుక కొరత రాకుండా స్టాక్ నిల్వలు పెంచి ఇసుక నిల్వలు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. గోదావరి నుండి ఇసుక తీయటానికి యంత్రాలను పెంచాలని ఆయన సూచించారు. ఇసుక రవాణాకు నిర్దేశించిన అదనంగా 3 గంటలు కేటాయిస్తామని నిర్దేశించిన లక్ష్యం మేర ఇసుక రవాణ చేయాలని ఆయన ఆదేశించారు. నిర్దేశించిన స్టాకు ప్రకారం ఇసుక తరలించేందుకు వాహనాలుకు అనుమతి ఇవ్వాలని తెలిపారు. కాంట్రాక్టురుకు కమిషన్ చెల్లింపు లు క్రమం తప్పకుండా చెల్లిస్తామని ఇసుక తీయుటకు అదనపు యంత్రాలు ఏర్పాటు చేయాలని, ఇసుక నిల్వలు పెంచాలని సంబంధిత కాంట్రాక్టర్లను ఆదేశించారు. లారీలు కాంటా వేసేందుకు అదనపు వేయింగ్ మిషన్ ఏర్పాటు చేయాల్సి ఉన్నదని, ప్రత్యామ్నయంగా ప్రయివేటు వేయింగ్ మిషన్ ను వినియోగించుకోవాలని ఆయన సూచించారు.

జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ ఇసుక రవాణా, లభ్యతపై కఠినమైన నిఘాతో అక్రమ రవాణాను అరికట్టేందుకు చర్యలు తీసుకున్నామని అన్నారు. వాహనాలు రద్దీ నియంత్రణకు, నిలిపి ఉంచకుండా వాహనాలు నియంత్రణ చేసేందుకు ఆన్లైన్ బుకింగ్ ప్రకారం.క్రమపద్ధతిలో వాహనాలు రీచ్ కు వచ్చే విధముగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. చెకింగ్ పాయింట్ ఏర్పాటు ద్వారా నిశిత పరిశీలన జరుగుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిజి ఎంఐడిసి విసి అండ్ ఎండి సుశీల్ కుమార్, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, టీఎస్ఎం ఐడిసి పిఓ రంగారెడ్డి, మైనింగ్ ఎడి జయరాజు, తహసీల్దార్ ప్రహ్లాద రాథోడ్, నాయబ్ తహసీల్దార్ కృష్ణ ఇతర విభాగాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం 21 ఫిబ్రవరి 2025
తెలంగాణ



# తాగునీటి సమస్య రాకుండా చూడాలి

## కలెక్టర్ ఇలా త్రిపాఠి

**నల్లగొండ బ్యూరో,ఫిబ్రవరి 20, జనంసాక్షి**
గత సంవత్సరం లాగే ఈ సంవత్సరం సైతం జిల్లాలో తాగునీటికి సమస్యలు రాకుండా చూసుకోవాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఎంపీడీవోలు,తహసిల్దారులను ఆదేశించారు.గురువారం ఆమె ఉదయాదిత్య భవన్లో తహసిల్దారులు,ఎంపీడీవోలతో వేసవి కార్యాచరణ ప్రణాళిక పై సమీక్ష నిర్వహించారు.ఎక్కడైనా తాగునీటి పైపులు,నల్లాలు తదితర అత్యవసర మరమ్మతులు ఉన్నట్లయితే గ్రామపంచాయతీ నిధుల నుండి చేయించాలని ఆదేశించారు. తప్పనిసరి పరిస్థితుల్లోనే ప్రైవేటు వ్యవసాయ బోర్లకు అనుమతి ఇవ్వడం జరుగుతుందన్నారు.పట్టణాలు,గ్రామాలలో తాగునీటి సమస్యలు ఉత్పన్నం కాకుండా రూపొందించే వేసవి కార్యాచరణ ప్రణాళికలో స్పష్టమైన రోడ్ మ్యాప్ తయారు చేయాలని,ఎక్కడ సమస్యలు ఉత్పన్నం కాకుండా ఉండే విధంగా చర్యలు చేపట్టాలని, రానున్న 150రోజులకు ప్రణాళిక రూపొందించాలని చెప్పారు. అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్ మాట్లాడుతూవేసవి తాగునీటి కార్యాచరణ ప్రణాళికలో భాగంగా ప్రతి కుటుంబం,ప్రతి వ్యక్తికి ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం తాగనీటిని ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని,ఈ విషయంలో ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడాలన్నారు.ఇందుకు సంబంధించి గ్రామీణ ప్రాంతానికి కార్యాచరణ ప్రణాళికను అధ్యయనం చేయడం జరిగిందని, మిషన్ భగీరథ గ్రిడ్ లో అలాగే నీటి సరఫరా లో ఎలాంటి సమస్యలు లేవని,అలాగే అంతర్గత సరఫరా లో ఉన్న సమస్యలను గుర్తించడం జరిగిందని,ఎక్కడైనా హ్యాండ్ పంపులు,తాగునీటి పైప్ లైన్లు మరమ్మతులు ఉంటే వెంటనే చేపట్టాలని అన్నారు.తాగు నీటి ట్యాంకులను,ఓహెచ్ఎస్ఆర్లను శుభ్రం చేయించాలని, ఎప్పటికప్పుడు క్లోరినేషన్ చేయించాలని తాగునీటి ట్యాంకులపై తప్పనిసరిగా మూతలు ఉంచాలని తెలిపారు.మిషన్ భగీరథ ఈ ఈ వంశీ కృష్ణ మాట్లాడుతూ వేసవి కార్యాచరణ ప్రణాళికలో భాగంగా చేపట్టనున్న ప్లాన్ ఏ,బి,సి కార్యక్రమాలపై వివరించారు. నూటికి నూరు శాతం మిషన్ భగీరథ తాగునీరు సరఫరా అయ్యే చోట గ్రామపంచాయతీ మోటార్లను వాడవద్దని తెలిపారు.ప్లాన్ సి కింద ఎక్కడ తాగునీటి ఓనర్లు లేని చోట మాత్రమే వ్యవసాయ బోర్లు లీజుకు టీసుకునేందుకు అవకాశం ఉందన్నారు.గ్రామాలలో తాగు నీటి ట్యాంకులు, పథకాలు,పైపులైన్లు లీకేజీ వంటి ఉంటే తక్షణమేగుర్తించాలని చెప్పారు.మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్ తదితరులు ఈ సమావేశానికి హాజరయ్యారు.




ఉత్తమ ఉపాధ్యాయురాలుగా ప్రశాంశ పత్రం అందుకుంటున్న విటలాని సీతల్ , ఉత్తమ ప్రతిభకు ప్రశంసలు

# ఉపాధి కూలీగా మారిన జిల్లా కలెక్టర్

**• పార, పలుగు పట్టి మట్టి తవ్విన జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్**

**టేకులపల్లి, ఫిబ్రవరి 20 (జనంసాక్షి):**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఉపాధి కూలీలతో కూలిగా మారి పార,పలుగు పట్టి సుమారు 20 నిమిషాల పైగా చెమటలు కారుతున్న, చేతికి చిన్న గాయం అయినప్పటికీ మట్టి తవ్వి బొచ్చెలు ఎత్తి ఉపాధి కూలీలకు అందించి అక్కడున్న వారందరిని ఆశ్చర్యానికి గురి చేస్తూ ఉత్సాహపరిచారు. టేకులపల్లి మండలంలో జిల్లా కలెక్టర్ గురువారం విస్తృతంగా పర్యటించారు. ఈ పర్యటనలో భాగంగా సులానగర్, చింతలంక, కోయగూడెం, చంద్రు తండా, కొత్త తండా గ్రామపంచాయతీలలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించారు.పంచాయతీ పరిధిలో ఉపాధి హామీ పథకం క్రింద చేపడుతున్న ఫారం చెరువు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతూ వారి బాగోగులు అడిగి తెలుసుకున్నారు. ఎన్ని రోజులుగా పనిచేస్తున్నారు, పని ప్రదేశంలో త్రాగునీరు వసతి కల్పిస్తున్నారా అని ఆరా తీశారు. ఈ సందర్భంగా కలెక్టర్ కూలీలతో మమేకమై వారితో ముచ్చటిస్తూ పలుగు పారా పట్టి మట్టిని తవ్వికూలీలలో ఉత్సాహన్ని నింపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎంత మంది కూలీలు పనిచేస్తు న్నారు,పనిచేసే ప్రాంతంలో త్రాగునీరు అందుబాటు లో ఉంచాలని, జాబ్ కార్డు వున్న ప్రతి ఒక్కరికి పనిదినాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. పలుగులు, పారలు కావాలని కూలీలు కోరడంతో పదిమంది కూలీలకు కలిపి రెండు పలుగులు,రెండు పారలు అందించే ఏర్పాట్లు చేస్తామని అన్నారు. రైతులతో మాట్లాడుతూ ఫారం చెరువులతో గ్రౌండ్ వాటర్ పెరగడమే కాకుండా వాటర్ స్టోరేజ్ చేసుకుని చేపల పెంపకం కానీ, బాతులు పెంపకం కానీ చేసుకోవచ్చన్నారు. అనంతరం కోయగూడెంలో రైతు పకీర్ కు చెందిన పొలంలో ఆగస్టు నెలలో నాటి సాగు చేస్తున్న మునగ సాగును కలెక్టర్ పరిశీలించి తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మునగ కాయలతో పాటు ఆకు ను కూడా పొడిచేసి అమ్మవచ్చని, రైతులు లాభదాయకమైన మునగ పంట పండించి ఆర్థికా అభివృద్ధి చెందాలని సూచించారు. అనంతరం చింతలంక గ్రామపంచాయతీ పరిధిలో నిర్వహిస్తున్న నర్సరీ సందర్శించారు ఈ సందర్భంగా కలెక్టర్ నర్సరీలలో ప్రజలకు ఉపయోగపడే మొక్కలు పెంచాలని, వేసవిలో ఎండ ప్రభావం వల్ల మొక్కలు చనిపోకుండా రోజుకు రెండుసార్లు నీరు పొయ్యాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఉపాధి హామీ పథకంలో భాగంగా చేపట్టిన మట్టి కట్టల పనిని పరిశీలించి తగు సూచనలు చేశారు.ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట డీఎల్పీఓ రమణ, మిషన్ భగీరథ డీఈ పద్మావతి, విద్యుత్ శాఖ డీఈ రంగస్వామి, ఎంపీడీవో రవీందర్ రావు, తహసిల్దార్ నాగ భవాని, మండల పంచాయతీ అధికారి జక్కుల గణేష్ గాంధీ, ఏపీవో కాలంగి శ్రీనివాస్, ఈసీ మొగిలి తిరుపతయ్య, పంచాయతీ కార్యదర్శులు పవిత్ర, గోపాలకృష్ణ, కృష్ణ చైతన్య, సిద్ధాంతి చిట్టి, రూబీ నా బేగం, మహేష్, వసంతరావు, ఈజీఎస్ సిబ్బంది భీముడు, వెంకటరమణ, స్వప్న, తేజవతు లకన్, శిరోమణి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# కలెక్టరేట్ ముందు గుడి తండా వాసుల నిరసన

**• కలెక్టర్,జేసీలకు తండావాసులు వినతులు**

**దేవరకొండ, ఫిబ్రవరి 20 (జనంసాక్షి)**
నల్లగొండ జిల్లా కలెక్టరేట్ ముందు గురువారం గుడి తండావాసులు నిరసన కార్యక్రమం చేపట్టారు. వారి తండాలో సమగ్ర విచారణ జరిపించి ప్రతి ఒక్కరికి సమన్యాయం చేకూర్చాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా గుడి తండా వాసులు సంబంధిత శాఖ అధికారులకు లిఖితపూర్వకంగా వినతులు సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గుడి తండ గ్రామం పెండ్లి పాకల రిజార్వాయర్లో పూర్తిగా ముంపుకు గురి అవుతున్నందున గత కొన్ని సంవత్సరాల క్రితం ప్రభుత్వం వారు తమ గ్రామానికి సర్వే నిర్వహించి అవార్డు ప్రకటించినారని తెలిపారు. అప్పుడు చాల మంది ఇంటి నిర్మాణ ఖాళీ స్థలంల కొలతల్లో అవకవతవకలు రావడం వలన అందరి జిల్లా కలెక్టర్ కి మా గ్రామ కమీట్ తరుపున వినతి పత్రం సమర్పించి విచారణ చేయించగా రీసర్వే నిర్వహించడం జరిపారని తెలిపారు. అయితే రీ సర్వే పూర్తి అవకుండా తేది. 17.02.2025 నాడు అవార్డు ప్రకటించగా ఇందులో ఇంటి నిర్మాణ ఖాళీ స్థలంల విలువలు పూర్తి అవాస్తవికంగా అన్సయిన్షింక్గా హెచ్చు తగ్గులుగా వచ్చి అధికారుల తప్పిదం వలన చాల మందికి అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో గల ఇండ్లు అన్ని 90 శాతం ఒకే విధంగా నిర్మాణ స్థలములు కలవని,అందుల్లో ఇంటి నిర్మాణములు మాత్రమే కొంత వరకు 1 లేదా 2రూములు ఎక్కువ తక్కువగా కలవని తెలిపారు.కాని వీటి ఇంటి విలువలల్లో మాత్రం గతంలో 4 నుండి 12 లక్షలు వచ్చిన వారికి చాలా వరకు ఇప్పుడు ప్రకటించిన అవార్డులో 16 నుండి 30 లక్షల వరకు అకస్మాతుగా పెరిగాయని పేర్కొన్నారు. మరికొంత మందికి గతంలో మారిగా 6 నుండి 12 లక్షలు గాని వచ్చాయని,ఇది చాల వరకు అందరిని నష్ట పరిచే విధంగా ఉన్నవని తెలిపారు . ఎందుకు ఇలా జరిగిందో మాకు అర్థం కావడం లేదని,ఒకే విధంగా ఉన్నఇంటి విలువల్లో ఇంత వ్యత్యాసం రావడం మాకు ఆందోలన కలుగుతుందన్నారు. ఇట్టి విషయంలో మా గ్రామంలో తీవ్ర అలజడిగా ఉండి ఒకరి పై ఒకరిని నిందించుకుంటూ గొడవలు జరుగుతూ గ్రామంలో పూర్తిగా అశాంతి నెలకొందని అన్నారు. రూములు ఎక్కువ తక్కువగా ఉంది,కాని వీటి ఇంటి విలువలల్లో మాత్రం గతంలో 4 నుండి 12 లక్షలు వచ్చిన వారికి చాలా వరకు ఇప్పుడు ప్రకటించినఅవార్డులో 16 నుండి 30 లక్షల వరకు అకాస్మాతుగా పెరిగాయని అన్నారు. ఈ వ్యత్యాసం ఎలా జరిగిందో మాకు అర్థం కావడం లేదని . ఒకే విధంగా ఉన్నఇంటి విలువల్లో ఇంత వ్యత్యాసం రావడం ఆందోలన కలుగుతుందని, ఇట్టి విషయంలో మా గ్రామంలో తీవ్ర అలజడిగా ఉండి ఒకరి పై ఒకరిని దించుకుంటూ గొడవలు జరుగుతూ గ్రామంలో పూర్తిగా అశాంతి నెలకొందని అన్నారు.కావున తమరు విచారణ జరిపించి గ్రామ సభ నిర్వహించి గిరిజనలమైన మాకు 90 శాతం అక్షరాస్యత సరిగ్గా లేనందున మాకు అన్యాయం చేయకుండా అవగాహన కల్పించి మా అందరికి ఒకే విధమైనన్యాయం చేయగలరని మా యొక్క ప్రార్ధన.





## అన్ని శాఖల అధికారులు సమన్వయంతో

# పని చేయాలి

**• కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్**

**మేళ్లచెరువు, (జనంసాక్షి):**
ఈ నెల 26 తారీఖు నుండి మార్చి 2 వరకు జరుగు మహాశివరాత్రి జాతర కొరకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ కోరారు. గురువారం శివాలయం ప్రాంగణంలో అన్ని శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జాతర సందర్భంగా వచ్చే భక్తులకు ఎలాంటి సమస్యలు రాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక బారీ కేడ్లు ఏర్పాట్లు చేయాలని దేవాలయ సిబ్బందికి సూచించారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చే భక్తులకు ప్రత్యేక పార్కింగ్ ఏర్పాటు చేయాలనీ పోలీస్ శాఖ అధికారులకు సూచించారు. ఎన్నెస్పీ కాలువ ద్వారా నీటి సరఫరా అయ్యే విధంగా చూడాలన్నారు. విద్యుత్ సమస్యలు లేకుండా చూడాలని విద్యుత్ శాఖ అధికారులను కోరారు. జాతరకు వచ్చే భక్తులకు ఆరోగ్య సమస్యలు వస్తే మందులు అందించేందుకు ఆరోగ్య శాఖ అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు. శానిటేషన్ విషయంలో సిబ్బంది పక్కాగా కార్యాచరణ తయారు చేసుకోవాలన్నారు. భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక బస్సులను నడపాలన్నారు. దేవాలయ పరిసరాల్లో మత్తుపదార్థాలు విక్రయించకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అగ్నిమాపక యంత్రాలు, సిబ్బంది జాతర ముగిసే వరకు అందుబాటులో ఉండాలన్నారు. భక్తుల సౌకర్యార్థం మంచి నీటి పాకెట్ లను అందుబాటులో ఉంచాలని కోరారు. జాతరలో పాల్గొనే సిబ్బందికి భోజన ఏర్పాట్లను చూడాలని ఎంపిడిఓ కు ఆదేశాలు ఇచ్చారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా ప్రతి ఒక్క సిబ్బంది పక్కా ప్రణాళికతో పని చేయాలన్నారు. ట్రాఫిక్ సమస్యలు రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ జ్యోతి, ఇన్చార్ ఎంపిడిఓ, ఎస్సై పరమేష్, వివిధ శాఖల అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, దేవాలయ శాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన ఆశ్రమ పాఠశాలను

# సందర్శించిన ఐటీడీఏ ఈఈ



**చంద్రుగొండ, ఫిబ్రవరి 20( జనంసాక్షి):**
గిరిజన ఆశ్రమ పాఠశాలలో రెండు రోజుల క్రితం ఐటిడిఏ పిఓ బి రాహుల్ సందర్శించి వెళ్లిన వెంటనే ఆశ్రమ పాఠశాల పనులకు కార్యాచరణకు శ్రీకారం చుట్టారు. పి ఓ బి రాహుల్ సందర్శనలో అనేక సమస్యలను గుర్తించారు. విద్యార్థుల నుండి సమస్యలు తెలుసుకున్నారు. గురువారం ఐటీడీఏ ఈ ఈ చంద్రశేఖర్ ఐటిడిఏ పి ఓ బి రాహుల్ ఆదేశాల మేరకు ఆశ్రమం పాఠశాలను సందర్శించి రెండవ అంతస్తు లో మూడు గదులలో బిల్డింగ్ స్లాబ్ పెచ్చులు ఊడిన దృశ్యాలను చూశారు. వర్షాకాలంలో బిల్డింగ్ కురుస్తుండడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని పాఠశాల ప్రత్యేక అధికారిని సునీత తెలియజేశారు. ఈ సందర్భంగా ఐ టి డి ఏ ఈ మాట్లాడుతూ ప్రతిపాదనలు పిఓ దృష్టికి తీసుకువెళ్లి నిధులు మంజూరు అయిన వెంటనే పనులు ప్రారంభిస్తామన్నారు. ఈయన వెంట డి ఈ బాపనయ్య ,ఏఈ సుబ్బరాజులు ఉన్నారు.

# నల్గొండ జిల్లాలో వెయ్యి మెగావాట్లు దాటిన విద్యుత్ డిమాండ్

**• దక్షిణ తెలంగాణ పంపిణీ సంస్థ సిఎండి : ముషారప్ ఫరూఖీ**



**నల్గొండ బ్యూరో,ఫిబ్రవరి 20,జనంసాక్షి**
నల్లగొండ పట్టణంలో జరుగుతున్న సమ్మర్ ప్లాన్ పనులను దక్షిణ తెలంగాణ పంపిణీ సంస్థ సిఎండి ముషారఫ్ ఫరూఖి సమీక్షించారు.గతేడాది దాదాపు 67 పీటీర్ లు ఓవర్ లోడ్ అయ్యాయి.ఇప్పుడు ఎలాంటి ఓవర్ లోడింగ్ సమస్యలు లేవని పేర్కొన్నారు. హైదరాబాద్ నగరానికేపరిమితమైన 1912 విద్యుత్ కాల్ సెంటర్ జిల్లాలకు విస్తరింప చేస్తాం అన్నారు. సమ్మర్ ప్లాన్ లో భాగంగా క్షేత్ర స్థాయిలో జరుగుతున్న పనుల తనిఖీలో భాగంగా గురువారం బీట్ మార్కెట్ సబ్ స్టేషన్ ను సందర్శించారు. అనంతరం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నల్గొండ జిల్లా విద్యుత్ అధికారు లతో సమావేశంలో పాల్గొన్నారు.ఈ సమావేశం అనంతరం తిప్పర్తి మండలం ఇందుగల సబ్ స్టేషన్ ను తనిఖీ చేశారు.నకిరేకల్ దగ్గర నిర్మితమవుతున్న ఆర్లగడ్డ గూడెం 33 కేవీ ఫీడర్ పనులను తనిఖీ చేశారు.నల్గొండ జిల్లాలో మొట్టమొదటిసారిగా విద్యుత్ డిమాండ్ 1000 మెగావాట్లుకు చేరిందని,ఈ నెల17న,1002 మెగా వాట్లు గా రికార్డు అయ్యిందని చెప్పారు.గత ఏడాది ఫిబ్రవరి 23 న 966 మెగావాట్లుగా నమోదయ్యిందని, నల్గొండ జిల్లాలో గృహ, వాణిజ్య, పారిశ్రామిక, వ్యవసాయం రంగాల్లో విద్యుత్ వినియోగం భారీగా పెరిగిందన్నారు.గత ఏడాది తో పోల్చుకుంటే ఈ ఏడాది నూతనంగా దాదాపు 20 వేల మంది వినియోగదారుల చేరారని, మొత్తం వినియోగదారులు 8.24 లక్షలకు చేరారని పేర్కొన్నారు. గృహ జ్యోతి పథకం కింద దాదాపు 2.37 లక్షల మంది గృహ వినియోగదారులు లబ్ది పొందుతున్నారు.ప్రస్తుతం 2.37 లక్షల వ్యవసాయ వినియోగదారులు ఉన్నారు. ఇంతకు ముందు కేవలం హైదరాబాద్ నగరానికే పరిమితమైన విద్యుత్ కాల్ సెంటర్1912 సదుపాయాన్ని జిల్లాలకు కూడా విస్తరించడం జరిగిందని చెప్పారు.విద్యుత్ అంతరాయాలను వెంటనే పరిష్కరించేందుకు గాను అంబులెన్స్ తరహా యి ర్ టి వాహనాలు ఏర్పాటు చేయడం జరిగిందని తెలియజేశారు.డిమాండ్ ఎంతగా పెరిగినా,ఓవర్ లోడింగ్ సమస్యలు గానీ,విద్యుత్ శాఖ పరంగా ఎలాంటి సమస్యలు లేకుండా ఉండేందుకు అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందని,యాసంగి,ఎండా కాలం ముగిసే వరకు అధికారులకు సిబ్బందికి ఎలాంటి సెలవులు మంజూరు చేయరాదని సిఎండి తెలిపారు.ఈ సీఎండి పర్యటనలో సంస్థ డైరెక్టర్ ఆపరేషన్ డాక్టర్ నరసింహులు,రూరల్ జోన్ చీఫ్ ఇంజనీర్బా లస్వామి,నల్గొండ జిల్లా నోడల్ అధికారి చీఫ్ ఇంజనీర్ బిక్షపతి,నల్గొండ జిల్లా సూపరింటెండింగ్ ఇంజనీర్ చంద్ర మోహన్,ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఇసుక అక్రమ రవాణా నిఘా తనిఖీలను తీవ్రతరం చేయాలి

**• కలెక్టర్ ఇలా త్రిపాఠి**

**నల్లగొండ బ్యూరో, ఫిబ్రవరి20, జనంసాక్షి :**
ఇసుక అక్రమ రవాణాను అరికట్టడంలో భాగంగా నిఘాను,తనిఖీలను తీవ్రతరం చేయాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు.ఇసుక అక్రమ రవాణాను అరికట్టే విషయమై గురువారం ఆమె జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ తో కలిసి తహసిల్దార్లు, ఎంపీడీవోలు, మైనింగ్,ఇరిగేషన్ ,పోలీస్ అధికారులతో ఉదయాదిత్య భవన్లో సమావేశం నిర్వహించారు.ప్రభుత్వం ద్వారా ఆయా ఇసుక రీచ్ లలో అనుమతించిన వాహనాలు, అనుమతించిన వారికి మాత్రమే ఇసుకను తీసుకువెళ్లే అధికారం ఉందని,అలా కాకుండా ఎవరైనా అక్రమంగా ఇసుకను రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకోవాలని చెప్పారు.ఇందుకు ఇసుక రీచ్ ల వద్ద నైట్ విజన్ కెమెరాలతో పాటు,హైరెజల్యూషన్ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. ముఖ్యమైన ఇసుక రీచుల వద్ద డ్రోన్ సర్వే సైతం చేయించడం జరుగుతుందన్నారు. పరిమితికి మించి ఇసుకను తవ్వినట్లయితే కఠినచర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. కొత్తగా గుర్తించిన ఇసుక రీచ్ లను ఎంపీడీవోలు,తహసిల్దారులు సంయుక్తంగా సందర్శించి వారంలోగా పూర్తి వివరాలతో నివేదిక ఇవ్వాలని తెలిపారు.జిల్లాలోని దేవరకొండ, మిర్యాలగూడ తదితర ప్రాంతాల నుండి కొన్ని ఇసుక రీచుల ద్వారా అనుమతితో,అలాగే అనుమతి లేకుండా ఇసుకను రవాణా చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, అలా జరగకుండా ఎంపీడీవో,తహసిల్దార్,పోలీస్, మైనింగ్ అధికారులందరూ సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. జిల్లాలో 24 రీచ్ లలో ఇసుకను తీసేందుకు అనుమతి ఇవ్వడం జరిగిందని, వాటిని బలోపేతం చేస్తామని,ఇందుకు పోలీసు సహకారం కావాలని జిల్లా ఎస్పీతో కోరారు. ప్రతి కొత్త రీచ్ ను ఎంపీడీవో ప్రత్యక్షంగా పరిశీలించాలని చెప్పారు.నది లోతట్టు ప్రాంతంలో ఇసుక తవ్వడానికి వీలులేదని ఈ సందర్భంగా ఆమె స్పష్టం చేశారు.ఇసుక అక్రమ రవాణాను గట్టిగా అరికట్టాలని, ఇందుకు సంబంధం ఉన్న ప్రతి శాఖ అధికారి గట్టి చర్యలు తీసుకోవాలని అన్నారు.ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో భాగంగా31గ్రామాలలో ఇండ్లు నిర్మించేందుకు అనుమతులు ఇవ్వడం జరిగిందని ,అనుమతించిన ఇండ్లకు మాత్రమే ఇసుకను మంజూరు చేయాలని,ఈ విషయంలో ఎంపీడీవోలు తహసిల్దార్లు పూర్తి కఠినంగా ఉండాలని,అలాగే గృహ నిర్మాణ శాఖ పీడీ సైతం ఈ విషయంపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని అన్నారు. శాంక్షన్ మంజూరు పత్రం ఇస్తేనే ఇసుక ఇవ్వాలని పునరుద్ఘాటించారు.ఇసుకకు సంబంధించి ఎక్కడ నిర్లక్ష్యంగా ఉండవద్దని,అన్ని చోట్ల సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, ఇసుక పై పత్రికలలో వచ్చే వ్యతిరేక వార్తలకు వెంటనే స్పందించాలని తెలిపారు.అనుమతించిన ఇసుక రీచ్ ల వద్ద, ముఖ్యంగా లోడింగ్ పాయింట్ల వద్ద సాయంత్రం 5 గంటల వరకు మాత్రమే ఇసుకను తవ్వేందుకు అనుమతి ఉంటుందని, సాయంత్రం 5 దాటిన తర్వాత ఎవరైనా లోడింగ్ పాయింట్ల వద్ద ఇసుకను తవ్వినట్లయితే కేసులు నమోదు చేస్తామని జిల్లా కలెక్టర్ హెచ్చరించారు. జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ మాట్లాడుతూ జిల్లాలో ఇసుక అక్రమ రవాణా అరికట్టేందుకు గాను గడచిన నాలుగు నెలల క్రితమే జాయింట్ టీం లను ఏర్పాటు చేయడం జరిగిందని,ఈ టీములన్ని మరోసారి గుర్తించిన ఇసుక రీచులన్నింటిని సందర్శించాలని అన్నారు.ఎక్కడ అనుమతి లేకుండా ఇసుక అక్రమ రవాణా అయ్యే అవకాశాన్ని కల్పించవద్దని ఆయన కోరారు. తహసిల్దారులు ఎక్కడైనా ఇసుకకు అనుమతులు ఇస్తే ఒక కాపీని పోలీస్ డిపార్ట్మెంట్ కు ఇవ్వాలని కోరారు.దేవరకొండ ఏసీపీ మౌనిక మాట్లాడుతూ ఇసుకను అక్రమంగా తీసుకు వెళ్లే వారికి అలా తీసుకువెళ్లకుండా కౌన్సిలింగ్ చేయాలని సూచించారు.అదనపు కలెక్టర్ జే .శ్రీనివాస్ మాట్లాడుతూ అందరి సహకారంతో ఇప్పటివరకు ఇసుక అక్రమ రవాణాను సమర్థవంతంగా అరికట్టగలిగామని,ఇకపై కూడా సంయుక్త బృందాలు సమన్వయంతో పని చేయాలని కోరారు.కొత్తగా గుర్తించిన ఇసుక రీచులను తక్షణమే సందర్శించి వివరాలు ఇవ్వాలని,రిజర్వాయర్ల నుండి ఇసుకను తీసుకు వెళ్లినప్పుడు అలాగే ఇసుక డంప్ చేసే ప్రాంతం వద్ద రిజిస్టర్లను నిర్వహిస్తే అక్రమ రవాణాను అరికట్టవచ్చు అని అన్నారు.మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, జిల్లా మైన్స్ శాఖ సహాయ సంచాలకులు జాకబ్, గృహ నిర్మాణ ప్రాజెక్టు డైరెక్టర్ రాజ్ కుమార్ తదితరులు మాట్లాడారు.డిఎస్పీలు, ఆర్డీవోలు,ఎంపీడీవోలు, తహసిల్దార్లు,ఇరిగేషన్ శాఖ అధికారులు ఈ సమావేశానికి హాజరయ్యారు.






## వరుసగా మూడో రోజూ నష్టాలు

### బ్యాంక్ షేర్లలో అమ్మకాలు డీలా



ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలతో ఉదయం నష్టాల్లో ప్రారంభమైన సూచీలు రోజంతా అదే ఒరవడి కొనసాగించాయి. దీంతో వరుసగా మూడో రోజూ నష్టాల్లో ముగిశాయి. అమెరికా అనుసరిస్తున్న టారిఫ్ పాలసీలు, దానివల్ల ద్రవ్యోల్బణం పెరుగుతుందన్న భయాలు మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. మన మార్కెట్‌లో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, ఐటీసీ, మారుతీ సుజుకీ షేర్లలో అమ్మకాలు సూచీలను కిందకు లాగాయి. స్మాల్, మిడ్‌క్యాప్ సూచీలు రాణించాయి. సెన్సెక్స్ ఉదయం 75,672.84 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 75,939.18) నష్టాల్లో ప్రారంభమయ్యాయి. రోజంతా అదే ఒరవడి కొనసాగింది. ఇంట్రాడేలో 75,463.01 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని తాకిన సూచీ చివరికి 203.22 పాయింట్ల నష్టంతో 75,735.96 వద్ద ముగిసింది. నిఫ్టీ 19.75 పాయింట్ల నష్టంతో 22,913.15 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 86.65గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, మారుతీ సుజుకీ, టెక్ మహీంద్రా, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, ఐటీసీ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. ఎన్టీపీసీ, మహీంద్రా అండ్ మహీంద్రా, అదానీ పోర్ట్స్, టాటా స్టీల్, టాటా మోటార్స్ షేర్లు లాభపడ్డాయి.

# ఎన్‌ఆర్‌ఐలకు పెద్దపీట

### భారత్‌లో పెట్టుబడులకు మెరుగైన మార్గాలు



ప్రవాస భారతీయులు భారత ఆర్థిక వ్యవస్థలో ఒక ప్రత్యేక స్థానాన్ని కలిగి ఉన్నారు. దేశం వెలుపల నివశిస్తున్నప్పటికీ, చాలా మంది ఎన్ఆర్ఐలు స్వదేశంతో బలమైన బంధాలను కలిగి ఉంటారు.అందుచేత, భారత్ కూడా వీరికి పెట్టుబడులకు సంబంధించి అనేక అవకాశాలను అందిస్తుంది. వీరి వ్యూహాత్మక పెట్టుబడులు భారతదేశ అభివృద్ధిని ముందుకు తీసుకెళ్లడంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నాయి. ఎన్ఆర్ఐ పెట్టుబడులు విదేశీ మూల ధనానికి కీలక వనరుగా పనిచేస్తున్నాయి. ఎన్ఆర్ఐలు భారత్‌లోని అనేక పథకాల్లో పెట్టుబడులు పెట్టడం వల్ల దేశ ఆర్థిక వ్యవస్థ పుంజుకుంటుంది. ప్రపంచంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థల్లో భారత్ ఒకటి. ఎన్ఆర్ఐలు భారత్‌లో ఎలాంటి పెట్టుబడి పథకాలను ఎంచుకోవచ్చో ఇక్కడ తెలుసుకుందాం.ఎన్ఆర్ఐలు తమ నిధులను భారత్‌లో పెట్టుబడి పెట్టడానికి కొన్ని దశలను అనుసరించాలి. వీరు బ్యాంకు ఖాతా తెరవడానికి ముందు తప్పనిసరిగా పాన్ కోసం దరఖాస్తు చేసుకోవాలి. ఎన్ఆర్ఐల పెట్టుబడుల్లో పాన్ కార్డు చాలా ముఖ్యం. భారత్‌లోని బ్యాంకులు..ఎన్ఆర్ఐలకు నాన్-రెసిడెంట్ ఎక్స్‌టర్నల్ లేదా నాన్-రెసిడెంట్ ఆర్డినరీ ఖాతాలను తెరవడానికి అనుమతిస్తాయి. ఒక్కో రకమైన ఖాతా ఒక్కో ప్రయోజనాన్ని అందిస్తోంది. ఎన్ఆర్ఈ ఖాతాలు విదేశీ కరెన్సీ క్రెడిట్‌ను మాత్రమే అనుమతిస్తాయి. ఎన్ఆర్ఐలు తమ ఆర్థిక అవసరాల ఆధారంగా ఏ రకమైన ఖాతాను తెరవాలో నిర్ణయించుకోవచ్చు.అధిక రాబడి కోసం చూస్తున్న ఎన్ఆర్ఐలకు మ్యూచువల్ ఫండ్లు ఒక ప్రముఖ ఎంపిక. పెట్టుబడులను స్వయంగా నిర్వహించాల్సిన అవసరం లేకుండా వైవిధ్యమైన మదుపును కోరుకునే ఎన్ఆర్ఐలకు మ్యూచువల్ ఫండ్లలో సిప్ మంచి ఎంపిక. భారత్‌లోని వివిధ అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీలు ఈక్విటీ ఫండ్లు, డెట్ ఫండ్లు, హైబ్రిడ్ ఫండ్లు, సెక్టార్-స్పెసిఫిక్ ఫండ్లతో సహా ఎన్ఆర్ఐల కోసం అనేక పథకాలను అందిస్తున్నాయి. అయితే, ఏదైనా వ్యక్తిగత ఫండ్‌లో పెట్టుబడి పెట్టే ముందు లాభ, నష్టాలను తనిఖీ చేయాలి. పెట్టుబడుల కోసం ఆర్థిక సలహాదారుడిని సంప్రదించడం మంచిది. రిస్క్ ఇష్టం లేని ఔఖీఎ పెట్టుబడిదారులకు భారతీయ బ్యాంకుల్లో ఫిక్స్‌డ్ డిపాజిట్లు సురక్షితమైన, స్థిరమైన పెట్టుబడి ఎంపిక. స్థిరమైన రాబడి పెట్టుబడి ఎంపికల కోసం ఎన్ఆర్ఐలు నాన్-రెసిడెంట్ ఎక్స్‌టర్నల్ లేదా నాన్-రెసిడెంట్ ఆర్డినరీ ఫిక్స్‌డ్ డిపాజిట్లను ఎంచుకోవచ్చు. ఔఖీఇ ఎఫ్‌డీలు భారత్‌లో పన్ను రహితం. ఎన్ఆర్ఓ ఎఫ్‌డీలపై పన్ను వర్తిస్తుంది. చాలా బ్యాంకులు ఈ ఎఫ్‌డీలపై 6.25-7% వడ్డీ రేట్లను ఆఫర్ చేస్తున్నాయి.భారతీయ స్టాక్ ఎక్స్ఛేంజీల జాబితాలో ఉన్న వ్యక్తిగత స్టాక్స్‌లో ఎన్ఆర్ఐలు నేరుగా పెట్టుబడి పెట్టడానికి అవకాశముంది. భారత స్టాక్ మార్కెట్‌లో నేరుగా పెట్టుబడి పెట్టడం అనేది రిస్క్ అయినప్పటికీ మార్కెట్ పరిస్థితులపై ఆసక్తి,అవగాహన ఉన్న ఎన్ఆర్ఐలకు లాభదాయకంగా ఉండొచ్చు. ఎన్ఆర్ఐలు పోర్ట్‌ఫోలియో ఇన్వెస్ట్‌మెంట్ స్కీం ఖాతా ద్వారా పబ్లిక్ లిస్టెడ్ కంపెనీల షేర్లను కొనుగోలు చేయొచ్చు. దీంతో పాటు ఇఈలు స్టాక్స్ ట్రేడబిలిటీతో విభిన్నతను అందిస్తాయి..వివిధ సూచీలు, రంగాలు, కమోడిటీస్ కోసం అందుబాటులో ఉంటాయి.ప్రభుత్వ బాండ్లు, సెక్యూరిటీలు ఎన్ఆర్ఐలకు స్థిరమైన పెట్టుబడి మార్గాన్ని అందిస్తాయి. మెచ్యూరిటీ సమయంలో అసలు మొత్తాన్ని తిరిగి అందిస్తాయి. ఎన్ఆర్ఐలు తమ రిస్క్‌ను బట్టి ప్రభుత్వ బాండ్లు లేదా కార్పొరేట్ బాండ్లలో పెట్టుబడి పెట్టొచ్చు. వీటిని మంచి రాబడితో తక్కువ రిస్క్ పెట్టుబడిగా పరిగణించొచ్చు. సంప్రదాయ ఎన్ఆర్ఐ పెట్టుబడిదారులకు ఇవి అనువైనవి. ఎన్ఆర్ఐలు పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు వివిధ బాండ్ల క్రెడిట్ రేటింగ్, వడ్డీ రేట్లను పరిగణనలోకి తీసుకోవాలి. ఎన్ఆర్ఐలు..పబ్లిక్ సెక్టార్ యూనిట్లు, క్యాపిటల్ బాండ్లలో పెట్టుబడి పెట్టొచ్చు. ఇంకా ప్రభుత్వ పన్ను రహిత ఎన్ఆర్ఐ బాండ్లు, ట్రెజరీ బాండ్లు, మున్సిపల్, జీరో కూపన్ బాండ్లు, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ బాండ్లలో కూడా పెట్టుబడి పెట్టొచ్చు.పెట్టుబడిదారుల నుంచి నిధులను సేకరించేందుకు వివిధ కార్పొరేషన్లు వీటిని జారీ చేస్తాయి. ఎన్ఆర్ఐలు..ఔఅఆల్లో పెట్టుబడి పెట్టి సాధారణ వడ్డీ ఆదాయాన్ని సంపాదించొచ్చు. సంప్రదాయ ఫిక్స్‌డ్ డిపాజిట్లతో పోలిస్తే వీటిలో అధిక రాబడిని పొందొచ్చు. ఔఅఆలు వేర్వేరు కాలవ్యవధుల్లో లభిస్తాయి. ఇవి వివిధ వడ్డీ చెల్లింపు ఎంపికలను అందిస్తాయి. అయితే, ఎన్ఆర్ఐలు..ఎన్‌సీడీల్లో పెట్టుబడి పెట్టే ముందు కంపెనీ క్రెడిట్ యోగ్యత, విశ్వసనీయతను జాగ్రత్తగా అంచనా వేయాలి. నేషనల్ పెన్షన్ సిస్టం అనేది భారతీయులకే కాకుండా ఎన్ఆర్ఐలకు కూడా అందుబాటులో ఉంది. పదవీ విరమణ వరకు లాక్-ఇన్ పీరియడ్ ఉన్న ఎన్‌పీఎస్ టైర్-1లో ఎన్ఆర్ఐలు పెట్టుబడి పెట్టొచ్చు. ఇది పన్ను ప్రయోజనంతో పదవీ విరమణ నిధిని కూడబెట్టుకునే అవకాశాన్ని అందిస్తుంది. ఎన్‌పీఎస్ పెట్టుబడులు..ఈక్విటీ, కార్పొరేట్ బాండ్లు, ప్రభుత్వ సెక్యూరిటీల్లో వైవిధ్యభరితంగా ఉంటాయి. రిస్క్, రాబడిని సమతుల్యం చేస్తాయి. ఎన్ఆర్ఐలు ఎన్‌పీఎస్‌లో క్రమబద్ధమైన ఉపసంహరణ ప్రణాళికను కూడా ఎంచుకోవచ్చు. ఎన్‌పీఎస్ నిధి ద్వారా యాన్యుటీని కొనుగోలు చేయొచ్చు. పదవీ విరమణ అనంతర జీవితాన్ని సురక్షితంగా గడపడానికి ఈ యాన్యుటీ ప్లాన్లు ఎన్ఆర్ఐలకు మెరుగైన ఆర్థిక వనరు అని చెప్పొచ్చు. అధిక మొత్తాల్లో పెట్టుబడి పెట్టాలనుకునే ఎన్ఆర్ఐలకు దేశీయ స్థిరాస్తి రంగం మంచి ఎంపిక. భారత్‌లో పెరుగుతున్న పట్టణీకరణ, నిరంతర అభివృద్ధితో భారత్‌లోని ప్రధాన నగరాల్లో ఆస్తి ధరలు పెరుగుతుంటాయి. ఎన్ఆర్ఐలు నివాస లేదా వాణిజ్య ఆస్తుల్లో పెట్టుబడి పెట్టొచ్చు. ప్రస్తుతం ఈ ఆస్తులు గణనీయమైన అద్దె రాబడిని అందిస్తున్నాయి.ఎన్ఆర్ఐలు పైన తెలిపిన పెట్టుబడులను ఎంచుకోవడం ద్వారా తమ సంపదను వృద్ధి చేసుకోవడమే కాకుండా స్వదేశ ఆర్థిక వృద్ధికి కూడా దోహదపడవచ్చు.

# అమెరికా టూ భారత్ వయా బెర్లిన్

### టెస్లా ఎంట్రీకి మార్గం సుగమం




**జనంసాక్షి:**అమెరికాకు చెందిన ఎలక్ట్రిక్ కార్ల తయారీ సంస్థ టెస్లా భారత మార్కెట్లోకి ప్రవేశించడం దాదాపు ఖరారైంది.ప్రపంచంలోని వివిధ దేశాల్లో కార్లు తయారుచేస్తున్న ఆ సంస్థ.. భారత్‌లో ప్లాంట్‌ను నెలకొల్పుతుందా? లేదా? అనే దానిపై ఇంకా స్పష్టత రావాల్సిఉంది. తొలుత దిగుమతి చేసిన మోడళ్లను దేశీయంగా విక్రయించాలని ఆ కంపెనీ భావిస్తోంది. వీటిని పొరుగునున్న చైనా నుంచి కాకుండా జర్మనీ రాజధాని బెర్లిన్‌లోని తమ అతిపెద్ద గిగా ఫ్యాక్టరీ నుంచి దిగుమతి చేసే అవకాశం ఉంది.విద్యుత్ కార్ల దిగుమతికి సంబంధించి గతేడాది మార్చిలో భారత ప్రభుత్వం కొత్త ఈవీ పాలసీని తీసుకొచ్చింది. దీనికింద రూ.4,150 కోట్ల పెట్టుబడికి హామీ ఇచ్చి 15 శాతం సుంకంతో ఏటా 8 వేల వాహనాలను దిగుమతి చేసుకోవచ్చు. దేశీయంగా తయారీలో స్థానికంగా ముడిసరకు సమకూర్చుకోవాలన్న నిబంధన కూడా ఉంది. ఈ పాలసీని వినియోగించుకొని భారత్‌లోకి ఎంట్రీ ఇవ్వాలని టెస్లా భావిస్తున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. మరోవైపు నిన్న మొన్నటివరకు దేశీయంగా మస్క్ విద్యుత్ కార్ల తయారీ ప్లాంట్ నెలకొల్పకపోవచ్చన్న ఊహాగానాలు వినిపించాయి. కానీ, తాజాగా అమెరికా అధ్యక్షుడు ట్రంపే స్వయంగా భారత్‌లో టెస్లా ప్లాంట్ ఏర్పాటు గురించి ప్రస్తావించడంతో అలాంటిదేమీ లేదని తేలింది.అమెరికాలో తయారైన కార్లకు లెఫ్ట్ హ్యాండ్ డ్రైవింగ్ ఉంటుంది.

## గూగుల్ పేలో బిల్లు పేమెంట్స్‌పై ఫీజు!




**దిల్లీ:** గూగుల్‌కు చెందిన పేమెంట్ యాప్ గూగుల్ పే విద్యుత్, గ్యాస్ వంటి బిల్ పేమెంట్లపైనా ఛార్జీలు వసూలు చేస్తోంది. ఇప్పటివరకు ఈతరహా లావాదేవీలపై ఎలాంటి ఫీజూ విధించేది కాదు. ఇక నుంచి క్రెడిట్ కార్డు, డెబిట్ కార్డు ద్వారా చేసే లావాదేవీలపై కన్వీనియన్స్ ఫీజు రూపంలో స్వల్ప మొత్తంలో రుసుము వసూలుచేసేందుకు సిద్ధమైంది. యూపీఐ లావాదేవీలకు మాత్రం ఈ ఛార్జీలు వర్తించవు. ఇతర పేమెంట్ ప్లాట్‌ఫామ్‌లైన పేటీఎం, ఫోన్‌పే సంస్థలు ఇప్పటికే ఈతరహా ఫీజును వసూలుచేస్తుండగా.. ఇన్నాళ్లూ ఉచితంగా అందించిన గూగుల్ పే సైతం ఇకనుంచి వాటి బాటలోనే నడవనుంది. గూగుల్‌పే మొబైల్ రీఛార్జీలపై రూ.3 కన్వీనియన్స్ ఫీజు రూపంలో గతేడాది నుంచి వసూలుచేస్తోంది. ఇకపై క్రెడిట్, డెబిట్ కార్డు ద్వారా చేసే విద్యుత్, గ్యాస్ బిల్ పేమెంట్లపై 0.5 శాతం నుంచి 1 శాతం వరకు ఛార్జీలు విధిస్తున్నట్లు తెలుస్తోంది. గూగుల్‌పేలో ఇటీవల క్రెడిట్ కార్డ్ ద్వారా విద్యుత్ బిల్లు చెల్లించిన ఓ యూజర్‌కు ఈ అనుభవం ఎదురైనట్లు ఓ ఆంగ్లమీడియా సంస్థ ఉదాహరణను ఉటంకించింది.

## ఎస్‌బీఐ బాటలోనే పీఎన్‌బీ




**దిల్లీ:** దాదాపు ఐదేళ్ల తర్వాత రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఇటీవల రెపో రేటును తగ్గించింది. దానికి అనుగుణంగా ఇప్పుడు బ్యాంకులు కూడా రుణ రేట్లను సవరిస్తున్నాయి.ఇటీవల స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వడ్డీరేట్లను తగ్గించగా.. ఇప్పుడు మరో ప్రభుత్వ బ్యాంకు పీఎన్‌బీ కూడా అదే నిర్ణయం తీసుకుంది. రిటైల్ రుణాలపై 25 బేసిస్ పాయింట్ల వరకు వడ్డీ రేట్లను తగ్గిస్తున్నట్లు పంజాబ్ నేషనల్ బ్యాంక్ గురువారం ప్రకటించింది. కొత్త వడ్డీ రేట్లు ఫిబ్రవరి 10 నుంచే అమల్లోకి తీసుకొచ్చినట్లు బ్యాంకు తాజా ప్రకటనలో వెల్లడించింది. గృహ రుణాలతో పాటు, కారు, ఎడ్యుకేషన్, పర్సనల్ లోన్లపై ఈ తగ్గింపు వర్తించనుంది. తాజా సవరణతో పీఎన్‌బీలో గృహ రుణాల ప్రారంభ రేటు 8.15శాతానికి దిగొచ్చింది. దీంతో రూ.లక్ష రుణానికి ఈఎంఐ రూ.744గా ఉంటుందని బ్యాంకు తెలిపింది.ఇక, ఆటోమొబైల్ రుణాలపై వడ్డీ రేటు 8.50 శాతం నుంచి ప్రారంభం కానుంది. విద్యా రుణాలపై కనిష్ఠ వడ్డీని 7.85 శాతానికి తగ్గించినట్లు పీఎన్‌బీ తెలిపింది. అటు వ్యక్తిగత రుణాలపై సవరించిన వడ్డీ రేటు 11.25శాతంగా ఉన్నట్లు పేర్కొంది. ఫిబ్రవరి 7న రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రెపో రేటును 6.50 శాతం నుంచి 25 బేసిస్ పాయింట్లు తగ్గించి 6.25 శాతానికి తగ్గించిన సంగతి తెలిసిందే.




## డెంగీ నివారణకు వినూత్న వ్యూహం

మనీలా: డెంగీ విజృంభణకు అడ్డుకట్ట వేసేందుకు ఫిలిప్పీన్స్ రాజధాని మనీలా సమీపంలోని ఓ గ్రామం వినూత్న వ్యూహం పన్నింది. గ్రామస్థులు ఎవరైనా అయిదు దోమలు (బతికున్నా, చనిపోయినా) లేదా దోమల లార్వాలను పట్టుకొని తీసుకొస్తే ఒక ఫిలిప్పీన్ పెసో (రూపాయిన్నర) బహుమతిగా ఇస్తామని బుధవారం ప్రకటించింది. ఫిలిప్పీన్స్‌లో ఈ ఏడాది ఫిబ్రవరి 1 వరకు 28,234 డెంగీ కేసులు నమోదైనట్లు ఇటీవల దేశ ఆరోగ్యశాఖ వెల్లడించింది. లక్షకు పైగా జనాభా ఉన్న అడిషన్ హిల్స్ పట్టణ గ్రామంలో డెంగీ జ్వరం సోకి ఇటీవల ఇద్దరు విద్యార్థులు మృతిచెందడంతో గ్రామ నాయకుడు కార్లిటో దోమలపై యుద్ధం ప్రకటించారు. దోమలు తీసుకొస్తే డబ్బులిస్తామని ప్రచారం చేయడంతో ఆ గ్రామంలో ఇప్పుడు డజన్లకొద్దీ దోమల వేటగాళ్లు బయలుదేరారు.

# మరీ ఇంత ఆలస్యమా?

### ఎయిర్‌ఫోర్స్ వన్‌ల నిర్మాణంపై ట్రంప్ అసంతృప్తి




**జనంసాక్షి:**బోయింగ్ సంస్థ సరికొత్త ఎయిర్‌ఫోర్స్ వన్‌ల నిర్మాణం మరీ నెమ్మదిగా పని చేస్తోందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆగ్రహం వ్యక్తంచేశారు. దీనికి ఓ పరిష్కారం చూపాలని ఆయన ఎలాన్ మస్క్‌కు సూచించారు. ఇప్పటికీ తాను పాత, గత అధ్యక్షులు వాడిన విమానాల్లోనే ప్రయాణించడంపై అసంతృప్తి వ్యక్తంచేశారు.అమెరికా అధ్యక్షుడి శక్తికి చిహ్నంగా ఎయిర్‌ఫోర్స్ వన్‌ను చూస్తారు. ప్రస్తుతం బోయింగ్ 737 మోడల్‌కు చెందిన విమానాలను వాడుతున్నారు. ఇవి 30 ఏళ్ల నాటివి. నిరంతరం వీటికి సర్వీసులు అవసరమవుతున్నాయి. వాస్తవానికి 2024లోనే అధ్యక్షుడికి రెండు సరికొత్త ఎయిర్ ఫోర్స్‌వన్‌లను బోయింగ్ అందించాల్సి ఉంది. 4.3 బిలియన్ డాలర్ల విలువైన ఈ కాంట్రాక్ట్‌కు సంబంధించి 3.5 బిలియన్ డాలర్లను ఇప్పటికే శ్వేతసౌధం చెల్లించింది. కానీ, ఈ ప్రాజెక్టుపై కంపెనీ ఇప్పటికే 2.4 బిలియన్ డాలర్ల నష్టంతో పనిచేస్తోంది. ట్రంప్ తొలివిడత పాలన సమయంలో కూడా ఎయిర్ ఫోర్స్ వన్ డెలివరీల్లో జాప్యం చోటుచేసుకొంది. ఈనేపథ్యంలో 2018లో బోయింగ్‌తో ఓ ఒప్పందం చేసుకొన్నారు.వాస్తవానికి ఎలాన్ మస్క్ ఈ అంశంపై మిలిటరీ, శ్వేతసౌధం, బోయింగ్‌లను సంప్రదించారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన ఉద్యోగులకు అవసరమైన భద్రతాపరమైన క్లియరెన్స్ తగ్గించాలని సూచించారు. ఇప్పటివరకు దీనికోసం పనిచేసే ఉద్యోగులకు టాప్‌లెవల్ యాంకీవైట్ క్లియరెన్స్ తప్పనిసరి. సాధారణంగా దేశాధ్యక్షుడు, ఉపాధ్యక్షుడిని కలిసేందుకు ఈ స్థాయి అనుమతులు ఉండాలి. ఎయిర్‌ఫోర్స్ వన్ ప్రాజెక్టే కాకుండా మిగిలిన అంశాల్లో కూడా బోయింగ్ తీవ్రమైన ఇబ్బందుల్లో ఉంది. ఈ సంస్థ కొన్నేళ్లుగా నష్టాల్లో ఉండటమే కాదు.. భద్రతాపరమైన సవాళ్లను కూడా ఎదుర్కొంటోంది. ఈ విషయంలో ట్రంప్ తరచూ బోయింగ్‌ను తప్పుపడుతూనే ఉన్నారు. దీనికితోడు ట్రంప్ రీ ఎలక్షన్ అయిన నాటినుంచి బోయింగ్ సీఈవో కెల్లీ ఓర్ట్‌బెర్గ్‌తో పలుమార్లు ఫోన్‌లో మాట్లాడారు. ఇటీవల కెల్లీ మాట్లాడుతూ "అధ్యక్షుడు త్వరగా విమానం కావాలని అడుగుతున్నారు. అందుకోసం మేము ఏం చేయగలం అనే అంశంపై ఎలాన్ మస్క్‌తో కలిసి పనిచేస్తున్నాం" అని వెల్లడించారు.నీలి, తెలుపు వర్ణాలతో ఉండే అమెరికా అధ్యక్ష విమానం అంటే ప్రపంచవ్యాప్తంగా విపరీతమైన ఆసక్తి ఉంటుంది. దీనిని ఎగిరే శ్వేతసౌధంగా అభివర్ణిస్తారు. ఇందులో అత్యాధునిక రక్షణ వ్యవస్థలు ఉంటాయి. సీక్రెట్ సర్వీస్ సిబ్బంది ఎప్పుడూ కంటికిరెప్పలా కాపాడుతుంటారు. అణ్వస్త్ర పేలుడు కారణంగా వచ్చే కొన్నిరకాల తరంగాలను కూడా ఇది తట్టుకోగలదు. శత్రుదేశ క్షిపణులను గుర్తించి.. వాటిని తప్పుదోవ పట్టించే రాడార్లు కూడా దీనిలో ఉంటాయి.




## హిమాలయాలకు వెళుతున్నారా?

### పవన్‌తో మోదీ సరదా సంభాషణ



దిల్లీ ముఖ్యమంత్రిగా రేఖా గుప్తా ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఓ సరదా సన్నివేశం చోటుచేసుకుంది. ప్రధాని మోదీ, జనసేన అధినేత పవన్ కల్యాణ్ సరదాగా మాట్లాడుకున్నారు.ఏపీ డిప్యూటీ సీఎం ఆహార్యాన్ని చూసిన మోదీ.. హిమాలయాలకు వెళుతున్నారా పవన్..? అని ప్రశ్నించారు. దాంతో అక్కడున్న నేతలంతా చిరునవ్వులు చిందించారు. ఈ సంభాషణ గురించి పవన్ తర్వాత మీడియాకు వెల్లడించారు.ఈ రోజు దిల్లీలో జరిగిన రేఖా గుప్తా ప్రమాణస్వీకార కార్యక్రమానికి ప్రధానిమోదీ, భాజపా అగ్రనేతలు, ఎన్డీయే కూటమి నాయకులు హాజరయ్యారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మహారాష్ట్ర డిప్యూటీ సీఎం ఏక్‌నాథ్ శిందే సహా పలువురు నాయకులను మోదీ పలకరించారు. ఈ కార్యక్రమానికి గంధం రంగులో ఉన్న సంప్రదాయ దుస్తుల్లో పవన్ కల్యాణ్ వచ్చారు. వాటి గురించి మోదీకి తనకు మధ్య జరిగిన సంభాషణను ఆయన వెల్లడించారు. "నాతో ప్రధాని ఎప్పుడు మాట్లాడినా సరదాగా జోకులేస్తుంటారు. ఈ రోజు నా ఆహార్యం గురించి మాట్లాడారు. అన్నీ వదిలేసి హిమాలయాలకు వెళుతున్నారా..?" అని అడిగారు. ఎక్కడికీ వెళ్లడం లేదని, చేయాల్సిన పని చాలా ఉందని తాను వెంటనే బదులిచ్చినట్లు చెప్పారు. హిమాలయాలకు ఇంకా సమయం ఉందన్నట్టుగా మీడియాతో సరదాగా మాట్లాడారు.ప్రధాని గతంలోనూ పవన్ కల్యాణ్‌ను ఉద్దేశించి ప్రత్యేకంగా మాట్లాడారు. గత ఏడాది సార్వత్రిక, ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల విజయాలతో కూటమి లోక్‌సభా పక్షనేతగా ఎన్నికైన అనంతరం మోదీ మాట్లాడుతూ.. " ఏపీలో దక్కిన విజయం ప్రజల ఆకాంక్షలకు అద్దం పట్టింది. చంద్రబాబుతో కలిసి చరిత్రాత్మక విజయం సాధించాం. ఇక్కడ కూర్చుకున్న వ్యక్తి పవన్ కాదు తుపాను" అని కొనియాడారు.

# ఐరోపా నుంచి అమెరికా దళాలు వెనక్కి..!



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రష్యాకు అనుకూలంగా మరో కీలక నిర్ణయం తీసుకోబోతున్నట్లు కథనాలు వెలువడుతున్నాయి. ఈ మేరకు జర్మనీ పత్రిక బిల్డ్ కథనం ప్రచురించింది.దీని ప్రకారం 1990 తర్వాత నాటోలో చేరిన దేశాల్లో ఉన్న అమెరికా సేనలను వెనక్కి పిలిపించాలని ట్రంప్ సర్కారు భావిస్తోంది. దీంతో అల్బానియా, బల్గేరియా, క్రొయేషియా, ఎస్తోనియా, ఫిన్లాండ్, హంగేరీ, లాత్వియా, లిథువేనియా, మాంటెనెగ్రో, నార్త్ మెసిడోనియా, పోలాండ్, రొమానియా, స్లొవేకియా, స్లొవేనియా, స్వీడన్‌ల నుంచి దళాలు వెనక్కి వచ్చే అవకాశాలున్నాయి. వీటితోపాటు ఇటలీ, కొసావో నుంచి అమెరికా దళాలు వైదొలిగే అవకాశాలున్నాయి.ముఖ్యంగా బాల్టిక్ దేశాల నుంచి దళాలను వెనక్కి రప్పించడంపై ట్రంప్ సానుకూలంగా స్పందించొచ్చని అధికార వర్గాలు నమ్ముతున్నాయని ఫైనాన్షియల్ టైమ్స్ పత్రిక పేర్కొంది. దీనిపై లిథువేనియా అధ్యక్షుడు స్పందిస్తూ అమెరికా-ఐరోపా సైనిక సహకారం భవిష్యత్తుపై చర్చలు జరుగుతున్నట్లు వెల్లడించారు. అమెరికా దళాలను వెనక్కి తీసుకొంటుందనే సంకేతాలు ఇప్పటివరకు లేవన్నారు. తూర్పు ఐరోపాలోని పోలండ్‌లో అమెరికా దళాలు అత్యధికంగా ఉన్నాయి. వీరి సంఖ్య 10,000కు పైగా ఉండొచ్చు.రష్యా-ఉక్రెయిన్ యుద్ధాన్ని ఎట్టి పరిస్థితుల్లో ముగించేలా ట్రంప్ హడావుడిగా చర్యలు చేపట్టారు. కాస్త భూమితో పోయేదాన్ని యుద్ధం వరకూ తీసుకొచ్చారని జెలెన్‌స్కీనే ట్రంప్ నిందించారు. ఈక్రమంలో తాజాగా తూర్పు ఐరోపా నుంచి సేనల విరమణ కూడా రష్యాకు సానుకూలాంశం అవుతుంది.పెంటగాన్ డిఫెన్స్ బడ్జెట్‌ను తగ్గించుకోవాలని అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సే ఆదేశాలు జారీ చేశారు. ఏటా 8శాతం చొప్పున తగ్గించుకొంటూ రావాలని పేర్కొన్నారు. ఈ కోతలను ఫిబ్రవరి 24 నాటికి సిద్ధం చేయాలని వెల్లడించారు. బడ్జెట్ తగ్గింపుల నుంచి 17 విభాగాలకు మాత్రమే మినహాయింపు ఇచ్చారు. వీటిల్లో అణ్వాయుధాలు, అమెరికా దక్షిణ సరిహద్దుల్లో కార్యకలాపాలు, మిసైల్ డిఫెన్స్ ప్రోగ్రామ్‌లు వంటివి ఉన్నాయి. గతేడాది అమెరికా 850 బిలియన్ డాలర్లను రక్షణ కోసం వెచ్చించింది. 2030 నాటికి దీనిలో 300 బిలియన్ డాలర్లను తగ్గించాలని హెగ్సే లక్ష్యంగా పెట్టుకొన్నారు.

## భాజపా ఎంపీ బాన్సురీ స్వరాజ్‌కు ఊరట

**దిల్లీ:** క్రిమినల్ పరువు నష్టం కేసులో దిల్లీ భాజపా ఎంపీ బాన్సురీ స్వరాజ్‌కు ఉపశమనం లభించింది. ఆప్ సీనియర్ నేత, మాజీ మంత్రి సత్యేందర్ జైన్ ఆమెపై దాఖలు చేసిన పరువు నష్టం పిటిషన్‌ను దిల్లీ కోర్టు గురువారం కొట్టివేసింది.ఈ అంశాన్ని పరిగణనలోకి తీసుకొనేందుకు నిరాకరించిన అదనపు చీఫ్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ నేహా మిత్తల్ పిటిషన్‌ను కొట్టివేశారు.ఓ టీవీ ఇంటర్వ్యూలో బాన్సురీ స్వరాజ్ తన పరువుకు నష్టం కలిగించేలా మాట్లాడారని, ఆ ఇంటర్వ్యూను లక్షలాది మంది చూశారని జైన్ ఫిర్యాదు చేశారు. తన ఇంటి నుంచి రూ.3 కోట్లు నగదు, 1.8 కిలోల బంగారం, 133 బంగారు నాణేలు అధికారులు రికవరీ చేసుకున్నట్లుగా బాన్సురీ స్వరాజ్ తప్పుడు ఆరోపణలు చేశారని పేర్కొన్నారు. తన ప్రతిష్ఠకు భంగం కలిగించడం ద్వారా రాజకీయంగా ప్రయోజనం పొందాలనే ఉద్దేశంతో తనను అవినీతిపరుడు, మోసగాడు అని ఆరోపించారని పిటిషన్‌లో పేర్కొన్నారు.

## ఇండియా గాట్ లేటెంట్ ఎఫెక్ట్

### అందరినీ అన్‌ఫాలో చేసిన అపూర్వ



సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్ అపూర్వ ముఖిజ ఇన్‌స్టాగ్రామ్‌లో అందరినీ అన్‌ఫాలో చేసింది. ది రెబల్ కిడ్ పేరుతో ఆమె బాగా పాపులర్ అయింది.ఇండియా గాట్ లేటెంట్ కార్యక్రమంలో అసభ్యకర వ్యాఖ్యలతో పాడ్‌కాస్టర్ రణ్‌వీర్ అల్హాబాదియా చుట్టూ వివాదం ముసురుకొన్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకొంది. దీనిపై నమోదైన కేసులో అపూర్వ పేరును కూడా చేర్చారు. దీనిలో యూట్యూబర్ సమయ్ రైనా ఇతరులు కూడా ఉన్నారు. తాజాగా దానిపై వివాదం చెలరేగడంతో.. ఈ ఏడాది మార్చి 8-9 తేదీల్లో జైపుర్‌లో జరగాల్సిన ఐఐఎఫ్ఏ కార్యక్రమ ప్రమోటర్ల లిస్ట్ నుంచి అపూర్వ పేరును తొలగించారు.అపూర్వకు ఇన్‌స్టాలో దాదాపు 29 లక్షల మంది ఫాలోవర్లు ఉన్నారు. ఆమె ఇటీవల వరకు 1,500 అకౌంట్లను ఫాలో అయ్యేవారు. కానీ, తాజాగా వారందరిని అన్‌ఫాలో చేసింది. ఆమె ఏమాత్రం సంకోచించకుండా మాట్లాడటం, వివాదాస్పద అభిప్రాయాలు చెప్పడంతో ఆమె సోషల్ మీడియాలో బాగా పాపులర్ అయింది. కొవిడ్ వ్యాప్తి సమయంలో ఆమె యూట్యూబ్ స్కిట్స్ కూడా ఆదరణ పొందాయి. ఇటీవల సమయ్ రైనా యూట్యూబ్‌లో నిర్వహించిన ఇండియా గాట్ లేటెంట్‌కు ఆశీష్ చంచలానీ, రణ్‌వీర్ అల్హాబాదియా, జస్ప్రీత్ సింగ్ తదితరులతో కలిసి హాజరైంది.

జనంసాక్షి www.janamsakshi.org
శుక్రవారం 21 ఫిబ్రవరి 2025

# సేవ చేస్తా..అవకాశం ఇవ్వండి..

- పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి శేఖర్ రావు



**కరీంనగర్ బ్యూరో, హుజురాబాద్, ఫిబ్రవరి 20 (జనంసాక్షి) :** ఉన్న డబ్బును కాపాడుకోవడానికో ఆస్తులు పెంచుకోవడానికి ఎమ్మెల్సీగా పోటీ చేయడం లేదని సేవ చేయడానికి ముందుకు వచ్చానని ఆశీర్వదించండి అని కరీంనగర్ మెదక్ నిజామాబాద్ అదిలాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి యాదగిరి శేఖర్ రావు అన్నారు. గురువారం హుజురాబాద్ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో వాకర్స్‌తో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక క్యాపిటల్ మ్యానుకు, కామన్ మ్యాన్ కు మధ్య జరుగుతుందని అన్నారు. కొంతమంది తాము సంపాదించిన కోట్లాది డబ్బుకు రక్షణ కల్పించడం కోసం రాజకీయాల్లోకి వచ్చి పోటీ చేస్తున్నారని మరికొందరు సేవా దృక్పథంతో పోటీ చేస్తున్నారని అన్నారు. పట్టభద్రులు ప్రజలు వాస్తవాలు గ్రహించి నిజాయితీపరుడికి సేవ గుణం ఉన్నవాడిని ఎన్నుకోవాలని కోరారు. సంపాదించిన డబ్బును విచ్చలవిడిగా ఖర్చు పెడుతూ ఎన్నికలను కలుషితం చేస్తున్న అభ్యర్థులకు తగిన గుణపాఠం చెప్పాలని అన్నారు. సేవ లక్ష్యంతో ముందుకు వస్తున్న తనకు అనేకమంది స్వచ్ఛందంగా ముందుకు వచ్చి మద్దతు పలుకుతున్నారని ఇది శుభ పరిణామం అని కొంతమంది వ్యక్తుల వల్ల రాజకీయాలంటేనే డబ్బు మయమనే అభిప్రాయం ప్రజల్లో నాటు కోల్పోయిందని దీన్ని మార్చడానికి తాను ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్నానని అన్నారు. రాష్ట్రంలో ఉన్న వందలాది ట్రస్మా సంఘంలోని పాఠశాలలన్నీ తనకు మద్దతు ప్రకటిస్తున్నాయని గత కరోనా సమయంలో ప్రవేటు పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయులకు 25 కిలోల బియ్యం రెండు వేల రూపాయల నగదు ప్రభుత్వం నుండి తాను ఇప్పించిన విషయం ప్రైవేటు పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయులు మరిచిపోలేదని ఎక్కడికి వెళ్లినా తనకు గుర్తు చేస్తున్నారని చేసిన మేలు గుర్తుంచుకుంటామని చెబుతున్నారని అన్నారు. తాను ఎమ్మెల్సీగా విజయం సాధిస్తే తనకు వచ్చే జీతాన్ని ప్రతినెల ఒక్కొక్క ప్రాంతానికి ఒక్కొక్క అభివృద్ధి కోసం కేటాయించడం జరుగుతుందని దీనిని బాండ్ పేపర్లో రాసి ఇచ్చానని అన్నారు. స్వచ్ఛమైన రాజకీయాలకు ఆరోగ్యకరమైన పోటీకి చిరునామాగా నేనున్నానని పట్టభద్రులు నమ్మకంతో గెలిపించాలని కోరారు. అనంతరం జమ్మికుంట రోడ్డు బస్టాండ్ కరీంనగర్ రోడ్డు లోని పలు ప్రాంతాల్లో ఆయన పర్యటించి ప్రచార నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ట్రస్మా మండల అధ్యక్షులు వి వెంకటేశ్వర్లు, బద్దుల రాజకుమార్, పారెడ్డి రవీందర్ రెడ్డి, దాసరి కోటేశ్వర్ విన్సెంట్ జార్జ్, షాజు తామస్, మాడిశెట్టి ప్రసాద్, ఏనుగు మహిపాల్ రెడ్డి, తౌటం గోపాల్ విజయపాల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## మద్యం మత్తులో భార్యను గొడ్డలితో నరికి చంపిన భర్త



**కంగ్టి, ఫిబ్రవరి 20 (జనం సాక్షి) :** భార్యను గొడ్డలితో కిరాతకంగా నరికిచంపిన ఘటన కంగ్టి మండలం తుర్కవడగామ గ్రామంలో బుధవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. కంగ్టి ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. తుర్కవడగామ గ్రామానికి చెందిన చంద్రమ్మ (45) కూలి పనిచేసి కాలం వెల్లదీస్తుంది. బుధవారం అర్ధరాత్రి భర్త గుండప్ప మద్యం సేవించి వచ్చి భార్య చంద్రమ్మతో గొడవ పెట్టుకున్నాడు. మాటమాట పెరగడంతో ఇంట్లో ఉన్న గొడ్డలితో భార్య చంద్రమ్మను అతికిరాతకంగా నరికి చంపాడు. ఈ విషయం గురువారం తెల్లవారుజామున ఇరుగుపొరుగువారికి తెలియడంతో వెంటనే సంబంధిత పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించడంతో వెంటనే పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని గుండప్పను అదుపులోకి తీసుకున్నారు. గతకొన్ని సంవత్సరాల నుంచి వీరిద్దరి మధ్య తరుచుగొడవలు జరిగేవని గ్రామస్తులు తెలుపుతున్నారు. చంద్రమ్మ మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం నారాయణఖేడ్ ఆసుపత్రికి తరిలించారు. గుండప్పపై కేసునమోదు చేసి దర్యాప్తు చేయనున్నట్లు వెల్లడించారు. వీరికి ఇద్దరు కూతుళ్లు, ఇద్దరు కొడుకులు ఉన్నారు.

## భారమని భావించి హత్య చేశారు

- నిందితులను రిమాండ్ కు తరలింపు



**పాపన్నపేట, ఫిబ్రవరి 20 (జనంసాక్షి) :** బాచారం గ్రామంలో ఇటీవల కర్రెల ఆశయ్య ఇంట్లో మరణించాడు. మెదక్ రూరల్ సీఐ రాజశేఖర్ రెడ్డి పాపన్నపేట ఠాణాలో గురువారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.శివయ్య ఈ నెల 15 వ తేదీ నాడు వారి పొలం వద్ద పడ్డాడు.నడుము కు గాయాలయ్యాయి.వైద్యానికి ఖర్చు,సేవ చేయడానికి భార్య ఇష్టపడలేదు.దీంతో ఆశయ్య భార్య శివమ్మ,అల్లుడు రమేష్ తో కలిసి ఈ నెల 17 తేదీ అర్ధరాత్రి ఆశయ్య గొంతు టవల్ తో బిగించి హత్య చేశారు.హత్యలో భాగమైన ఇద్దరు నిందితులని గురువారం రిమాండ్ కు పంపుతున్నట్లు సిఐ వెల్లడించారు.

## భారతదేశాన్ని అమెరికాకు తాకట్టు పెడుతున్న మోడీ

- కూనంనేని సాంబశివరావు



**కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 20 (జనం సాక్షి) :** భారతదేశ ప్రతిష్టను ప్రధాని మోడీ అమెరికాకు తాకట్టు పెడుతున్నాడని రాష్ట్ర సిపిఐ కార్యదర్శి కూనంనేని సాంబశివరావు విమర్శించారు. గురువారం షాపూర్ నగర్ లోని ఏఐటీయూసీ పొట్లూరి నాగేశ్వరరావు భవన్ లో సిపిఐ కుత్బుల్లాపూర్ కార్యదర్శి ఉమామహేశ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన మేడ్చల్ జిల్లా కౌన్సిల్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయంలో జెండా ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారతదేశాన్ని లూటీ చేసిన ఆదానిపై అమెరికాలో నమోదైన కేసుల నుండి తప్పించడానికి మోడీ ట్రంప్ తో సమావేశం అయ్యాడని విమర్శించారు. మోడీ, ట్రంప్ కౌగిలి ధృతరాష్ట్ర కౌగిలిగా మారింది అన్నారు. సిపిఐ పోరాటం వలన జగద్గిరిగుట్ట ప్రాంతంలో దాదాపు 25వేల కుటుంబాలకు ఇళ్ల స్థలాలను పంపిణీ చేసిన ఘనత తమ పార్టీదే అన్నారు. కుత్బుల్లాపూర్ ప్రాంతంలో మెడికల్ కాలేజీ ఏర్పాటు తమ పోరాట ఫలితమేనని గుర్తు చేశారు. గాజుల రామారంలో అన్యాక్రాంతమవుతున్న ప్రభుత్వ భూములు, చెరువుల పరిరక్షణ కోసం తమ పోరాటం కొనసాగుతుందన్నారు. కాంగ్రెస్, టిఆర్ఎస్ లు రెండు ప్రభుత్వాలలో తెలంగాణ రాష్ట్రానికి ఒరిగిందేమీ లేదని ఆయన విమర్శించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కామ్రేడ్ వీఎస్ బోస్, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు కామ్రేడ్ యూసుఫ్, జిల్లా కార్యదర్శి సాయిలు గౌడ్, ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఏసురత్నం, జిల్లా సహాయ కార్యదర్శి జి దామోదర్ రెడ్డి, కార్యవర్గ సభ్యులు హరినాథ్ రావు, స్వామి, శంకర్, వెంకట్ రెడ్డి, ధర్మేంద్ర, లక్ష్మి, సత్య ప్రసాద్, ఈశ్వర్, జయచంద్ర, లక్ష్మీనారాయణ, సహదేవ్, ప్రమీల, మాధవి తదితరులు పాల్గొన్నారు.

## మాధవానికుంట హైడ్రా అధికారుల పరిశీలన



**శంషాబాద్, ఫిబ్రవరి 20 (జనంసాక్షి) :** శంషాబాద్ మున్సిపాలిటీ పరిధి గొల్లపల్లి రెవెన్యూ పరిధిలో ఇరిగేషన్ అధికారి ఏఈ మౌనిక హైడ్రా సీఐ తిరుమలేష్ తో కలిసి శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం సమీపంలోని మాధవానికుంటను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కుంట ఉన్నట్టు ఆనవాళ్లు కనిపిస్తున్నాయి. మాధవాని కుంట పై దర్యాప్తు చేపట్టి పూర్తి సమాచారాన్ని రాబడిన తర్వాతే స్పందిస్తామన్నారు. అధికారులు రావడానికి గమనించిన గణేష్, స్వామి, స్థానిక ప్రజలు ఇరిగేషన్ హైడ్రాధికారులకు గత 20 సంవత్సరాల క్రితం మాధవానికుంట ఉండేదన్నారు. శిఖం భూమి దీని విస్తీర్ణం 16,ఎకారల 22 గుంటల భూమిని ఉందని గొల్లపల్లి గ్రామస్తులు ఇరిగేషన్ హైడ్రా అధికారులకు గురువారం మొరపెట్టుకున్నారు. గ్రామస్తులు మాట్లాడుతూ చిన్నప్పుడు నుండి మాదావాని కుంటలో పశువులకు నీళ్లు తాపుకేళ్ళే వాళ్ళం, 16 ఎకరాల 22 గుంటల భూమి ఉండేది. ఇందులో సగం భూమి ఎయిర్పోర్ట్లో పోయింది. మిగతా ఎనిమిది ఎకరాల భూమిని ఒక వ్యక్తి ఆధీనంలోకి తీసుకొని వ్యవసాయం చేస్తున్నారు. పలుమార్లు స్థానిక కార్యాలయాల చుట్టూ తిరిగి అలసిపోయామన్నారు. పూర్తి రికార్డులు తమ వద్ద ఉన్నాయి ఇరిగేషన్ హైడ్రా అధికారులకు హైడ్రా కార్యాలయంలో రికార్డులు అప్పజెప్తామన్నారు. 2006లో సాటిలైట్ రికార్డులను పరిశీలించిన తర్వాతే మాధవానికుంట పై హైడ్రా సీఐ తిరుమలేష్ స్పందిస్తామన్నారు.

## ఎస్ఎస్‌వీ రెస్టారెంట్‌లో ప్రమాదవశాత్తు మంటలు

- 50 శాతం దగ్ధమైన రెస్టారెంట్
- రూ.50 లక్షల మేర ఆస్థి నష్టం



**న్యాల్‌కల్, ఫిబ్రవరి 20 (జనం సాక్షి) :** ప్రమాదవశాత్తు జరిగిన అగ్ని ప్రమాదంలో దాదాపు రూ:50 లక్షల మేర ఆస్థి నష్టం వాటిల్లిన ఘటన సంగారెడ్డి జిల్లా, న్యాల్ కల్ మండలం, మామిడిగి గ్రామ శివారులో బుధవారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. రెస్టారెంట్ నిర్వాహకులు, ఘటనా స్థలంలోని స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జహీరాబాద్ - బీదర్ రోడ్డు, మండలంలోని మామిడిగి గ్రామ శివారులోని ఎస్ ఎస్ వి రెస్టారెంట్లోలో మధ్యాహ్నం ఉన్నట్టుండి మంటలు ఏర్పడ్డాయి. రెస్టారెంట్ సమీపంలోని ఓ వ్యవసాయ పొలం ఒరం (ఎండు గరక) పై మంటలు ఏర్పడ్డాయి. వేగంగా వస్తున్న మంటలు ఉన్నట్లుండి సమీపంలోని రెస్టారెంట్లోకి మంటలు చేరాయి. భారీ మంటలకు విద్యుత్ తీగలు తోడవడంతో చూస్తూ చూస్తుండగానే దాదాపు 50 శాతానికి పైగా రెస్టారెంట్ దగ్ధమైంది. రెస్టారెంట్ లోని నిర్వాహకులు, కార్మికులు, తదితరులు భయ భ్రాంతులతో పరుగులు తీశారు. పలువురికి తృటిలో ప్రాణాపాయం తప్పడంతో ఊపిరి పీల్చుకున్నారు. ఆవరణలో ఉన్న ఓ ద్విచక్ర వాహనం పూర్తిగా దగ్ధమైంది. రెస్టారెంట్లోని రూ:50 లక్షల విలువ చేసే వివిధ రకాల సామాగ్రి కాలి బూడిదయ్యాయి. జహీరాబాద్ అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వగా.. అగ్నిమాపక అధికారులు వచ్చి కొంతమేరకు మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. ఆ పాటికే తీవ్రంగా నష్టం వాటిల్లిందని బాధితులు వాపోయారు.

## విద్యార్థులతో వంటలు చేయిస్తున్న వసతిగృహ సిబ్బంది

- వార్డెన్ గైరాజర్‌తో వంటలు నిమగ్నమైన విద్యార్థులు
- కంగ్టి ట్రైబల్ వెల్ఫేర్ గురుకుల వసతి గృహంలో సంఘటన
- విద్యార్థులతో పని చేయించడంపై కలెక్టర్ సీరియస్
- నారాయణఖేడ్ ఆర్‌డిఓకు విచారణకు ఆదేశం



**సంగారెడ్డి ప్రతినిధి, ఫిబ్రవరి 20 (జనం సాక్షి) :** నారాయణఖేడ్ నియోజకవర్గంలోని కంగ్టి ట్రైబల్ వెల్ఫేర్ కళాశాల వసతి గృహంలో వార్డెన్ తరచూ గైర్హాజరు అవుతుండడంతో విద్యార్థులే వంటలు చేస్తున్నారు. విషయం కలెక్టర్ దృష్టికి వెళ్లడంతో విద్యార్థులతో పని చేయించిన ఘటనపై సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి స్పందించారు. విద్యార్థులతో పనిచేయిస్తున్న సిబ్బందిపై కలెక్టర్ క్రాంతి ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులతో పని చేయించిన ఘటనకు సంబంధించి విచారణ జరిపి నివేదిక సమర్పించాలని నారాయణఖేడ్ ఆర్‌డిఓ అశోక్ చక్రవర్తి ని ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాలతో ఆర్డిఓ గురువారం కంగ్టి ట్రైబల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాల కళాశాల వసతి గృహాన్ని సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి పూర్తి వివరాలు సేకరించారు. చదువుకోడానికి వచ్చిన విద్యార్థులతో వసతి గృహంలో పని చేయించడంపై ఆర్డిఓ ఆగ్రహం వ్యక్తం చేసి, పూర్తి నివేదిక కలెక్టర్ కు అందజేయనున్నట్లు ఆర్ డి ఓ తెలిపారు. ఇలాంటి ఘటనలు జరిగితే సహించేది లేదని హెచ్చరించారు.

## సీఎం పర్యటన బందోబస్తు ఏర్పాట్లు పరిశీలన

- మల్టీజోన్-2 సత్యనారాయణ



**నారాయణపేట జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 20 (జనం సాక్షి) :** నారాయణపేట జిల్లాలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి పర్యటన సందర్భంగా గురువారం మల్టీజోన్-2 ఐజిపి సత్యనారాయణ ,జోగులాంబ జోన్-7 డిఐజి ఎల్ ఎస్ చౌహన్ ,జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ తో కలిసి ముందస్తు బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు.నారాయణపేట జిల్లాలో సీఎం రేవంత్ రెడ్డి పర్యటన సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు.ముందుగా ఎలిప్యాడ్ నుండి పెట్రోల్ బంకు వరకు అక్కడి నుండి మెడికల్ కాలేజ్ వరకు రూట్ బందోబస్తుని పరిశీలించారు.విఐపి కాన్వాయ్ వెళ్లే సమయం లో ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా రోడ్ ఓపెనింగ్ పార్టీ బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. పబ్లిక్ మీటింగ్కు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మహబూబ్నగర్ మరికల్ దేవరకద్ర నుండి వచ్చే వారికి అప్పక్పల్లి శివారులో మీటింగ్ ప్లేస్‌కు రైట్ సైడ్‌లో పార్కింగ్ ఏర్పాటు చేయడం జరిగిందని,నారాయణపేట మక్తల్ నుండి పబ్లిక్ మీటింగ్ వచ్చే వారికి అప్పగిపల్లి శివారులో మీటింగ్ ప్లేస్ కి లెఫ్ట్ సైడ్ లో పార్కింగ్ ఏర్పాటు చేయడం జరిగిందని పబ్లిక్ మీటింగ్కు వచ్చే వారు తమకు కేటాయించిన ప్రదేశాలలో మాత్రమే పార్కింగ్ చేయాలని తెలిపారు.ప్రజలు అత్యవసర సమయంలో ఎలాంటి ఇబ్బందులు ఉన్నా వెంటనే డయల్100 కి ఫోన్ చేసి పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

## విద్యార్థి వీపుపై వాతల మోతలు..

- వడ తినలేదని వాయించిన గురుకుల ప్రిన్సిపల్..



**షాద్‌నగర్, ఫిబ్రవరి 20 (జనంసాక్షి) :** ఉదయం టిఫిన్ రూపంలో పెట్టే వడ తినలేదని కర్రతో ప్రిన్సిపల్ విద్యార్థి వీపుపై వాయించడంతో వాతలు వచ్చాయి రంగారెడ్డి జిల్లా కొందుర్గ్ మండల కేంద్రములో ఉన్న ఎస్సీ గురుకుల వసతి గృహంలో కొందుర్గ్ మండలం చేర్కుపల్లి గ్రామానికి చెందిన సందీప్ 9వ తరగతి చదువుతున్నడు అయితే ఉదయం 9గంటల సమయంలో అందరూ విద్యార్థులకు వడ వడ్డించారు అయితే కొద్దిగా తిన్న తరువాత మిగిలింది పరవేశాడు సందీప్ దాంతో కోపోద్రిక్తుడైన ప్రిన్సిపల్ ఖుర్షీద్ కర్రతో విద్యార్థి విపులపై వాయించాడు దాంతో విద్యార్థి తల్లితండ్రులకు విషయం తెలియడంతో ప్రిన్సిపల్ ను నిలదీయగా వారికి క్షమించని అడిగానని తెలిపారు.

## పశువైద్యం లేక అల్లాడుతున్న రైతులు

- వైద్యులు లేక భారీగా పశు మరణాలు
- పశు వైద్యులు లేకపోతే ఎలా..?
- రైతు విట్టల్ నాయక్




**జిల్లేడు చౌదరిగూడ/ ఫిబ్రవరి 20 (జనం సాక్షి) :** కాస్త జ్వరం వచ్చిందంటే ఆగమేఘాలమీద వైద్యుల వద్దకు పరిగెడతాం పశువులు కూడా జ్వరాలతో రోగాల బారిన పడుతుంటాయి. ఆపశువులను వైద్యుని వద్దకు తీసుకొద్దామంటే ఒక్కనాడు కూడా పశువైద్యులు కనిపించరు. అప్పుడు రైతు ఆవేదన ఎలా ఉంటుందో ఆ వైద్యుని కె తెలియాలి అంటున్న రైతులు. రంగారెడ్డి జిల్లా జిల్లేడు చౌదరిగుడా మండల కేంద్రంలో ఉన్నటువంటి పశు వైద్యశాల ఎప్పుడు తాళం వేసే ఉంటుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. పశువులు భారీగా చనిపోతున్న వైద్యులు చికిత్స చేయడం లేదు. పశువుల పాల మీద జీవనాధారం సాగిస్తున్న రైతన్నల ఆవేదన అంతా ఇంతా కాదు పశువులు రోగాల బారిన పడి చనిపోతున్న చికిస్తా చేసేందుకు వైద్యులు కనిపించరు. వారి ఆఫీస్కు వచ్చినప్పుడల్లా తాళ్లమే దర్శనం ఇస్తుంది అంటూ రైతన్నలు గగ్గోలు పెడుతున్నారు. విట్టల్ నాయక్ అనే రైతు మాట్లాడుతూ ఈ కార్యాలయానికి వచ్చినప్పుడల్లా ఎవరు కనిపించారు. మా పాడి పశువులు చాలా అనారోగ్యాలకు గురైనవి కనీసం వాటిని చూసే దిక్కు కూడా లేరు. కనీసం అటెండర్, ఆఫీస్ బాయ్, ఉంటారంటే వాళ్లు కూడా డుమ్మాలే. గత సంవత్సరాల నుంచి కొందుర్గ్ మండల్ పశు వైద్యులు ఇన్చార్జిలుగా కొనసాగుతూ వస్తున్నారు. వారితో రైతులకు చాలా ఇబ్బంది ఏర్పడిందని పేర్కొన్నారు.

## ప్రజలను తప్పుదోవ పట్టించే కుటిల ప్రయత్నాలు సంజయ్ మానుకోవాలి

- సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి



**కరీంనగర్ బ్యూరో, ఫిబ్రవరి 20 (జనంసాక్షి) :** కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ ప్రజలను తప్పుదోవ పట్టించే కుటిల ప్రయత్నాలు మానుకోవాలని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి హితవు పలికారు. బిజేపీ అంతర్గత మిత్రుడు కేసిఆర్ నిర్వాకం వల్ల రాష్ట్రం అప్పుల పాలయ్యిందని అయినప్పటికీ రేవంత్ రెడ్డి ప్రభుత్వం చిత్తశుద్ధితో అన్నివర్గాలను ఆదుకుంటూ ప్రజా పాలన అందిస్తే చూస్తూ ఓర్వలేక బండి సంజయ్ అవాకులు చెవాకులు మాట్లాడుతున్నాడని నరేందర్ రెడ్డి మండిపడ్డారు. ఈ సందర్భంగా బండి సంజయ్ కు మద్దతుగా సుడా చైర్మన్ ను విమర్శించిన మాజీ మేయర్ సునీల్ రావు వాఖ్యలను తీవ్రంగా ఖండించారు. నరేందర్ రెడ్డి మాట్లాడుతూ...నరేంద్ర మోడీ గుజరాత్‌లో నాడు ఎమ్మెల్యే కాకముందే ముఖ్యమంత్రి అయ్యారని, నాలుగు సార్లు ఎమ్మెల్యేగా బండి సంజయ్ ఓడిపోలేదా అని, అంతమాత్రాన వీరిద్దరికీ కూడా రాజకీయ పరిపక్వత లేనట్టేనా మాజీ మేయర్ సునీల్ రావు అర్థం చేసుకున్నట్లు ఉందని అన్నారు. నగర కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నరేందర్ రెడ్డి సునీల్ రావు పై ధ్వజమెత్తారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ పై బిజెపియేతర పక్షాలు విమర్శలు చేస్తే కౌంటర్ ఇచ్చేందుకు నిన్న గాక మొన్న వచ్చిన మాజీ మేయర్ సునీల్ రావే దిక్కవడం చూస్తుంటే, బిజెపి పార్టీలో గత కొన్నాళ్ల నుంచి నాయకులుగా కార్యకర్తలుగా కొనసాగుతున్న వాళ్లు నుంచి కనీస స్పందన లేకపోవడం, బండి సంజయ్ బిజెపిలో బలహీన పడ్డట్లు కనిపిస్తోందన్నారు. క్రమశిక్షణ, పరిపక్వత లేని రాజకీయ వ్యభిచారి సునీల్ రావని ఆరోపించారు. టిఆర్ఎస్ పార్టీలో ఉన్నప్పుడు మేయర్ పదవి ఇప్పించాలని వినోద్ కుమార్ ను కరీంనగర్ అభివృద్ధి ప్రదాత, స్మార్ట్ సిటీ ప్రధాత అని సునీల్ రావు ఈరోజు బిజెపిలో చేరగానే బండి సంజయ్ ని అదే నోరుతో కరీంనగర్ అభివృద్ధి ప్రదాతగా పోల్చడం రాజకీయ వ్యభిచారానికి నిదర్శనం అని అభివర్ణించారు. ఈ సమావేశం లో ఎండీ తాజ్, శ్రవణ్ నాయక్, కుర్ర పోచయ్య, గుండాటి శ్రీనివాస్ రెడ్డి, నగేష్ ముదిరాజ్, మామిడి సత్యనారాయణ రెడ్డి, బొబ్బిలి విక్టర్, జీడీ రమేష్, అస్తపురం రమేష్, మ్యాకల నర్సయ్య, జూపాక సుదర్శన్, కాంపెల్లి కీర్తి కుమార్, సిరాజుద్దీన్, ఖమృద్దీన్, ఖలీల్, షైన్షా , భారీ, బషీర్, అమెర్, మాసూమ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్ఆర్ఇజిఎస్ అంశంపై రెండు రోజుల సెమినార్



**రాజేంద్రనగర్, ఫిబ్రవరి 20 (జనంసాక్షి) :** హైదరాబాద్లోని ఎన్ఐఆర్డిపిఆర్ లో "మహాత్మా గాంధీ ఎన్ఆర్ఇజిఎస్ అమలు అవకాశాలు సవాళ్లు" అనే అంశంపై రెండు రోజుల సెమినార్ నిర్వహిస్తున్నారు. జీవనోపాధి, వాతావరణ స్థితిస్థాపకత, డిజిటల్ గవర్నెన్స్, స్కిల్ డెవలప్మెంట్, జెండర్ ఈక్విటీ , ఎస్డిజి (సస్టైనబుల్ డెవలప్మెంట్ గోల్స్) సహా ఆరు ఇతివృత్తాలపై దేశవ్యాప్తంగా ఉన్న పండితులు అభ్యాసకులు పత్రాలను సమర్పించారు. ఐఎఫ్పిఆర్ఐకి చెందిన సీనియర్ రీసెర్చ్ ఫెలో డాక్టర్ సుధా నారాయణన్ కీలకోపన్యాసం చేశారు. మహాత్మా గాంధీ ఎన్ఆర్ఇజిఎస్ గతం, వర్తమానం, భవిష్యత్తు గురించి ఆమె నొక్కి చెప్పారు. ఎన్ఐఆర్డి, పిఆర్ ప్రొఫెసర్ డాక్టర్ రవీంద్ర ఎస్. గవాలి ప్రారంభోపన్యాసం చేశారు. డాక్టర్ సి. ధీరజ ప్రతినిధులను స్వాగతించారు. సెమినార్ యొక్క రోడ్మ్యాప్ను రూపొందించారు.

ప్రారంభ సమావేశంలో నైరూప్య పుస్తకాన్ని కూడా విడుదల చేశారు. సెంటర్ ఫర్ వేజ్ ఎంప్లాయిమెంట్ అండ్ లైవ్లీహుడ్స్ (సిడబ్ల్యుఇఎల్) ఎన్ఐఆర్డ్ పిఆర్ కు చెందిన డాక్టర్ సోనాల్ మొబర్ రాయ్, డాక్టర్ సి. ధీరజ డాక్టర్ దిగంబర్ ఎ. చిమాంకర్ ఈ సదస్సును సమన్వయం చేస్తున్నారు.

## నర్సాపూర్ బీబీఆర్ఐటీలో బాహ సే ఇండియా 2025 పోటీలు ప్రారంభం

**నర్సాపూర్, ఫిబ్రవరి 20 (జనం సాక్షి) :** ఇంజినీరింగ్ సృజనాత్మకత, అద్భుత ప్రదర్శనకు నిలయమైన 'బాహ సే ఇండియా 2025' మెదక్ జిల్లా నర్సాపూర్లో గల బీవీ రాజు ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో ముఖ్య అతిథి రెనాల్ట్ నిస్సాన్ టెక్నాలజీ, బిజినెస్ సెంటర్ ఇండియా వైస్ ప్రెసిడెంట్ (హ్యూమన్ రిసోర్సెస్) సిమోనా అడెలినా పోపోవిసీ ప్రారంభించారు,ముఖ్య అతిథులుగా శ్రవణ్ కుమార్, టెరిటరీ మేనేజర్, బీపీసీఎల్,మయాంక్ ధింగ్రా, అసిస్టెంట్ ఎడిటర్, ఆటోకార్ ప్రొఫెషనల్,ఈ కార్యక్రమానికి హాజరయ్యారు, ఈ బాహ సే ఇండియా నిర్వాహక కమిటీ అధ్యక్షుడు బాలరాజు సుబ్రహ్మణ్యం,శ్రీ విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ వైస్ చైర్మన్ రవిచంద్రన్ రాజగోపాల్, బాహ సే ఇండియా సలహాదారు డాక్టర్ కె.సి. వోరా,బాహ సే ఇండియా జాయింట్ కన్వీనర్ మనోనీత్ సింగ్,బాహ సే ఇండియాకో-కన్వీనర్ ప్రణవ్ ఖటేకర్ లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ ప్రతిష్టాత్మక అంతర్ కళాశాలల ఈవెంట్ సొసైటీ ఆఫ్ ఆటోమోటివ్ ఇంజినీర్స్ (ఎస్ఏఈ), శ్రీ విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ సహకారంతో ఎస్ఏఈ బాహ సే ఇండియాతో కలిసి నిర్వహిస్తుంది. ఈ ఏడాది బాహ సే ఇండియా పదో వార్షికోత్సవాన్ని జరుపుకుంటుంది. విద్యుత్ వాహనాల అభివృద్ధికి, స్థిరమైన ఇంజినీరింగ్కు మార్గదర్శిగా నిలిచిన ఈ విభాగం, దేశవ్యాప్తంగా యువ ఇంజినీరింగ్ ప్రతిభను ప్రోత్సహించే ఒక గొప్ప వేదికగా మారింది. ఇటీవల ఎం బాహ సే, హెచ్ బాహ సే విభాగాల కింద బెంజిన్ (గాసోలిన్), హెచ్సీఎన్జీ ఆధారిత బగ్గీల ఫేజ్ 3 పోటీ నాట్రాక్స్ పితంపూర్ వద్ద నిర్వహించారు. దీనిని కేంద్ర రోడ్డు




రవాణా, హైవే మంత్రి నితిన్ గడ్కరీ ప్రారంభించారు. ఈ ఈవెంట్ భారత్లోని మొట్టమొదటి హెచ్సీఎన్జీ ఆధారిత బగ్గీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. 60 పైగా జట్లు ఈ పోటీలో తమ సాంకేతిక నైపుణ్యాలను ప్రదర్శించాయి. ఇప్పుడు అందరి దృష్టి బాహ సే ఇండియా విభాగంపై ఉంది. విద్యుత్ ఆధారిత ఆల్-టెర్రైన్ వాహనాల (ఏటీవీల) రూపకల్పన, తయారీ, పనితీరును పరీక్షించే ఈ పోటీ దేశంలోని ప్రతిభావంతులైన యువ ఇంజినీర్లకు అసాధారణ వేదికగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై ఈ సందర్భంగా రెనాల్ట్ నిస్సాన్ టెక్నాలజీ, బిజినెస్ సెంటర్ ఇండియా వైస్ ప్రెసిడెంట్ (హ్యూమన్ రిసోర్సెస్) సిమోనా అడెలినా పోపోవిసీ మాట్లాడుతూ రెనాల్ట్ నిస్సాన్లో డైవర్సిటీ, సమానత్వం, అంతర్గతతను ప్రోత్సహించడానికి నిబద్ధతతో ఉన్నామన్నారు.ఈ సందర్భంగా బాహ సే ఇండియా నిర్వాహక కమిటీ అధ్యక్షుడు బాలరాజు సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ. ఈ పద్దెనిమిదో సంచిక ఎంతో ప్రత్యేకం అన్నారు. ఇప్పుడు పదో వార్షికోత్సవాన్ని పూర్తి



చేసుకుంటుందని చెప్పారు. 2015లో కేవలం 8 జట్లతో ప్రారంభమైన ఈ బాహ సే ఇప్పుడు 85 పైగా జట్లు పోటీ పడే స్థాయికి ఎదిగిందన్నారు. ఇప్పుడు అనేక విభాగాలను కలిగి ఉన్న బహుముఖ వేదికగా రూపాంతరం చెందిందన్నారు. ఈ సందర్భంగా శ్రీ విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యదర్శి ఆదిత్య విస్సం మాట్లాడుత బాహసే ఇండియా ఎప్పుడూ యువ ఇంజినీరింగ్ ప్రతిభకు గొప్ప వేదిక అన్నారు. ఈ ప్రతిష్టాత్మక ఈవెంట్కు రెండోసారి ఆతిథ్యం ఇవ్వడం గర్వంగా ఉందన్నారు. ఈ ఏడాది ఈ బాహ సే 85 పైగా జట్లతో గరిష్ట స్థాయికి చేరుకుందన్నారు. ఇది నిజంగా అద్భుతం అన్నారు. ఈ కార్యక్రమంలో ఆటోకార్ ప్రొఫెషనల్, అసిస్టెంట్ ఎడిటర్ మయాంక్ ధింగ్రా, శ్రీ విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ వైస్ చైర్మన్ రవిచంద్రన్ రాజగోపాల్, బాహ సే ఇండియా అడ్వైజర్ డాక్టర్ కేసీ వోరా, బాహ సే ఇండియా జాయింట్ కన్వీనర్ మనోనీత్ సింగ్, కో కన్వీనర్ ప్రణవ్ ఖటేకర్ వివిధ కాలేజీల విద్యార్థులు విద్యార్థినిలు కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## 15 అంశాలకు 6టేబుల్ ఐటమ్లకు కమిటీ ఆమోదం

- ప్రభుత్వం జీహెచ్ఎంసీకి 700 కోట్లు విడుదల
- ఎస్టేట్స్లో వస్తున్న ఆదాయం, ఆస్తుల వివరాలను అందించాలి

**హైదరాబాద్, ఫిబ్రవరి 20 (జనంసాక్షి)** నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అధ్యక్షతన గురువారం 8వ స్టాండింగ్ కమిటీ సమావేశం జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూంలో జరిగింది. ముఖ్యంగా జీహెచ్ఎంసీలో వివిధ రహదారుల విస్తరణ, మల్టీలెవల్ ఫ్లైఓవర్స్ నిర్మాణాలకు సంబంధించి ప్రభుత్వ అనుమతి కొరకు కార్పొరేషన్ ద్వారా సిఫార్సు చేస్తూ కమిటీ ఆమోదం తెలిపింది. కమిటీ సమావేశంలో 15 అంశాలు, 6 టేబుల్ ఐటమ్ లకు సభ్యులు ఆమోదించినట్లు మేయర్ తెలిపారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ...




స్టాండింగ్ కమిటీ సమావేశాలు అన్ని కూడా ఆరోగ్యకరమైన స్నేహపూరిత వాతావరణంలో జరిగాయని, పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి పూర్తి చేసుకున్నామని, అందుకు పూర్తి స్థాయిలో స్టాండింగ్ కమిటీ సభ్యులందరూ సహకరించినందుకు ధన్యవాదాలు తెలిపారు. ప్రభుత్వం జీహెచ్ఎంసీ అభివృద్ధికి ఈ సంవత్సర కాలంలో 700 కోట్ల రూపాయాలు విడుదల చేసిందని తెలిపారు. ఈ సమావేశంలో స్టాండింగ్ కమిటీ సభ్యులు బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్, మహమ్మద్ ముజాఫర్ హుస్సేన్, ఫాహెద్ బిన్ అబ్దుల్ సమద్ బిన్ అబ్దత్, మహమ్మద్ ఖాదిర్, పొడవు అర్చన, మహమ్మద్ నజీర్ ఉద్దీన్, గౌస్ ఉద్దీన్ మహమ్మద్, మహమ్మద్ రషీద్ ఫరాజుద్దీన్, సబీహా బేగం, ఆవుల రవీందర్ రెడ్డి, కంది శైలజ, అడిషనల్ కమిషనర్లు శివ కుమార్ నాయుడు, నళిని పద్మావతి, గీతా రాధిక, చంద్రకాంత్ రెడ్డి, సత్యనారాయణ, సుభద్రాదేవి, అశోక్ సామ్రాట్, అలివేలు మంగతాయారు, పంకజ, యాదగిరి రావు, రఘు ప్రసాద్, ఈ.ఎన్.సి భాస్కర్ రెడ్డి, సీ.ఈ కోటేశ్వరరావు, జోనల్ కమిషనర్లు హేమంత్ కేశవ్ పాటిల్, అపూర్వ చౌహాన్, అనురాగ్ జయంతి, రవికిరణ్, వెంకన్న, ఉపేందర్ రెడ్డి, చీఫ్ వెటర్నరీ అధికారి అబ్దుల్ వకీల్, చీఫ్ ఎగ్జామినర్ (అకౌంట్స్) వెంకటేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మాదకద్రవ్యాల సరఫరా మహిళ అరెస్ట్

- 60 గ్రాముల ఎండిఎంఏ స్వాధీనం

**శేరిలింగంపల్లి, ఫిబ్రవరి 20 (జనంసాక్షి) :** గత కొంతకాలంగా మాదకద్రవ్యాల సరఫరాకు పాల్పడుతూ డ్రగ్ పెడలర్గా స్థిరపడిన ఓ మహిళా నిందితురాలిని తెలంగాణ రాష్ట్ర మాదక ద్రవ్యాల నిరోధక విభాగం రంగారెడ్డి జిల్లాకు చెందిన అధికారులు అదుపులోకి తీసుకొని గురువారం రిమాండ్ కు తరలించారు. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలను మాదాపూర్ డిసిపి డాక్టర్ జి వినీత్ వెల్లడించారు. ఝార?ండ్ రాష్ట్రం జంషేర్ పూర్ కు చెందిన శతాబ్ది మన్న(24) పట్టభద్రురాలు అయ్యుండి బ్రతుకుతెరువు కోసం బెంగళూరు నగరానికి వచ్చి స్థిరపడింది. ఈ నేపథ్యంలో ఆఫ్రికా దేశానికి చెందిన వారెన్ కుకరాంగో తో నాకు 2024 లో పరిచయం ఏర్పడింది. ఈ క్రమంలో హైదరాబాద్ నగరంలోని మదకద్రవ్యాలకు అలవాటు పడిన కొంతమందికి డ్రగ్స్ ను సరఫరా చేస్తే ఆకర్షనీయమైన నగదును చెల్లిస్తానని ఆశ చూపడంతో ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా దశాబ్ది మన్న మాదకద్రవ్యాల సరఫరాకు అంగీకరించి ఇప్పటివరకు దాదాపు పది పర్యాయాలు బెంగళూరు నుండి ఒక్కోసారి 100 నుండి 200 గ్రాముల మత్తు పదార్థాలను తీసుకువచ్చి ఇక్కడి వినియోగదారులకు అందజేస్తూ సొమ్ము చేసుకుంటుంది. ఈ క్రమంలో టిజి నాబ్ పోలీసు అధికారులు, మాదాపూర్ జోన్ పోలీస్ అధికారులు ఒక బృందంగా ఏర్పడి ఈనెల 19వ తేదీన మియాపూర్ బస్ స్టాప్ సమీపంలో మాదకద్రవ్యాల వినియోగదారుకు ఎండిఎంఏ డ్రగ్ను




అందజేయనుందన్న విశ్వాసనీయ సమాచారం మేరకు దాడి చేసి శతాబ్ది మన్నను అదుపులోకి తీసుకొని తనిఖీ నిర్వహించగా ఆమె వద్ద ఆరు లక్షల రూపాయల విలువ చేసే 60 గ్రాముల ఎండిఎంఏ మత్తు పదార్థం లభించింది. ఈ మేరకు కేసును నమోదు చేసుకుని నిందితురాలని రిమైండ్ కు తరలించి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. కాగా ప్రధాన డ్రగ్ సప్లయర్ అయిన వారెన్ కుకరాంగో పరారీలో ఉన్నట్లు పోలీసు అధికారులు తెలిపారు. యువకులు, విద్యావంతులు, నిరుద్యోగులు క్షణికానందం కోసం మత్తుకు బానిస కాకూడదని, తద్వారా ఆర్థిక, మానసిక, శారీరక నష్టం జరిగి జీవితాలు నాశనం అయ్యే అవకాశం ఉందని, ఎవరికైనా సరే అపరిచిత వ్యక్తులు, మత్తు పదార్థాలను సరఫరా చేస్తున్న అనుమానం కలిగే పరిస్థితులు కనిపించినా 8712671111/1908 నెంబర్కు డయల్ చేసి సమాచారం అందించాలని టిజి నాబ్ పోలీస్ అధికారులు సూచించారు.

## సీఎం పర్యటన ఏర్పాట్లను పర్యవేక్షించిన అధికారుల బృందం



**నారాయణపేట జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 20 (జనం సాక్షి) :** రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుక్రవారం నారాయణపేట మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన ప్రారంభోత్సవాలు చేసేందుకు వస్తున్న సందర్భంగా గురువారం రాష్ట్ర హెల్త్ డైరెక్టర్ క్రిస్టినా, ఎడ్యుకేషన్ డైరెక్టర్ నరసింహారెడ్డి, ఐ అండ్ పి ఆర్ కమిషనర్ హరీష్, జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ తో కలిసి జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ సీఎం పర్యటన ఏర్పాట్లను పర్యవేక్షించారు. సింగారం చౌరస్తాలోని హెలిప్యాడ్ స్థలాన్ని, సమీపంలోనే గల నూతన పెట్రోల్ బంక్, వృత్తి నైపుణ్య అభివృద్ధి కేంద్రాన్ని అధికారుల బృందం పరిశీలించారు. అనంతరం మండలంలోని అప్పక్ పల్లి వద్ద సీఎం భూమి పూజ చేసే ఇందిరమ్మ ఇంటి స్థలాన్ని పరిశీలించి ఆ తర్వాత మెడికల్ కళాశాలకు చేరుకొని అక్కడ సీఎం చేతుల మీదుగా జరిగే శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల వివరాలను తెలుసుకున్న అధికారులు వాటికి సంబంధించిన ఏర్పాట్లు ఎంతవరకు వచ్చాయని అక్కడి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎక్కడా ఏ చిన్న పొరపాటు జరగకుండా సీఎం కార్యక్రమ ఏర్పాట్లు చేయాలని స్టేట్ హెల్త్ డైరెక్టర్ క్రిస్టినా అక్కడి అధికారులను ఆదేశించారు. మెడికల్ కళాశాల వద్ద జరిగే శంకుస్థాపనలు ప్రారంభోత్సవాల పై చర్చించారు. చివరగా సీఎం పాల్గొనే బహిరంగ సభ వద్ద జరుగుతున్న ఏర్పాట్లను వారు పర్యవేక్షించారు. వేదిక పక్కన గ్రీన్ రూమ, వేదికపై సీటింగ్ కెపాసిటీ, వీఐపీల గ్యాలరీ తదితర వాటిపై చర్చించారు. అన్ని ఏర్పాట్లను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీజీ ఎమ్ ఐ డి సి సి. ఈ దేవేందర్, ఎస్ ఈ సురేందర్ రెడ్డి, మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ రామ్ కిషన్, ఆర్ అండ్ బి ఎస్. ఈ, వనజా రెడ్డి, ఈ ఈ దేశాయ్ తదితరులు పాల్గొన్నారు.

## ట్వినింగ్ ఆఫ్ స్కూల్స్ను పాఠశాలలు సమర్థవంతంగా వినియోగించుకోవాలి

- జిల్లా కలెక్టర్ మార్గదర్శకాలను పాటించాలి
- జిల్లా విద్యాశాఖ అధికారి డి.వాసంతి



**వరంగల్ బ్యూరో, ఫిబ్రవరి 20 (జనం సాక్షి) :** హనుమకొండ జిల్లాలోని పీఎం శ్రీ పాఠశాలలకు నిధుల రూపంలో విస్తృత అవకాశాలు వస్తున్నాయి. జిల్లాలోని 19 పాఠశాలలకు ట్విన్నింగ్ ఆఫ్ స్కూల్స్ పథకం కింద 13 పాఠశాలలకు 20వేల రూపాయల చొప్పున ఆరు పాఠశాలలకు 35 వేల రూపాయల చొప్పున నిధులు మంజూరు కావడం జరిగింది. అయితే జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ నిధులు పొందిన పాఠశాలలను ఎన్ఐటి వరంగల్ తో అనుసంధానం చేయడం జరిగింది. ప్రాథమిక పాఠశాలలను మాత్రం అదే మండలంలోని ఒక ఉన్నత విద్యా సంస్థ/ పాఠశాల సందర్శించే విధంగా ఏర్పాట్లు చేయడం జరిగిందని జిల్లా విద్యాశాఖ అధికారి డి.వాసంతి తెలిపారు. ఎన్ఐటి విద్యాసంస్థను సందర్శించినప్పుడు విద్యార్థులకు ఎన్ఐటి వరంగల్ లో కలగా అవకాశాలను తెలపటం మాత్రమే కాకుండా అక్కడే సైన్స్ ల్యాబ్లను, వర్కు షాపులను, ఆడిటోరియంను, తరగతి గదులను అన్నింటినీ సందర్శించే విధంగా ఏర్పాట్లు చేశారు. ఈ సౌకర్యాన్ని విద్యార్థులు ఉపయోగించుకునేలా ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు కృషిచేసి విద్యార్థులలో స్ఫూర్తిని నింపాలని జిల్లా విద్యాశాఖ అధికారి తెలిపారు.ఈ కార్యక్రమానికి సమన్వయకర్తగా జిల్లా ప్లానింగ్ కోఆర్డినేటర్ బోయినపల్లి మహేష్ వ్యవహరిస్తున్నారు.

## గంజాయి సాగు, నాటుసారా తయారీపై ఉక్కుపాదం మోపండి

**నాగర్కర్నూల్ జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 20 (జనంసాక్షి) :** జిల్లాలో గంజాయి, నాటు సారా రహిత జిల్లాగా మార్చేందుకు ఎక్సైజ్, పోలీస్ శాఖల అధికారులు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం నాగర్ కర్నూల్ కలెక్టరేట్ లోని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, జిల్లా ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ ఎమ్మెల్యేలు డాక్టర్ రాజేష్ రెడ్డి, డాక్టర్ వంశీకృష్ణ, కసిరెడ్డి నారాయణరెడ్డి లతో కలిసి ఎక్సైజ్ పోలీస్ అధికారులతో జిల్లాలో గంజాయి, నాటు సారా రహిత జిల్లాగా మార్చేందుకు మంత్రి జూపల్లి కృష్ణారావు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ



సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ... దేశానికి యువత అత్యుత్తమమైన సంపద అని తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు చేపట్టిన అవగాహన కార్యక్రమాలను, తనిఖీల్లో నమోదు చేసిన కేసుల వివరాలను జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, జిల్లా ఎస్పి గైక్వాడ్ వైభవ్ రఘునాథులు మంత్రికి వివరించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు అమరేందర్, దేవ సహాయం, ఎక్సైజ్ పోలీస్ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అతిథి సహయోగ్ సమితికి రాష్ట్ర గవర్నర్ సహకారం

**శేరిలింగంపల్లి, ఫిబ్రవరి 20 (జనంసాక్షి) :** సేవా దృక్పథం తో ముందుకు సాగుతూ సమాజ హితం కోసం కృషి చేస్తున్న అతిథి సహయోగ్ సమితి కి భవిష్యత్తులో అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందిస్తానని రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ హామీని ఇవ్వడం జరిగిందని సమితి రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు అజిత్ కుమార్ సేనాపతి పేర్కొన్నారు. ఈ మేరకు సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి త్రిపాఠి ప్రసాద్తో కలిసి గురువారం రాష్ట్ర గవర్నర్ను వారు మర్యాదపూర్వకంగా



కలుసుకొని అతిథి సహయోగ్ సమితి చేపడుతున్న సేవా కార్యక్రమాలను, ఇతర రాష్ట్రాల నుండి తెలంగాణకు వచ్చే స్థిరపడిన ప్రజల సంక్షేమం కోసం చేస్తున్న కృషిని వివరించారు. ఈ కార్యక్రమంలో అతిథి సహయోగ్ సమితి ప్రతినిధులు అమరేంద్ర ప్రతాప్ సింగ్, వెంకటరమణయ్య, పిఎస్ఎన్ రాజు, పవన్ కుమార్, రాజేష్ శెట్టి తదితరులు పాల్గొన్నారు.

## వికారాబాద్లో రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు

- లాంఛనంగా ప్రారంభించిన స్పీకర్
- మూడు రోజులపాటు జరగనున్న పోటీలు

**వికారాబాద్ జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 20 (జనం సాక్షి) :** తెలంగాణ రాష్ట్ర స్థాయికబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో వికారాబాద్ పట్టణం సాకేత్ నగర్ లోని గౌలికర్ నర్సింగ్ ఫంక్షన్ హాల్ లో జరుగుతున్న 34వ సబ్ జూనియర్ అంతర్ జిల్లా బాల, బాలికల కబడ్డీ చాంపియన్ షిప్ పోటీలను తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి, గడ్డం ప్రసాద్ కుమార్ లాంఛనంగా ప్రారంభించారు. గురువారం సాయంత్రం ఈ పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా స్పీకర్ ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ..యువకులకు, విద్యార్థులకు విద్యతో పాటుగా ఆరోగ్యం కూడా అత్యంత ముఖ్యమైనదని అన్నారు. ప్రతి ఒక్కరు మంచి ఆరోగ్యం కోసం రోజులో కొంత సమయాన్ని క్రీడలు, వ్యాయామం కోసం కేటాయించాలి. క్రీడలతో శారీరకంగా, మానసికంగా శక్తి సామర్థ్యాలు పెరుగుతాయి. కలిసి ఆడడం వలన క్రీడాకారులలో నాయకత్వ లక్షణాలు వస్తాయని తెలియజేశారు.కబడ్డీ మన దేశ జాతీయ క్రీడ, పూర్వకాలం



నుండి ఇది గ్రామీణ క్రీడ. కబడ్డీ ఆటకు, ఆటగాళ్లకు ఎప్పుడూ ఆదరణ లభిస్తుందని అన్నారు .కబడ్డీ ఆటతో శరీరానికి మంచి వ్యాయామం అవుతుంది. కబడ్డీ క్రీడాకారులు ఆరోగ్యంగా ఉంటారు. ప్రతిభ కలిగిన క్రీడాకారులను నేను ఎల్లప్పుడు ప్రోత్సహిస్తూ అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి తెలంగాణాలో క్రీడాకారులను ప్రోత్సహించడానికి స్పోర్ట్స్ యునివర్సిటీని ఏర్పాటు చేశారని గుర్తు చేశారు.మీరు జిల్లా స్థాయి నుండి రాష్ట్ర, దేశ స్థాయితో పాటుగా అంతర్జాతీయ స్థాయిలో కూడా రాణించి వికారాబాద్ జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని కోరుకుంటున్నాను.విజయం సాదించడానికి ప్రతి క్రీడాకారుడు పోరాడాలి. కానీ ఆటలో గెలుపు ఓటమిలు సహజం, రెండింటిని సమానంగాతీసుకోవాలి.వికారాబాద్ జిల్లా కేంద్రంలో ఇండోర్, ఔట్ డోర్ స్టేడియాల నిర్మాణానికి అయిదు ఎకరాలు కేటాయింపు జరిగింది, నిర్మాణానికి అవసరమైన ఏడు కోట్ల రూపాయలను ప్రభుత్వం తరుపున మంజూరుకు కృషి చేస్తాను.కేసీఆర్ ప్రభుత్వం పదేళ్ళలో క్రీడలను ప్రోత్సాహించక నిర్వీర్యం చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం వచ్చాక క్రీడలకు ప్రోత్సాహాన్ని ఇస్తున్నారు. ఈ మధ్య కాలంలో సీఎం కప్ పేరుతో ప్రతి గ్రామంలో, పట్టణంలో క్రీడలను నిర్వహించి క్రీడాకారులను ప్రోత్సహించారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడలలో పాల్గొంటున్న క్రీడాకారులను రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహించడం జరుగుతుందని అన్నారు . ఈ కార్యక్రమం క్రీడాకారులు నాయకులు పాల్గొన్నారు.

## బీజేఎంసీలో రూ.4.23 కోట్లతో అభివృద్ధి పనులు

- ప్రారంభించిన ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్

**హైదరాబాద్, ఫిబ్రవరి 20 (జనంసాక్షి) :** కార్పొరేషన్ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్నానని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ పేర్కొన్నారు గురువారం బండ్లగూడ జాగీర్ నగర పాలక సంస్థ పరిధిలో రూ.4.23 కోట్లతో అభివృద్ధి పనులను కమిషనర్ శరత్ చంద్రతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. అభివృద్ధి పనులుగా14వ డివిజన్లోని స్నేతహిల్స్లో రూ.50 లక్షల తో నూతన యుజిడి నిర్మాణం కు శంకుస్థాపన. 6వ డివిజన్ లోని పిఅండ్ టి కాలనీ సి-బ్లాక్ లో రూ.80 లక్షలతో నూతన యుజిడి నిర్మాణం



కు శంకుస్థాపన. 17వ డివిజన్లోని ప్రశాంత్ నగర్ కాలనీ లో రూ.108 లక్షలు తో నూతన సెంట్రల్ మీడియన్ బిటి రోడ్డు నిర్మాణంకు శంకుస్థాపన. 11వ డివిజన్ లోని దర్గా ఖాలీజ్ ఖాన్ లో 150 లక్షలతో నిర్మించిన వైకుంఠదామం ప్రారంభం. బండ్లగూడ జాగీర్ నగర పాలక సంస్థ డంప్ యార్డ్ లో రూ.35 లక్షలతో నిర్మించిన నూతన రోడ్డును ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ రాందాస్ ముదిరాజ్,డిఇఇ జి. యాదయ్య , ఎఇఇ వి. రాజ్ కుమార్ , మాజీ మేయర్ మహేందర్ గౌడ్, నాయకులు కృష్ణారెడ్డి, గోకరి సురేష్ గౌడ్, పాపయ్య యాదవ్, సయ్యద్ కాజా, సుమన్ గౌడ్, మాజీ కో ఆప్షన్ సభ్యుల మలాకి రత్నం, తలారి ప్రేమ్ కుమార్ స్థానికులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం
21 ఫిబ్రవరి 2025
తెలంగాణ



# 50 ఏళ్ల ఉద్యమ తలపోత ఉద్వేగ భరిత కలబోత

### 50 ఏండ్ల విద్యార్థి ఉద్యమం.. అనేక వివక్షలను ప్రశ్నించింది : ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం

- పోరాడి సాధించుకున్న హక్కులను హరిస్తున్న పాలకులు
- భగత్ సింగ్ మేనల్లుడు ప్రొఫెసర్ జగ్ మోహన్ సింగ్
- అట్టహాసంగా విప్లవ విద్యార్థి ఉద్యమ ప్రస్థానం సదస్సు ప్రారంభం

**హైదరాబాద్, ఫిబ్రవరి 20 (జనంసాక్షి) :**
50 ఏండ్ల విద్యార్థి ఉద్యమ సుధీర్ఘ ప్రయాణం అనేక వివక్షలను ప్రశ్నించిందని, మహిళ, దళిత, తెలుగు మీడియం విద్యార్థుల పట్ల సాగిన వివక్షలపైనా విప్లవ విద్యార్థి ఉద్యమం పని చేస్తోందని ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో పూర్వ విప్లవ విద్యార్థులు 50 ఏండ్ల విప్లవ విద్యార్థి ఉద్యమ ప్రస్థానంపై గురువారం సదస్సు ప్రారంభించారు. ఈ సదస్సు శుక్రవారమూ జరగనుంది. ఈ సదస్సులో 5 దశాబ్దాల ఉద్వేగ భరిత ఉద్యమ సహచర్యాన్ని నెమరువేసుకున్నారు.

పూర్వ విద్యార్థుల అధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముందుగా అమరవీరుల జెండాను కామ్రేడ్ పులి అంజయ్య తల్లి సోమ నరసమ్మ ఆవిష్కరించారు. అనంతరం కామ్రేడ్ ఆజాద్ (చెరుకూరి రాజ్‌కుమార్) సహచరి పద్మ అమరవీరుల స్థూపాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సుందరయ్య విజ్ఞాన కేంద్రం హాలు ఎదుట విద్యార్థి అమరులకు పూర్వ విద్యార్థులు, పలువురు ప్రజా సంఘాల నాయకులు నివాళులర్పించారు. విద్యార్థి అమర వీరుల ఆశయాలను కొనసాగిస్తాం, విప్లవ విద్యార్థి అమరులకు జోహార్.. జోహార్ అంటూ విప్లవ గేయాలు, నినాదాలతో సుందరయ్య విజ్ఞాన భవన్ నినాదాలతో మార్మోగింది. ఈ సందర్భంగా ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ విద్యార్థి ఉద్యమ జ్ఞాపకాలు, ఆ నాటి సామాజిక సందర్భం, చరిత్ర, విద్యార్థుల ఆశయాలు, ఆదర్శాలు, త్యాగాలను గుర్తుచేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

### తెలంగాణలో పోరాటమే విప్లవానికి బాట : ఆర్ఎస్‌యూ మాజీ నాయకులు శివారెడ్డి

విద్యార్థులందరికీ చైతన్య దీపికగా ఉన్నటువంటి వరవరరావు ఈరోజు జైలు నిబంధనలో ఉన్నారని ఆర్ఎస్‌యూ మాజీ నాయకులు శివారెడ్డి అన్నారు. భారత విప్లవోద్యమంలో వస్తున్న నేపథ్యంలో తెలంగాణలో నిర్మించిన పోరాటమే విప్లవానికి బాటగా నిలుస్తుందన్నారు. విప్లవోద్యమ విజయానికి విప్లవ విద్యార్థి ఉద్యమం అవసరమన్నారు. దానికోసమే రాడికల్ విద్యార్థి సంఘం ఏర్పడిందని గుర్తు చేశారు.

### సమాజ మార్పుకోసం ఏకతాటిపైకి రావాలి : డాక్టర్ గోపీనాథ్

ప్రపంచీకరణ తర్వాత జాతీయ రాజ్యాలు నశించిపోయాయని డాక్టర్ గోపీనాథ్ అన్నారు. ప్రస్తుత ప్రభుత్వాలన్నీ ప్రపంచ కాబూలీవాలాలనీ వ్యాఖ్యానించారు. 780ల కాలంలో విద్యార్థులు ఉద్యమాల్లోకి వచ్చేవాళ్ళు నేడు ఆ పరిస్థితి లేదన్నారు. సమాజ మార్పు కోసం కోరే వాళ్లంతా ఏకతాటి పైకి రావాలని అన్నారు.

### ఐక్య ఉద్యమాలతో ఫాసిజాన్ని ఓడించాలి : పీడీఎస్‌యూ మాజీ నాయకుడు ప్రదీప్

70 ఏళ్ల కాలంలో విశ్వవిద్యాలయాలన్నీ విప్లవ కేంద్రాలుగా ఉన్నాయని పీడీఎస్‌యూ మాజీ నాయకుడు ప్రదీప్ అన్నారు. ఇప్పుడు విద్యార్థులు ఎలాంటి కార్యక్రమాలు చేయడం లేదన్నారు. అన్ని విలువలపై ముప్పేట దాడి జరుగుతున్న సందర్భంలో అందరూ ఐక్యంగా ఉద్యమాలు నిర్మించి ఫాసిజాన్ని ఓడించాలన్నారు.


### ఆనాటి పోరాట స్ఫూర్తితో ముందుకెళ్లాలి : సూరపనేని జనార్ధన్ సోదరుడు మోహన్ రావు

70, 80 కాలం నాటి విద్యార్థి పోరాటాలను స్ఫూర్తిగా తీసుకొని ముందుకు తీసుకుపోవాలని సూరపనేని జనార్ధన్ సోదరుడు మోహన్ రావు అన్నారు.








### మానవీయ విలువలు నిలబెట్టాలి : ప్రొఫెసర్ కాత్యాయిని విద్మహే

ఆర్ఎస్‌యూ విద్యార్థులు అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పడానికే తాను మార్క్సిజం చదువుకున్నానని ప్రొఫెసర్ కాత్యాయిని విద్మహే అన్నారు. 80వ దశకంలో తరగతి గదిలో విద్యార్థులకు ప్రొఫెసర్లకు మధ్య చర్చ జరిగేదని ఇప్పుడు అలాంటి వాతావరణం లేదని అన్నారు. నాటి విద్యార్థులు విలువలతో కూడిన సమాజాన్ని నిర్మించేందుకు నిరంతరం కృషి చేసేవారు అన్నారు. నేడు ఆ పరిస్థితి ఎక్కడ కనిపించడం లేదన్నారు. విలువలు మృగ్యమైన ప్రస్తుత సమాజంలో మానవీయ విలువలను నిలబెట్టడమే ఎలా అనేది మన ముందున్న ప్రశ్న అని అన్నారు.

### పోరాడి సాధించుకున్న హక్కులను హరిస్తున్న పాలకులు

#### భగత్ సింగ్ మేనల్లుడు ప్రొఫెసర్ జగ్ మోహన్ సింగ్

ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా భగత్ సింగ్ మేనల్లుడు ప్రొఫెసర్ జగ్ మోహన్ సింగ్ పాల్గొని ప్రసంగించారు. బీజేపీ పాలనలో ప్రజలకు మేలు జరగదని, దోపిడీ హింస దౌర్జన్యాలు పెరుగుతున్నాయని తెలిపారు.ఇవి పోవాలంటే సమాజంలో విప్లవం రావాల్సిన అవసరం ఉందన్నారు. ఇవన్నీ దూరం కావా లంటే ఐక్య ఉద్యమాలు అవసరమన్నారు. 1920లో దేశంలో ఎటువంటి ఆర్థిక సంక్షో భం ఉండేదో ఇప్పుడు కూడా అదే పరిస్థితి నెలకొందన్నారు. నాడు భగత్ సింగ్ విప్లవోద్య మాలను నిర్మించి దేశాన్ని సమర్థం చేశారని, అలాగే రాడికల్ స్టూడెంట్స్ కూడా ఉద్యమాలు నిర్మించి ప్రజలను చైతన్యం చేశారని, స్వాతం త్ర్య ఉద్యమ కాలంలో పోరాడి సాధించుకున్న హక్కులను కూడా నేటి పాలకులు హరిస్తున్నా రని దుయ్యబట్టారు. ప్రజల మౌలిక హక్కుల నూ కాలరాస్తున్నారన్నారు. బ్రిటీష్ పాలకులను ఎదిరించడానికి భారతదేశంలో గద్దర్ పార్టీ పుడితే నేడి సమాజాన్ని మార్పు కోసం రాడికల్ విద్యార్థులు పోరాడారని అన్నారు.



### 70 ఏండ్లనాటి పోరాటమే మార్గదర్శకం : ప్రొఫెసర్ హరగోపాల్

పాలకులు ఇప్పుడు నేరుగానే ప్రజలపై యుద్ధం చేస్తున్నారని ప్రొఫెసర్ హరగోపాల్ అన్నారు. ప్రస్తుత సంక్షోభ కాలంలో మనుషులు మిగలడమే ఒక సవాలుగా మారిందని అన్నారు. ఈ పరిస్థితుల్లో 70, 80ల కాలం నాటి విద్యార్థి పోరాటాలు సమాజానికి మార్గదర్శకం కావాలని అన్నారు.







Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370